www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
05-12-2024

సంపుటి : 01 | సంచిక : 213 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



## ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలి
- ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చాం
- కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం
- కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎకరాకు రూ.కోటి ఎలా సంపాదించాలో చెప్పలేదు
- పెద్దపల్లి యువ వికాసం సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, పెద్దపల్లి:** పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజాపాలనపై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పెద్దపల్లిలో నిర్వహించిన యువ మిగతా2లో...



## మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ఖరారు

### నేడు ప్రమాణ స్వీకారం..

**ఉప ముఖ్యమంత్రులుగా శివసేన నేత ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ నేత అజిత్ పవార్**

**ముంబయి:** మహారాష్ట్రలో ప్రభుత్వం ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారైంది. ఈమేరకు బుధవారం జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడ్నవీస్ పేరును ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబరు 5న ఆయన మహారాష్ట్ర సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపాయి. కోర్ కమిటీ భేటీ తర్వాత ముంబయిలోని విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభాపక్ష మిగతా2లో...

### పురుషులకూ నెలసరి వస్తే తెలిసేది

- గర్భస్రావం కారణంగా ఓ మహిళా న్యాయమూర్తి క్షోభను మధ్యప్రదేశ్ హైకోర్టు విస్మరించింది
- సివిల్ జడ్జీల తొలగింపు విధివిధానాలపై వివరణ ఇవ్వాలి
- సుప్రీం కీలక వ్యాఖ్యలు



2



**రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే**

# మిగులు బడ్జెట్ రాష్ట్రంగా తెలంగాణ

### ఆయన ఏనాడూ సీఎం కావాలని తాపత్రయ పడలేదు

- ఎవరు సీఎం అయినా.. నంబర్ 2 స్థానం రోశయ్యదే
- ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం
- రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే వారి సహకారం అవసరం
- పార్టీలోనూ సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం.
- హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తాం
- రోశయ్య వర్ధంతి సభలో సీఎం రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఆవిష్కృతమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్రం ఏర్పాటైందని గుర్తుచేశారు. రోశయ్య మూడో వర్ధంతి సందర్భంగా నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మిగతా3లో...

### ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు

- 7, 8, 9 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- అధికారులతో సీఎస్ శాంతికుమారి సమీక్ష



2

## 9 నుంచి సభా సమరం

- తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై గవర్నర్ నోటిఫికేషన్ విడుదల
- రైతు భరోసా, కులగణన, ఆర్‌వోఆర్ చట్టంపై చర్చించే అవకాశం
- సభకు కేసీఆర్ వస్తారా? లేదా? అనేదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ




2

## వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి మరింత రుణం

- గ్రామీణ ప్రాంతాలను నాలెడ్జ్ ఎకానమీలో మరింత మెరుగు పరిచేందుకు పూర్తి మద్దతిస్తాం
- చంద్రబాబుతో నాబార్డ్ ఛైర్మన్ భేటీ



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్రంలో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి మరింత రుణం అందించేందుకు నాబార్డు సహకారం అందిస్తుందని ఆ సంస్థ ఛైర్మన్ షాజీ కృష్ణన్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను నాలెడ్జ్ ఎకానమీలో మరింత మెరుగు పరిచేందుకు పూర్తి మద్దతిస్తామన్నారు. ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబుతో నాబార్డ్ ఛైర్మన్ సమావేశమయ్యారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు సహకారం, మత్స్యరంగం అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు.స్వయం సహాయక బృందాలు, మిగతా2లో...



## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు
- ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా
- నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయీ మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 90 | రిటైల్ ₹ 112 |
| స్కిన్ ₹ 162 | స్కిన్ లెస్ ₹ 185 |

## హైడ్రా మరో కీలక నిర్ణయం

- ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయం
- కొత్త ఏడాదిలో ప్రతి సోమవారం బుద్ధభవన్‌లో స్వీకరణ
- చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై అర్జీలు ఇవ్వొచ్చన్న హైడ్రా



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు కొత్త ఏడాదిలో ప్రతి సోమవారం బుద్ధభవన్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై అర్జీలు ఇవ్వొచ్చని హైడ్రా పేర్కొంది.



## మొబైల్ యాప్ సిద్ధం..

**నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

**రేపటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మొబైల్ యాప్ సిద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించనున్నారు. శుక్రవారం నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అన్న తేడా మిగతా2లో...

### ఇవి విజయోత్సవాలు కావు..
## వికృత ఉత్సవాలు

- ప్రజల చావులు, గోసలు కాంగ్రెస్ విజయమా? ఉత్సవమా?
- కాంగ్రెస్ పార్టీ దృష్టిలో.. పిల్లలకు పురుగుల అన్నం పెట్టడం విజయం.. వారి చావులు ఉత్సవం
- ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ దృష్టిలో.. పిల్లలకు పురుగుల అన్నం పెట్టడం విజయం.. వారి చావులు ఉత్సవం అని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ''యువతకు ఉద్యోగాలివ్వకపోవడం.. వారికి సంకెళ్లేయడం, రైతులను మోసం చేయడం.. వారికి ఉరి తాళ్లేయడం, ఆడబిడ్డలను ఆగం చేయడం.. వారి కన్నీళ్లు మిగతా2లో...

# ‘పురుషులకూ నెలసరి వస్తే తెలిసేది’

**హైదరాబాద్:** మహిళా న్యాయాధికారులను విధుల నుంచి తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. గర్భస్రావం కారణంగా ఓ మహిళా న్యాయమూర్తి అనుభవించిన మానసిక, శారీరక క్షోభను మధ్యప్రదేశ్ హైకోర్టు విస్మరించిందని పేర్కొంది. పురుషులకు నెలసరి వస్తే వారి పరిస్థితి తెలిసేది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసిన సుప్రీం ధర్మాసనం.. సివిల్ జడ్జీల తొలగింపు విధివిధానాలపై వివరణ ఇవ్వాలంటూ హైకోర్టును ఆదేశించింది. ఆశించిన స్థాయిలో పనితీరు లేదనే కారణంతో ఆరుగురు సివిల్ జడ్జిలను తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు గతేడాది సంచలన నిర్ణయం తీసుకుంది. అందులో నలుగురిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఫుల్ బెంచ్ నిర్ణయించగా.. మరో ఇద్దరికి మాత్రం ఉపశమనం కలగలేదు. ఇందులో ఓ న్యాయమూర్తి తనకు గర్భస్రావం కావడంతోపాటు తన సోదరుడు క్యాన్సర్ బారినపడినట్లు హైకోర్టు ధర్మాసనం ముందు వివరణ ఇచ్చినప్పటికీ ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ‘‘ఆ న్యాయమూర్తికి గర్భవిచ్ఛిత్తి జరిగింది. అటువంటి మహిళ మానసికంగా, శారీరకంగా ఎంతో వేదనకు గురయ్యే అవకాశం ఉంటుంది. పురుషులకూ నెలసరి వస్తే సమస్య ఏంటనేది తెలిసేది’’ అని జస్టిస్ బీవీ నాగరత్న పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పనితీరు ఆధారంగా ఆమెను తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. అటువంటి ప్రమాణాలు పురుష న్యాయమూర్తులకూ ఉండాలని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.

## ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు

**హైదరాబాద్:** ఈ నెల 7,8,9 తేదీల్లో ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్టు సీఎస్ శాంతి కుమారి తెలిపారు. ముగింపు వేడుకల నిర్వహణపై ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈనెల 7 నుంచి 9 వరకు పీవీ మార్గ్‌లో ప్రముఖ హోటళ్లు, డ్వాక్రా సంఘాలకు చెందిన 120 ఫుడ్, హస్తకళల స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. 7న వందేమాతరం శ్రీనివాస్, 8న రాహుల్ సిప్లిగంజ్, 9న థమన్ బృందంతో మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్టు సీఎస్ వివరించారు. 9న సచివాలయం ప్రాంగణంలో లక్ష మంది మహిళల సమక్షంలో తెలంగాణ తల్లివిగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. అనంతరం భారీ డ్రోన్, లేజర్, క్రాకర్ షోలు ఉంటాయని తెలిపారు. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ నుంచి పీవీ మార్గ్ వరకు ఐదు కేంద్రాల వద్ద భిన్న రీతుల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని సీఎస్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్యాంక్ బండ్, రాజీవ్ గాంధీ జంక్షన్, సచివాలయం, ఇందిరా గాంధీ విగ్రహం, పీవీ మార్గ్‌లో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించనున్నట్లు సీఎస్ తెలిపారు. మూడు రోజుల పాటు తాగునీరు, టాయిలెట్లు, భద్రత, పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు.

## వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి మరింత రుణం

(మొదటి పేజీ తరువాయి)
ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు నాబార్డు మద్దతుగా నిలుస్తుందని షాజీ కృష్ణన్ హామీ ఇచ్చారు. రూరల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద పీపీపీ విధానంలో రాష్ట్ర వాటాగా వయబిలిటీ గ్యాప్ నిధులను ప్రభుత్వం సమకూర్చుతుందని చంద్రబాబు తెలిపారు. ఏపీకి ఎఫ్ఐడీఎఫ్ కింద అందించే అదనపు కేటాయింపులు, సహకార సంఘాలకు రాయితీలు మరింత అందిస్తామని కృష్ణన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మత్స్యకార రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం కోసం ఎఫ్ఐడీఎఫ్ కింద మంజూరైన రూ.450 కోట్ల వినియోగంపైనా సమావేశంలో చర్చించారు. అమరావతిలో ఐకానిక్ నాబార్డు భవనాన్ని ఏడాదిన్నరలోనే పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నాబార్డు ప్రాంతీయ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి విజయవాడకు మార్చడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

## మొబైల్ యాప్ సిద్ధం..

(మొదటి పేజీ తరువాయి)
లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల పంపిణీ పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలని అధికారులు నిర్ణయించారు. గ్రామీణులను దృష్టిలో పెట్టుకుని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు సమాచారం.

## ఇవి విజయోత్సవాలు కావు.. వికృత ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)
చూడటం, ఇళ్లు ఇస్తామని మోసం చేయడం.. ఉన్న ఇళ్లు కూల్చడం, రుణమాఫీ చేస్తామని మాట తప్పడం.. అప్పులకు నోటీసులివ్వడం, ఏడాది అరాచక పాలన.. ప్రజల చావులు, గోసలు కాంగ్రెస్ విజయమా? ఉత్సవమా? ఇవి విజయోత్సవాలు కావు.. వికృత ఉత్సవాలు’’ అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

(మొదటి పేజీ తరువాయి)
అధికారంలోకి రాగానే మార్చలేదు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు’’ అని కేటీఆర్ హెచ్చరించారు.



# ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)
వికాసం సభలో సీఎం ప్రసంగించారు. ప్రజల ఆశీస్సులతోనే సామాన్యుడు సీఎం అయ్యాడని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనని తెలిపారు. ‘‘ఉద్యోగాల కోసమే ఖమ్మం జిల్లా పాల్వంచలో మొదట తెలంగాణ ఉద్యమం మొదలైంది. ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చాం. మోదీ సీఎం, పీఎంగా ఉంటూ గుజరాత్‌లో ఏడాదిలో 55వేల ఉద్యోగాలు ఇచ్చారా? ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నియామక పత్రాలు ఇచ్చాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. రాష్ట్రంలోనే అత్యధికంగా వడ్లు పండిస్తున్న జిల్లా .. పెద్దపల్లి జిల్లా. గతంలో బీఆర్ఎస్ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర రాలేదు. గజ్వేల్‌లోని తన పొలంలో ఎకరాకు రూ.కోటి సంపాదిస్తున్నానని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారు. పదేళ్లు పాలించిన ఆయన.. ఎకరాకు రూ.కోటి ఎలా సంపాదించాలో మాత్రం రాష్ట్రంలోని అన్నదాతలకు చెప్పలేదు. ఆయన విద్య ఏందో.. ఆ రహస్యం ఏంటో ఈరోజుకూ అంతుచిక్కడం లేదు. కేసీఆర్ శాసనసభకు రావాలి.. తన మేధావితనాన్ని ప్రజలకు పంచాలి. ఎకరంలో రూ.కోటి పంట ఎలా పండించారో రైతులకు చెప్పాలి. బీసీ కులగణనలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎందుకు పాల్గొనడంలేదు. ఈ ముగ్గురూ బీసీ వ్యతిరేకులా? బీసీల ఓట్లు వేయించుకోలేదా? ఒక మంచి పని కోసం ప్రభుత్వాలు ముందుకొచ్చినప్పుడు సహకరించాలి. బీసీ కులగణనలో పాల్గొనని వారిని ఈ సమాజం బహిష్కరించాలని కోరుతున్నా’’ అని సీఎం అన్నారు.

**ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాల ప్రదానం..**

గ్రూప్-4, సింగరేణి ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలను సీఎం అందజేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలను, సీఎం కప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సభలో పాల్గొన్నారు.

**పెద్దపల్లిపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు..**

పెద్దపల్లి జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. పెద్దపల్లికి రూరల్ పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను మంజూరు చేశారు. ఎలిగేడు మండల కేంద్రానికి పోలీసు స్టేషన్, వ్యవసాయ మార్కెట్‌ను మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేందుకు అనుమతి ఇచ్చారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి



ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి 4 వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు.

**తెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలు...**

తెలంగాణలో కొత్తగా రెండు ఆర్టీసీ డిపోలు మంజూరయ్యాయి. పెద్దపల్లి, ములుగు జిల్లా ఏటూరునాగారంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కొత్త డిపోల మంజూరు సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. 10-15 సంవత్సరాల తర్వాత రెండు నూతన ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో తీసుకుపోతున్నట్లు చెప్పారు. కొత్త డిపోల ద్వారా ఆ ప్రాంత వాసులకు, మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రయాణికులకు మేలు జరుగుతుందని చెప్పారు.

# మహారాష్ట్ర సీఎంగా ఫడ్నవీస్ ఖరారు

(మొదటి పేజీ తరువాయి)
సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర పరిశీలకులుగా ఉన్న నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ హాజరయ్యారు. సీఎం ఎంపికపై పార్టీ ఎమ్మెల్యేలతో వారు చర్చించారు. అనంతరం బీజేపీ శాసనసభాపక్ష నేతగా దేవేంద్ర ఫడణవీస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభలో మహాయుతి కూటమికి కూడా ఆయనే నేతృత్వం వహించేందుకు పార్టీల మధ్య అంగీకారం కుదిరిందట. దీంతో సీఎంగా ఫడ్నవీస్ ప్రమాణస్వీకారానికి మార్గం సుగమమైందని సదరు వర్గాలు తెలిపాయి. గురువారం ఆజాద్ మైదానంలో ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ప్రధాని మోదీ సహా ఎన్డీయే కీలక నేతలు హాజరుకానున్నారు. సీఎంగా ఫడ్నవీస్‌తో పాటు శివసేన నేత ఏక్‌నాథ్ శిందే , ఎన్సీపీ నేత అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తారని ప్రచారం జరుగుతోంది. 288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 230 స్థానాలతో భారీ మెజార్టీ దక్కించుకుంది. అయితే, ఆ తర్వాత



ప్రభుత్వం ఏర్పాటుపై కూటమిలో ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపులపై భాజపా, శివసేన, ఎన్సీపీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించని ఏక్‌నాథ్ శిందే, హోంశాఖ కేటాయించాలని పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కేంద్రంలోని భాజపా అధిష్ఠానం రంగంలోకి దిగి బుజ్జగింపులు మొదలుపెట్టింది. చివరకు ఆ చర్చలు ఫలించినట్లు తెలుస్తోంది. మరోవైపు, సీఎంగా భాజపా నేతే ఉంటారని ముందునుంచీ ప్రచారం జరిగినా ఫడణవీస్ స్థానంలో ఇంకెవరినైనా తీసుకుంటారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన వైపే మొగ్గు చూపింది. దీంతో ముఖ్యమంత్రిగా మూడోసారి ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. అంతకుముందు ఫడణవీస్ 2014 నుంచి 2019 వరకు సీఎంగా వ్యవహరించారు. 2019లో రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటికీ అప్పటి రాజకీయ పరిస్థితుల వల్ల 5 రోజులకే రాజీనామా చేయాల్సి వచ్చింది.

# నాపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయండి

**హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్**

**విశ్వంభర, హైదరాబాద్:** పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన ఫోన్లను ట్యాప్ చేయించారని సిద్దిపేటకు చెందిన స్థిరాస్తి వ్యాపారి, కాంగ్రెస్ నేత గదగోని చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హరీశ్‌రావు, విశ్రాంత పోలీసు అధికారి రాధాకిషన్‌రావుపై పంజాగుట్ట ఠాణాలో 120(బీ), 386, 409, 506 ఆర్/డబ్ల్యూ 34ఐపీసీ, 66 ఐటీ యాక్ట్ ప్రకారం ఆదివారం కేసు నమోదైంది. ఎన్నికల సమయంలో హరీశ్‌రావు తన ఫోన్‌తోపాటు కుటుంబ సభ్యులకు చెందిన 20 ఫోన్లను ప్రణీత్‌రావు సహాయంతో ట్యాప్ చేశారని చక్రధర్‌గౌడ్ ఆరోపించారు. తాను అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేయగా... కోర్టు ఆదేశాలతోనే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.






# ఎంపిక కాని వారికి స్టేటస్ మెసేజ్‌ను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతాం

- నిర్దేశించిన వీసాల కోసం తగినన్ని పిటిషన్లు వచ్చాయి
- హెచ్-1బీ వీసా.. తాజా అప్‌డేట్ ఇదే!

**వాషింగ్టన్:** భారతీయులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే హెచ్-1బీ వీసాలకు సంబంధించి తాజా అప్‌డేట్ వచ్చింది. 2025 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన వీసాల కోసం తగినన్ని పిటిషన్లు వచ్చినట్లు అమెరికా పౌరసత్వ, ఇమిగ్రేషన్ సేవల విభాగం వెల్లడించింది. హెచ్-1బీకి ఎంపిక కాని వారికి మరికొన్ని రోజుల్లో ఆన్‌లైన్‌లో సమాచారం అందిస్తామని తెలిపింది. వీటిని పంపడం పూర్తైన తర్వాత.. ఎంపిక కాని వారికి స్టేటస్ మెసేజ్‌ను ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతామని పేర్కొంది.హెచ్-1బీ వీసా పిటిషన్ దాఖలు ప్రక్రియ జూన్ 30, 2024తోనే ముగిసింది. అయితే, 30వ తేదీ ఆదివారం కావడంతో జులై 1న దాఖలైన పిటిషన్లను కూడా గడువులోగా దరఖాస్తు చేసినట్లుగానే పరిగణిస్తామని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. అయితే, వీసా పరిమితి నుంచి మినహాయింపు కలిగిన పిటిషన్ల స్వీకరణ, పరిశీలన కొనసాగుతుందని స్పష్టం చేసింది. ముఖ్యంగా హెచ్-1బీ వీసాతో అమెరికాలో పనిచేస్తున్న నిపుణుల ఉద్యోగ నిబంధనలు, సంస్థ మార్పు వంటి తదితర కారణాలతో దాఖలు చేసే పిటిషన్ల స్వీకరణ కొనసాగుతుందని పేర్కొంది.వివిధ దేశాలకు చెందిన వృత్తి నిపుణుల సేవలు వినియోగించుకోవాలని భావించే అమెరికా సంస్థలు వీసాలను స్పాన్సర్ చేస్తుంటాయి. ఇందుకోసం ప్రతి ఏడాది 85 వేల హెచ్-1బీ వీసాలను అమెరికా జారీ చేస్తుంది. ఇందులో 65వేల వీసాలు రెగ్యులర్ క్యాప్ కింద కాగా.. మరో 20 వేల వీసాలను తమ దేశంలో అడ్వాన్స్ డిగ్రీలు చేసిన వారికి మాత్రమే ఇస్తుంది. అయితే, గూగుల్, ఇన్ఫోసిస్, అమెజాన్, ఐబీఎం వంటి సంస్థలు దిగ్గజ అమెరికన్ సంస్థలు ఈ వీసాల సంఖ్యను ఇటీవల తగ్గించుకుంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# 9 నుంచి సభా సమరం..

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 9 నుంచి నిర్వహించనున్నట్టు గవర్నర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పలు అంశాలు ఈ సమావేశాల్లో చర్చించనున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారనేది ఈనెల 9న జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా వేస్తామని సీఎం ప్రకటించారు. అయితే, అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా.. అర్హులైన రైతులకే దక్కేవిధంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. కొత్తగా తీసుకురానున్న ఆర్వోఆర్ చట్టంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ రావాలని సీఎం రేవంత్‌రెడ్డి వివిధ సందర్భాల్లో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సభకు కేసీఆర్ వస్తారా? లేదా? అనేదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

# ఉద్యోగుల రిటైర్మెంట్ వయసులో మార్పు లేదు

**మార్చే ప్రతిపాదన ఏదీ తమ పరిశీలనలో లేదు**

**లోక్‌సభలో కేంద్రం క్లారిటీ**

**లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చిన మంత్రి జితేంద్ర సింగ్**



**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసులో మార్పు అంశంపై ఊహాగానాలు వస్తున్న వేళ ప్రభుత్వం ఓ స్పష్టత ఇచ్చింది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును మార్చే ప్రతిపాదన ఏదీ తమ పరిశీలనలో లేదని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. లోక్‌సభలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తుతం 60 ఏళ్లు నిండిన తర్వాత పదవీ విరమణ చేస్తున్న విషయం తెలిసిందే. యువతకు ఉపాధి కల్పించే విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని మంత్రి తెలిపారు. ఖాళీగా ఉన్న పోస్టులను సమయానుకూలంగా భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వంలోని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నామన్నారు. రోజ్‌గార్ మేళాల ద్వారా అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి సంస్థలు, విద్యా, ఆరోగ్య రంగాల్లోని సంస్థల్లో మిషన్ మోడ్‌లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు..

**చర్యలు చేపట్టిన అధికారులు**



**విశ్వంభర, హైదరాబాద్:** ట్రాఫిక్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వీరికి ఈవెంట్లను నిర్వహించారు. రన్నింగ్, జంపింగ్ ఇతర పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించిన వారికి ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనల అమలుపై శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకోనున్నారు.రాష్ట్రంలో 3 వేల మందికి పైగా ట్రాన్స్ జెండర్లుంటే.. వారిలో నగరంలోనే వెయ్యి మంది ఉన్నట్టు అంచనా. ఆసక్తిగల వారిని గుర్తించి నియమించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను గతంలో సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో పోలీసులు, హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. హోంగార్డుల తరహాలో ట్రాన్స్ జెండర్లను కూడా వాలంటీర్లుగా నియమించనున్నారు. అర్హులైన వారిని ఎంపిక చేసి పది రోజులపాటు ట్రాఫిక్ విధులపై శిక్షణ అందిస్తారు. వీరికి ప్రత్యేక యూనిఫాంతోపాటు ప్రతి నెల నిర్దేశిత స్టైపెండ్ ఇవ్వనున్నారు.



## రోశయ్య నిబద్ధత, సమర్థత వల్లే

# మిగులు బడ్జెట్ రాష్ట్రంగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)
రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు. 'నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోశయ్య నన్ను తన ఛాంబర్‌కు పిలిపించుకుని విలువైన సూచనలు చేశారు. బాగా మాట్లాడుతున్నావు.. మరింత అధ్యయనం చేసి సభకు రావాలని చెప్పారు. ప్రతిపక్షం తప్పక ప్రశ్నించాలి.. పాలకపక్షం ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు మేలు కలిగేలా అధికార పక్షాన్ని నిలదీయాలని చెప్పారు. రోశయ్య తమిళనాడు గవర్నర్‌గా ఎలాంటి వివాదాలు లేకుండా పనిచేశారు. ఆయన పట్టుదల, మాటల్లో చతురత ఎంతో ముఖ్యమైనవి. పాలకపక్షంలో ఉంటే ప్రతిపక్షాలను.. ప్రతిపక్షంలో ఉంటే సీఎంగా ఉన్న వ్యక్తిని ఇరుకున పెట్టే విధానాన్ని ఆయన నుంచి మనం నేర్చుకోవాల్సిన అవసరముంది.

**అలాంటి నేత లేకపోవడం లోటే..**

కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది సీఎంలుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, భవనం వెంకట్రామ్, అంజయ్య, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి.. ఇలాంటి వారంతా ప్రశాంతంగా ప్రభుత్వాన్ని నడిపించేందుకు కారణం రోశయ్య. సమస్యలను పరిష్కరించేందుకు వారికి కుడి భుజంలా ఆయన వ్యవహరించేవారు. అందుకే అప్పట్లో ఎవరు ముఖ్యమంత్రులుగా ఉన్నా నంబర్ 2 పొజిషన్ పర్మినెంట్. నంబర్ 1 పొజిషన్ మాత్రమే మారుతుండేది. ఎవరు సీఎం అయినా.. నంబర్ 2లో రోశయ్యే ఉండాలని కోరుకునేవారు. తెలంగాణ శాసనసభలో ఆయనలా వ్యూహాత్మకంగా సమస్యలను పరిష్కరించే నేత లేకపోవడం లోటుగా కనిపిస్తోంది.

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం**

రెండు తెలుగు రాష్ట్రాలు నాకు సమానమేనని రోశయ్య చెప్పారు. 50 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఇల్లు కట్టుకున్నట్లు తెలిపారు. నిఖార్సయిన హైదరాబాదీ రోశయ్య అని సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. ఆయనకు నగరంలో విగ్రహం లేకపోవడం లోటు. ఆర్యవైశ్య నేతలు మంచి ప్రాంతాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి సూచన చేస్తే.. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం చేపడతాం. నాలుగో వర్ధంతి నాటికి దాన్ని పూర్తిచేస్తాం'' అని రేవంత్ తెలిపారు.

### ఆర్యవైశ్యులకు సముచిత ప్రాధాన్యం

ఏనాడూ సీఎం కావాలని రోశయ్య తాపత్రయ పడలేదు. సందర్భం వచ్చినప్పుడు ఆయన్ను సోనియాగాంధీ ముఖ్యమంత్రిని చేశారు. క్లిష్ట పరిస్థితుల్లో ఎంపిక చేశారంటే పార్టీకి రోశయ్య పట్ల ఉన్న నమ్మకం, విశ్వాసం ఎలాంటిదో చెప్పొచ్చు. ఏనాడూ పదవులు కావాలని అధిష్ఠానాన్ని ఆయన కోరలేదు. హోదాలన్నీ వాటంతట అవే వచ్చాయి. రోశయ్యను అందరం స్ఫూర్తిగా తీసుకోవాలి. రాష్ట్రం ఆర్థికంగా రాణించాలంటే ఆర్యవైశ్యుల సహకారం అవసరం. వారి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతులు ఇచ్చే బాధ్యత తీసుకుంటా. పార్టీలోనూ సముచిత ప్రాధాన్యం కల్పిస్తాం.

### రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

రోశయ్య అంటే ప్రతి ఒక్కరికి తెలిసిన వ్యక్తి, వారితో ప్రతి ఒక్కరికి అనుభూతి కలిగిన వ్యక్తి ఏదో ఒక రూపంలో వారి దగ్గరికి వెళ్లి మాట్లాడిన విషయం మనకు తెలుసు. ఒకటే పార్టీ, ఒకటే కండువాతో సొంత కుటుంబం సభ్యులను రాజకీయాలకు పరిచయం చేయకుండా ఉన్నటువంటి ఆరడుగుల ఆజానుభావుడు రోశయ్య గారికి నివాళులు ఇంతపెద్ద మొత్తంలో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి ఈ సభకు రావడం వర్ధంతి సభ జరుపుకోవడం చాలా సంతోషం. తెలంగాణ లో పదేండ్ల తరవాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కళ సాకారం చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూన్నాం. అలాగే మరి రేవంతన్నకు విన్నవిస్తూ రోశయ్య కి ఒక విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎంకు విన్నవిస్తున్నాను అని, 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రపంచ ఘనతను సాధించిన నేతగా, గవర్నర్ గా, సీఎంగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎన్నో పదవులను పొంది ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న మహనీయుడు అని వారికి విగ్రహం ఏర్పాటు చేయాలనీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా కోరుకుంటున్నామని అన్నారు.





## స్వశక్తితో ఎదిగిన అరుదైన నాయకుడు రోశయ్య

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

ఎలాంటి రాజకీయ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా స్వశక్తితో ఎదిగిన అరుదైన నాయకుడు రోషయ్య. రోశయ్య గారికి కోపం వచ్చేది.. కానీ పగ ఉండేది కాదు .విలువలతో కూడిన విమర్శలు చేయడం వారికే చెల్లింది. రాజకీయాలు వ్యక్తిగతం కావు.. ప్రజలు ఇచ్చిన నమ్మకాల్ని నిలబెట్టే బాధ్యత అని నమ్మిన అరుదైన నాయకుడు రోశయ్య..ఏ రోజు ఓవర్ డ్రాఫ్ట్ కు పోలేదని గొప్పగా చెప్పిన ఏకైక ఆర్థిక మంత్రి. రోశయ్య అంత జాగ్రత్తగా, నిజయితీగా మరే ఆర్థిక మంత్రి పనిచేయలేదంటే అతిశయోక్తి కాదు.పౌరుషానికి ప్రతీకైన పల్నాటి నుంచి శత్రువులే లేని అజాతశత్రువు రోశయ్య. రోశయ్యగారి ఆశయాల్ని, విలువల్ని పాటించడమే వారికి మనమిచ్చే నివాళి.కొత్త తరం నాయకులు రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలి.

## విలువలు, ప్రశాంత జీవితానికి చిరునామా రోశయ్య

**డిప్యూటీ సీఎం భట్టి..**




విలువలు, ప్రశాంతతో కూడిన జీవితాన్ని గడిపి రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలిచిన నాయకుడు కొణిజేటి రోశయ్య గారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కీర్తించారు. బుధవారం హైటెక్స్ లో జరిగిన రోశయ్య మూడవ వర్ధంతి సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. రోశయ్య గారి జీవితం అందరూ అనుకున్నట్టు సజావుగా సాగలేదని, ఆయన రాజకీయంలో అనేక ఒడిదుడుకులు, రాజకీయ ఉద్యమాలకు తట్టుకొని ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారని అన్నారు. క్రమశిక్షణ, నిజాయితి విద్యార్థి నాయకుడి నుంచి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్గా రోశయ్య ఎదిగేందుకు దోహద పడింది అన్నారు. ఆయన ఆర్థిక మంత్రిగా, సీఎంగా ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, చీఫ్ విప్పుగా ఆయన నాయకత్వంలో తనకు పని చేసే అదృష్టం కలిగింది అన్నారు. ఆయన రాజనీతి, సరళమైన భాష, ప్రతిపక్షాల విమర్శలకు సహేతుకమైన సమాధానాలతో ప్రభుత్వాన్ని నిలబెట్టిన విధానం అందరికీ ఆదర్శం అన్నారు. వ్యక్తిగత దూషణలు లేకుండా సమాధానం చెప్పే విధానం రోశయ్య దగ్గర నేర్చుకోవాలి అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు వారికి కట్టుబడి పని చేయాలి. పదవికి వన్నెతెచ్చేలా మసులుకోవాలి అని ఆయన పరితపించేవారు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర ఆదాయం, ఖర్చులపై ఆయనకు అపార అనుభవం ఉంది, అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఉమ్మడి రాష్ట్రంలో వారికే దక్కింది అన్నారు. ఆయనకు వ్యవసాయం, వైద్యం గురించి లోతైన అవగాహన ఉందని... ఆచార్య ఎన్.జి.రంగా శిష్యునిగా వ్యవసాయ రంగంపై అవగాహన పెంచుకొని ఆయనకు ప్రియ శిష్యునిగా గుర్తింపు సాధించారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో పిసిసి అధ్యక్షునిగా పనిచేసి ఆ తర్వాత అధికార ప్రతినిధి బాధ్యతలో కూడా సమర్థవంతంగా పనిచేయడం అందరికీ ఆదర్శం అన్నారు. అధికార ప్రతినిధిగా ఆయన ప్రతిరోజు పిసిసి కార్యాలయానికి వచ్చి అధికార పక్షాన్ని ప్రశ్నించేవారని, తిరిగి కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడంలో ఆయన కృషి ఎంతో దాగి ఉంది అన్నారు. మహాత్మా గాంధీ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలను ఆయన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లారని తెలిపారు.



మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సభ సందర్భంగా రోశయ్యకు నివాళులర్పిస్తున్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఎండీ డా.కాచం సత్యనారాయణ. ఈకార్యక్రమంలో కొదుమూరి దయాకర్, యర్రమాద కృష్ణారెడ్డి, ఇరుగు శ్రీధర్, కూర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆ జీవోను రద్దు చేసినటువంటి ఘనత కొణిజేటి రోశయ్యదేః అమరవాది లక్ష్మీనారాయణ

రోశయ్య అంటే ఒక సైడు పార్టీ ఇంకో సైడ్ మన సంఘం, ఈరోజు రాష్ట్రంలో ఎన్నో కుల సంఘాలు ఉన్నాయి. ఉన్నప్పటికీ కూడా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉమ్మడి రాష్ట్రం కానివ్వండి , తెలంగాణ రాష్ట్రం లో వారి సూచనల మేరకే ఈ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈ రోజు నడుస్తూఉందంటే ఒక పార్టీకి ఉన్నంత నెట్వర్క్ మన ఆర్యవైశ్య మహాసభకు ఉంది. మండల స్థాయి నుంచి అదేవిధంగా జిల్లా పట్టణం, రాష్ట్రం ఇవన్నీ కూడా మరి ఏర్పాటు చేయడంలో మరి పెద్దలు రోశయ్య స్ఫూర్తి ఎంతో ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మరి చంద్రబాబు నాయుడు కొన్ని వేల కోట్ల ఆస్తులున్నా



కమ్యూనిటీకి, అవన్నీ కూడా, కళ్యాణమండపాలు అన్ని కూడా గవర్నమెంట్ ఆధీనంలోకి తీసుకోవాలన్నటువంటి ఆలోచనతో ఒక జీవో జారీ చేయడం జరిగిందని, ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాగానే మేము గతంలో కూడా ఉమ్మడి రాష్ట్రంలో అధ్యక్షులు కాబట్టి మాజీ అధ్యక్షులు అందరూ తీసుకొని అసెంబ్లీకి వెళ్లి రాజశేఖర్ రెడ్డి ద్వారా ఆ జీవో ను రద్దు చేసినటువంటి ఘనత కొణిజేటి రోశయ్య దే అని, ఈ సందర్భంగా ఇంత మంచి కార్యక్రమాలు చేశాడంటే మనం వారు ఉన్నటువంటి గవర్నమెంట్ లో వారు ముఖ్యమంత్రిగా కానీ, మంత్రిగా ఉండడమే మనం చేసుకున్నా అదృష్టం అని అన్నారు. ఇప్పటికి కూడా మనందరం ఒక్కటై ఆర్యవైశ్యులు ఐక్యమత్యంగా ఉండి పెద్దలు రేవంత్ రెడ్డి నాయకత్వంలో మనందరం కూడా పనిచేయాలి.

## పదవులకే వన్నె తెచ్చిన నాయకుడు రోశయ్య



**కోలేటి దామోదర్ గుప్తా**

రోశయ్య లాంటి నాయకుడు ఎక్కడున్నా వారి పార్టీకి ,పదవికి వన్నె తెచ్చిన వ్యక్తి మనందరికీ తెలుసు, 1977లో ఉన్నప్పుడు రామగుండం కలిసినప్పుడు అప్పటినుంచి మరి రోశయ్య గారితో ఉన్న సంబంధం నేను ఒక అదృష్టంగా భావిస్తా ఎందుకంటే క్రమశిక్షణ నైతిక విలువలకు మారుపేరు రోశయ్య అని , ఏ రాజకీయ పార్టీల నాయకులైనా కూడా అందరు అజాత శత్రువుగా మరి గౌరవించే వ్యక్తి రోశయ్య. వైశ్యులందరూ ఐకమత్యంగా ఉండాలని ఆయన కోరుకునేవారు. మనందరమూ ఐకమత్యంగా ఉండటమే మనం రోశయ్యకిచ్చే నిజమైన నివాళి.

## నేషనల్ వాసవీ డాక్టర్స్ డైరెక్టరీ 2024 ఆవిష్కరించాం: బెలిదె శ్రీధర్



మాజీ సీఎం రోశయ్య మూడవ వర్ధంతి సందర్భంగా 1458మంది డాక్టర్ల వివరాలతో కూడిన నేషనల్ వాసవీ డాక్టర్స్ డైరెక్టరీ 2024 ఆవిష్కరించామని ఫెడరేషన్ ఆఫ్ అవోపాస్ ఇండియా జాతీయ ఛైర్మన్ బెలిదె శ్రీధర్ అన్నారు. ఈ డైరెక్టరీలో 1458 మంది డాక్టర్లు ఏడు కేటగిరీల సంబంధించిన ఏడు మోడ్ ఆఫ్ ట్రీట్మెంట్ సంబంధించిన డాక్టర్స్, అలానే 28 మంది స్పెషాలిటీ డాక్టర్సు అంటే ఆప్తమాలజీ గైనకాలజీ ఆర్థోపెడిక్ డెంటల్ ఇలాంటి వాళ్ళందరికీ కూడా వాళ్ళ అడ్రస్సులు వారి ఫోటోతో సహా వారి హాస్పిటల్ తో సహా వారి ఫోన్ నెంబర్ తో సహా ఈ పుస్తకాల్లో ప్రచురించబడ్డాయి. ఈ పుస్తకం సమాజంలో ప్రతి ఒక్కరికి ఉపయోగపడని పడేలాగా అందరికీ అందజేసేలాగా అన్ని వైశ్య సంస్థలోనూ ఈ పుస్తకాన్ని ఉంచుతున్నాము. ఈరోజు ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రెసిడెంట్ సెక్రటరీ పుస్తకాన్ని వాళ్ళు తీసుకొని వారి వద్ద ఉంచుకొని సమాజంలో సభ్యులకు వైశ్య సభ్యులకు అందరికీ అందుబాటులో ఉంచవలసిందిగా కోరుతున్నాం.










రోశయ్య వర్ధంతి సందర్భంగా విద్య, సేవ, వ్యాపార రంగాల్లో ప్రముఖ ఆర్యవైశ్యులను సన్మానించారు. సేవా రంగంలో గంజి రాజమౌళి గుప్త, విద్యా రంగంలో పెన్నకంటి రామ్మోహన్‌రావు, వ్యాపార రంగంలో మానెపల్లి రామారావులను సన్మానించారు.

# తమిళనాడు రాజకీయాలకు దేవత పురుచ్చితలైవి జయలలిత



## నేడు ఆమె వర్ధంతి

**ఒక రాష్ట్ర రాజకీయాలను కంటి చూపుతోనే శాసించిన అతి కొద్ది మంది రాజకీయ నేతల్లో జయ లలిత ఒకరు. తమిళనాడు రాష్ట్రానికి ఆరు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. సినీ నటిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. అన్నాడీఎంకే అధినేత్రిగా.. తమిళనాడు సీఎంగా ఎదిగిన తీరు నిజంగా అద్భుతం.తమిళనాడు రాజకీయాలకు దేవతగా పురుచ్చితలైవి జయలలితను కీర్తిస్తారు. 1991 నుంచి 2016 మధ్య ఆమె 14 ఏళ్లపాటు ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా పని చేశారు. 1948 ఫిబ్రవరి 24న కర్ణాటకలోని మండ్య జిల్లా పాండవపుర తాలూకా లోని మెల్కోటేలో.. తమిళ అయ్యంగార్ కుటుంబంలో జన్మించారు. జయలలిత తల్లి వేదవల్లి, తండ్రి జయరాం. జయరాం లాయరుగా పని చేసే వారు. అయ్యంగార్ల సంప్రదాయం ప్రకారం తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన రెండు పేర్లు కోమలవల్లి, జయలలిత. ఆమె తాత నరసిం హన్ రంగాచార్యులు.. మైసూరు మహారాజా సంస్థానంలో ఆస్థాన వైద్యునిగా ఉండేవారు. జయలలిత జన్మించిన రెండేళ్లకే ఆమె తండ్రి చని పోయారు. దీంతో ఆమె కుటుంబం బెంగుళూరులోని అమ్మమ్మ గారింటికి చేరారు. తల్లి వేదవల్లి బెంగుళూరులో చిన్న ఉద్యోగంలో చేరారు.**

జయలలిత చాలా చురుకైన విద్యార్థిని. చదువులోనే కాకుండా ఆటపాటల్లోనూ ఆమె ముందుండే వారు. ప్రాథమిక విద్యను బెంగుళూ రు బిషప్ కాటల్ బాలికల పాఠశాల లో పూర్తి చేశారు. మద్రాసు చర్చ్ పార్క్ కాన్వెంట్‌లోను కొనసాగించిన జయలలిత మెట్రిక్యులేషన్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచారు. చదువు కుంటూనే సంప్రదాయ భరత నాట్యం తో పాటు మోహినీ యాట్టం, మణిపురి, కథక్ వంటి నృత్య రీతులను జయలలిత నేర్చు కున్నారు. సంప్రదాయ కర్నాటక సంగీతం కూడా అభ్యసించారు. మద్రాస్‌లో రంగస్థల నటిగా స్థిరపడ్డ సోదరి అంబుజవల్లి వద్ద ఉంటూ.. సినిమాలో నటించాలనే ప్రబలమైన కోరికతో, అవకాశాల కోసం ప్రయత్నించారు. సంధ్య అనే పేరుతో తన ప్రస్థానాన్ని నాటకాల తో ప్రారంభించి.. ఆశించిన విధంగా సినీ నటి స్థాయికి ఎదిగారు.

జయలలిత 1961 లో కన్నడ సినిమా "శ్రీ శైల మహాత్మే" తో సినీ రంగ ప్రవేశం చేశారు. బాలనటిగా అడుగు పెట్టారు. 1965 లో సీ.వీ. శ్రీధర్ దర్శకత్వం వహించిన "వెన్ని రాడై"తో తమిళ చిత్ర సీమలో అరంగేట్రం చేశారు. ఆ తర్వాత ఎమ్.జీ. రామచంద్రన్ (ఎమ్‌జీఆర్) సరసన 28 సినిమాలు, శివాజీ గణే షన్‌తో 17 సినిమాలలో నటించా రు. నటనలో ప్రతిభ కనబరిచి నందుకు ఆమె ఎన్నో అవార్డులను సాధించారు. జయలలిత తమిళం తో పాటు తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో అనర్గళంగా మాట్లా డే వారు. తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో దాదాపు 140 సిని మాల్లో జయలలిత నటించారు. ఆమె నటించిన ఏకైక హిందీ సినిమా ఇజ్జత్.

జయలలిత ...కథానాయకుని కథ (1965), మనుషులు మమతలు (1965), ఆమె ఎవరు? (1966), ఆస్తిపరులు (1966), కన్నెపిల్ల (1966), గూఢచారి 116 (1966), నవరాత్రి (1966), గోపాలుడు భూపాలుడు (1967), చిక్కడు దొరకడు (1967), ధనమే ప్రపంచ లీల (1967), నువ్వే (1967), బ్రహ్మచారి (1967), సుఖ దుఃఖాలు (1967), అదృష్టవంతులు (1968), కోయంబత్తూరు ఖైదీ (1968), తిక్క శంకరయ్య (1968), దోపిడీ దొంగలు (1968), నిలువు దోపిడి (1968), పూలపిల్ల (1968), పెళ్ళంటే భయం (1968), పోస్టు మన్ రాజు (1968), బాగ్దాద్ గజ దొంగ (1968), శ్రీరామకథ (1968), ఆదర్శ కుటుంబం (1969), కథానాయకుడు (1969), కదలడు వదలడు (1969), కొండవీటి సింహం (1969), పంచ కళ్యాణి దొంగల రాణి (1969), ఆలీ బాబా 40 దొంగలు (1970), కోటీశ్వరుడు (1970), గండికోట రహస్యం (1970), మేమే మొనగాళ్లం (1971), శ్రీకృష్ణ విజయం (1971), శ్రీకృష్ణసత్య (1971), భార్యా బిడ్డ లు (1972), డాక్టర్ బాబు (1973), దేవుడమ్మ (1973), దేవుడు చేసిన మనుషులు (1973), లోకం చుట్టిన వీరుడు (1973), ప్రేమలు - పెళ్ళి ళ్ళు (1974), నాయకుడు – వినా యకుడు (1980) తదితర తెలుగు చిత్రాలలో విభిన్న పాత్రలలో జయలలిత నటించారు.

ఎం. జీ. రామచంద్రన్ స్థాపించిన ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐడీఎంకే) లో చేరడం ద్వారా ఆమె తన రాజ కీయాల్లోకి అడుగు పెట్టారు. ఎంజీఆర్ కు సన్నిహితురాలిగా ఉంటూ 1984 నుంచి 1989 మధ్య రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు.1987 లో ఎమ్‌జీఆర్ మరణానంతరం 1989 లో ఏఐడీఎంకే అధినేత్రి అయ్యారు. 1991 లో పార్టీని అధికారం లోకి తెచ్చి, తమిళనాడులో మొత్తం పదవీకాలం పూర్తిచేసిన మొదటి మహిళా ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. తమిళనాట రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహ రించి 'పురుచ్చి తలైవి' (విప్లవ నాయకురాలు)గా పేరు గాంచిన జయలలిత 43 ఏళ్లకే ఆమె ముఖ్యమంత్రి అయి, అత్యంత పిన్న వయసులోనే తమిళనాడు సీఎంగా ఎన్నికైన వ్యక్తిగా ఆమె రికార్డు నెలకొల్పారు. ఆరుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో అక్రమాస్తుల కేసులో ఆమె జైలుకు కూడా వెళ్లారు. అనారోగ్యం కారణంగా 75 రోజులు మృత్యు వుతో పోరాడిన తర్వాత డిసెంబరు 5, 2016 న ఆమె కన్ను మూశారు. ఆమె మరణం ఎన్నో వివాదాలకు నెలవైంది.

**జయలలిత ఉత్థాన పథనాలు**

తమిళనాడు ముఖ్యమంత్రిగా జీవితం పూల బాటతో ప్రారంభమైనప్పటికీ అందులో ముళ్ల మలుపులు ఎన్నో వున్నాయి. తెలివితేటలు, జాగురూకత, విధేయత, పట్టుదల అనే నాలుగు అంశాలను ఆమె ఆయుధాలుగా మార్చుకొని ముళ్ల మలుపులను అధిగమించి పూల వనంలోకి అడుగుపెట్టారు. కానీ ఆనారోగ్యమనే ముళ్ల పాన్పులోనే శాశ్వత నిద్రలోకి వెళ్లాల్సి వస్తుందని ఆమె ఊహించలేదు.

**రాజకీయ రంగప్రవేశం...**

జయలలితతో జోడీగా పది సినిమాల్లో హీరోగా నటిచించిన ఎంజీ రామచంద్రన్ ఆమెను 1982లో రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. ఆయన ప్రోత్సాహంతోనే ఏఐఏడీఎంకేలో చేరారు. అయితే ఈ విషయాన్ని ఆమె ఎప్పుడూ బహిరంగంగా ఒప్పుకోలేదు. తనంతట తానే ఇష్టంగా రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. పార్టీలో ఎంతో మంది సీనియర్ నాయకులను కాదని 1983లో ఆమెను పార్టీ ప్రచార కార్యదర్శిగా నియమించారు.

**రాజ్యసభ ఎంపీగా...**

1984లో ఎంజీ రామచంద్రన్ కిడ్నీల ఆపరేషన్ నిమిత్తం అమెరికాకు వెళ్లేముందు జయలలిత రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఇది ఆమె రాజకీయ జీవితంలో పెద్ద ముందడుగు. పార్టీలో చాల మంది సీనియర్ నాయకులు ఆమె ఎన్నిక పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 1984 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎంజీఆర్‌లేని లోటు కనిపించకుండా జయలలిత, అమెరికాలో ఎంజీఆర్ చికిత్స పొందుతున్న ఫొటోలను పట్టుకొని పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. పార్టీలో ఆమె వ్యతిరేకులు చాలా మంది ఆమె పట్ల ఎంజీఆర్ విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారు. సున్నితంగా వ్యవహారలను చక్కబెట్టడంలో చాకచక్యం కలిగిన జయలలిత వారి ప్రయత్నాలను వమ్ము చేశారు.

**ఎంజీఆర్ కన్నుమూత...**

1987లో ఎంజీఆర్ చనిపోవడంతో తమిళనాడు రాజకీయాల్లో, ముఖ్యంగా ఏఐఏడీఎంకే పార్టీలో సంక్షోభ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంజీఆర్ భార్య జానకి రామచంద్రన్, జయలలిత మధ్య పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. వారిద్దరి మధ్య ఎంత అఘాతం ఏర్పడిదంటే ఎంజీఆర్ అంత్యక్రియలకు జయలలితను జానకి రామచంద్రన్ అనుమతించలేదు. ఆ తర్వాత 1988, జనవరి ఏడవ తేదీన జానకి రామచంద్రన్‌ను శాసన సభలో ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఈ విషయంలో స్పీకర్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారన్న కారణంగా ఆ ప్రభుత్వాన్ని అప్పటి కేంద్రంలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వం రద్దు చేసి, రాష్ట్రపతి పాలనను విధించింది.

**జయ కేతనం....**

1989లో జరిగిన అసెంబ్లీ మధ్యంతర ఎన్నికల్లో జయలలిత గెలిచినప్పటికీ పార్టీ అంతర్గత కుమ్ములాటల వల్ల పార్టీ అధికారంలోకి రాలేకపోయింది. డీఎంకే గెలవడంతో కరుణానిధి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. పార్టీలోని రెండు వర్గాలు విలీనం కావడంతో జయలలిత ప్రతిపక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పార్టీ రెండాకుల గుర్తును కూడా తిరిగి సాధించారు.

**తొలిసారి ముఖ్యమంత్రిగా...**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యానంతరం ఎన్నికలు జరగడం వల్ల, కాంగ్రెస్ పార్టీలో పొత్తు పెట్టుకోవడం వల్ల 1991లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 234 సీట్లకుగాను 225 సీట్లలో జయలలిత పార్టీ ఘన విజయం సాధించింది. ఆమె తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1996 వరకు పూర్తి కాలంపాటు అధికారంలో కొనసాగారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అవినీతి ఆరోపణల కారణంగా ఆమె పార్టీ ఘోరంగా ఓడిపోయింది. తన సొంత సీటును కూడా ఆమె నిలబెట్టుకోలేపోయారు. తన దత్త పుత్రుడు సుధాకరన్ పెళ్లిని 1995లో అంగరంగ వైభవంగా చేయడంలో ఆమె భారీ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తడం తీవ్ర ప్రభావాన్ని చూపాయి.

### వీరనారిగా శపథం....

**1989, మార్చి 25వ తేదీ తమిళనాడు రాజకీయాల్లోనే ఓ చీకటి అధ్యాయం. అసెంబ్లీలో జయలతిను డీఎంకే సభ్యులు ఘోరంగా పరాభవించారు. సభ నుంచి బయటకు వెళుతుండగా, కొంతమంది డీఎంకే సభ్యులు ఆమె చీరను పట్టుకొని లాగగా ఆమె చీర చిరిగిపోయింది. అలాగే ఆమె చిరగిన చీర, రేగిన జుట్టు, ఎరుపెక్కిన ముఖంతో మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు. తాను ముఖ్యమంత్రి అయ్యేవరకు అసెంబ్లీలో అడుగు పెట్టనని శపథం చేశారు. మహా భారతంలో ద్రౌపతికి జరిగిన పరాభవం నిండు సభలో జయలలితకు జరిగిందంటూ మీడియాలో వార్తలు విస్తృతంగా వచ్చాయి. ఆమెకు ప్రజల నుంచి సానుభూతి పవనాలు వీచాయి.**

**2001లో జయకు మరిన్ని సమస్యలు**

2001లో ఆమె నాలుగు నియోజక వర్గాల నుంచి దాఖలు చేసిన నామినేషన్లు చెల్లకుండా పోయాయి. అయినప్పటికీ ఆమె పార్టీ ఎన్నికల్లో విజయం సాధించడంతో, పార్టీ నాయకురాలిగా ఎన్నికై మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించారు. అవినీతి కేసులో ఆమెను ముఖ్యమంత్రిగా అనర్హురాలిగా సుప్రీం కోర్టు ప్రకటించడంతో పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

**మళ్లీ ముఖ్యమంత్రిగా ....**

జయలలితపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును సుప్రీం కోర్టు రద్దు చేస్తూ బెయిల్ మంజూరు చేయడం, ఆ తర్వాత కర్ణాటక హైకోర్టు ప్రత్యేక బెంచీ అంతకుముందు ట్రయల్ కోర్టు విధించిన శిక్షను కొట్టివేసి ఆమెకు క్లీట్ చిట్ ఇవ్వడంతో జయలలిత మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2011లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పార్టీ విజయం సాధించడంతో ఆమె మరోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. పలు అవినీతి కేసుల్లో పలుసార్లు జైలు కెళ్లిన ఆమె, కేసు కొట్టేసునప్పుడల్లా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూ వచ్చారు. 2015లో ఐదవ సారి, 2016లో ఆరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడులో వరుసగా రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన తొలి మహిళగా, రెండవ వ్యక్తిగా రికార్డు సృష్టించారు. అంతకుముందు వరుసగా రెండుసార్లు గెలిచిన రికార్డు ఎంజీ రామచంద్రన్ పేరుతో ఉంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# చీమ-ఉడుత కథలు

## విద్యార్థుల వాస్తవిక జీవన పుటలు




స్థిరమైన ప్రయత్నం, నిబద్ధత అనేవి విజయసాధన వ్యూహాలు. తాటికల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనుండి కుమారి ఆకిటి ఆశ్రిత కథారచనలో రాష్ట్రస్థాయి ప్రథమవిజేతగా నిలిచింది. విజయాన్ని జరుపుకోవడం అంటే ఆనందాన్ని పంచుకోవడమేనని ఈ పాఠశాల ఆరవతరగతి విద్యార్థులు "చీమ- ఉడుత కథలు" రాసి నిరూపించారు. ఈ క్రతువులో ఆశ్రిత మరియు ఆరవతరగతి విద్యార్థుల విజయానికి మార్గదర్శకుడుగా శ్రమించిన ప్రముఖ కథా రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు డా. సాగర్ల సత్తయ్యగారు, వారికి ఉడుతా భక్తిగా సహకరించిన పాఠశాల యాజమాన్యం చరితార్థులు.

"చీమ- ఉడుత కథలు" పుస్తకంలో 20 కథలున్నాయి. ఈ కథలను రాసింది విద్యార్థులు కాబట్టి, సాహిత్యపరంగానే కాకుండా వారి అకడమిక్ కౌశలాలను గురించి కూడా చర్చించాల్సి ఉంటుంది. వీరంతా ఆరవతరగతి పాఠం "ఉడత సాయం" పాఠం విని, దాని ఆధారంగా ఈ కథలను రాశారు. వీటిని చదివితే, తరగతి గదిలో మాతృభాషలో విద్యార్థి కేంద్రీకృత చైతన్యవంత బోధనాభ్యసన జరిగినట్టుగా అర్థమవుతుంది. విద్యార్థులు కథలు రాయడం వలన వారిలో స్వేచ్ఛాభ్యసన, క్లిష్టమైన ఆలోచన, సమస్య పరిష్కారం, సహకారం అలవడుతాయి. విభిన్న కథన దృక్కోణాలను అన్వేషిస్తారు. కథలో వారిదైన స్వీయ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారు.

ఆరవతరగతి విద్యార్థుల స్థాయిలో ఒక కథను రాయడం అంత సులభం కాదు. కథా ప్రారంభం, ఆసక్తికర కొనసాగింపు, ముగింపును సృష్టించడంతో పాటు, పాత్రల అభివృద్ధి, సంభాషణలు, చెప్పాలనుకునే నీతి, ఊహ, ప్రేరణవంటి అంశాలు ఎన్నో ఉంటాయి. వారు ఎక్కువగా స్వంత కథలపైననే ఆధారపడుతారు.

బాలల కథాసాహిత్యంలో పూర్వపు రచయితలు ఉడుతను సాయపడేదిగాను, చీమను శ్రమైక జీవిగాను గుర్తించారు. కానీ తాటికల్ విద్యార్థినీ, విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టి రాసిన "చీమ- ఉడుత కథలు" లో ఉడుత, చీమల స్వభావాలను తమ కథల్లో మరింతగా విస్తరించారు. ఈ "చీమ- ఉడుత కథలు" వట్టి కథలు కావు. తాటికల్ విద్యార్థుల వాస్తవిక జీవన పుటలు. ఈ కథల్లో నీతి ప్రధానంగా ఉండి, చాలా వరకు పిల్లల అనుభవాలు, సామాజిక పరిశీలన అంతర్లీనంగా ఉన్నాయి. మేడ శశివర్ధన్ కుమార్ రాసిన "చీమ చేసిన మేలు" కథలో ఆకలిగొన్న ఉడుతకు చీమ సాయం చేస్తుంది. ఇందులో సాయం చేయడానికి సైజుతో పనిలేదనే నీతి దాగి ఉంది. పరసగోని సరయు "చీమల దాడి" కథలో బలహీనులకు ఐక్యమత్య అవసరాన్ని తెలిపింది. మరొక కథలో "ఈగకు బుద్ధి చెప్పిన ఉడత" గురించి నేర్పుగా రాసింది. ఏరుకొండ లిఖిత రాసిన కథ "ఉడుత మోసం". ఇందులో చీమనోటి నుండి జారిపడే పండుకోసం ఉడుత ఎత్తులను ఆలోచనాత్మకంగా రాసింది. ఆకిటి గణేష్ "ఉడత ఆకలి" తీర్చడానికి చీమ చేసిన త్యాగం గురించి ఉంటుంది. మరొక కథా రచయిత మాదగాని ఠాగూర్ "అప్పు ఇచ్చిన ఉడత" కథలో చీమ పొదుపరితనాన్ని, భవిష్యత్తుకోసం అప్పు తీసుకునే సగటు జీవిని కథలో ఆవిష్కరించాడు. "ఎలుక అసూయ" కథలో చీమపై ఉడుతకు చాడీలు చెప్పే ఎలుక యొక్క చెడుబుద్ధిని పొల్లెగాని లావణ్య తెలివిగా బయటపెట్టింది. మొగిలి భరత్ చంద్ర ఆజాద్ రాసిన "చీమ రాణి సహాయం" కథలో పరోపకారం గొప్పదనాన్ని ఆవిష్కరించాడు. నారగోని సిద్ధు పర్యావరణ పరిరక్షణ గురించి "వేటగాడికి బుద్ధి చెప్పిన చీమలు" కథను రాశాడు. మొగిలి సిద్ధార్థ "చీమ పిల్లల ఆకలి" కథలో పరోపకారం గురించి, ఆకలి గురించి రాశాడు. "ఉడత పుట్టినరోజు" కథలో మేడ శశివర్ధన్ కుమార్ స్నేహం గొప్పదనాన్ని రాశాడు. మొగిలి భరత్ చంద్ర ఆజాద్ "జింకను కాపాడిన చీమ ఉడత" కథలో వేటగాడి గురి నుండి స్నేహితుడైన జింకను తప్పించిన విధమును రాశాడు. "సాయం" కథలో సుంకర బోయిన సంజన ఉడుత ఆకలి తీర్చిన చీమ గొప్పదనం గురించి చెప్పింది. "ఉడత గొడుగు" కథలో పర్సగోని సరయు చీమ పరోపకారం గురించి రాసింది. "ఉడుత దుర్బుద్ధి" కథలో వనం సాయి చరణ్య ఉడుత అత్యాశను బయటపెట్టింది. తేళ్ల చరిష్మా "ఆకలి గొన్న చీమ" కథలో చీమ యొక్క ఆకలి తీర్చిన ఉడుతను గురించి రాసింది. చెవుగోని యశస్విని "చీమను కాపాడిన ఉడుత, పావురం" కథలో పావురం పరోపకారం వలన చీమ ఎలా బతికి బయటపడిందో తెలుస్తుంది. పొల్లెగోని వరుణ్ తేజ రాసిన "చీమ తెచ్చిన పండు" కథలో స్నేహితుల మధ్య అరమరికలు లేని స్వచ్ఛమైన స్నేహం గురించి ఉంటుంది. మేడ శశివర్ధన్ కుమార్ రాసిన "ఉడుత పెండ్లి" కథలో చీమ హెచ్చరికతో వేటగాడి బారిన పడకుండా మిత్రులను కాపాడిన తీరు బాగుంటుంది. వనం మేఘమాల రాసిన "గొడవ పడిన చీమ ఉడత" కథలో అహం వీడితే స్నేహం ఎలా వికసిస్తుందో వివరించింది.

ఇలా 19 కథలు పిల్లల యొక్క ప్రపంచాన్ని అందంగా, ఆలోచనాత్మకంగా మరింత సృజనతో మనకు వివరించేవే. సంపాదకులు డా. సాగర్ల సత్తయ్యగారికి, వారి సహోపాధ్యాయులకు శుభాకాంక్షలు. ఈ పుస్తకంలోని రచయితలకు శుభాశీస్సులు. వారు మరిన్ని కథలు రాసి, మంచి కథారచయితలుగా మారాలని ఆకాంక్ష.



- శీలం భద్రయ్య
98858 38288

## ప్రభుత్వ పాఠశాలలను గాలికి వదిలేసిన ప్రభుత్వం



**విశ్వంభర, భూపాలపల్లి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సర్వే నిర్వహించింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా వాష్రూమ్స్ లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని అదేవిధంగా డ్రింకింగ్ వాటర్ విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి విన్నవించామని అయినా ఎలాంటి స్పందన లేదనీ తక్షణమే స్పందించని అధికారుల పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తరపున ఆయన డిమాండ్ చేసారు.

### నూతన భవన నిర్మాణానికి
## స్థల పరిశీలన చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే



**విశ్వంభర, షాద్ నగర్ :** ఫరూఖ్ నగర్ మండలంలోని లింగారెడ్డి గూడ గ్రామం లోని అలీ సాబ్ గూడ శివారు లోని సర్వే నంబర్ 21 లో ఐటీఐ కళాశాలకు 2 ఎకరాల భూమి, పాలిటెక్నిక్ కళాశాలకు 3 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 109, 101 ద్వారా కేటాయించింది. కావున బుధవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,కొందుర్గు పార్టీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, కొత్తూరు టౌన్ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, ఎ.ఎం.సి వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ , సీనియర్ నాయకులు దంగు శ్రీనివాస్ యాదవ్, ఇబ్రహీం, కౌన్సిలర్ శ్రీనివాస్,ఖదీర్,మాజీ సర్పంచ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

### మంద కృష్ణ మాలల మీద
## విషం చిమ్మడం మానుకో : పీక కిరణ్



**విశ్వంభర, భూపాలపల్లి :** డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో లక్షలాది మంది మాలలతో జరిగిన మాలల సింహగర్జన సభ విజయవంతం కావడాన్ని తట్టుకోలేక మందకృష్ణ విషం చిమ్మడాన్ని ఖండిస్తూ ఉత్తర తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో కాటారంలో పత్రిక విలేకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ మాట్లాడుతూ మందకృష్ణ ఉపయోగించే భాష మాలలను రెచ్చగొట్టే విధంగా ఉంది అని గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ ఉద్యమాన్ని నడిపిస్తున్న అని చెప్పుకుంటున్న నీ సంఘ స్థాపకులు ఎవరూ నీ వెంట లేరు అంటే, నీ నిజాయితీ ఏంటో తెలుస్తుంది అని ముందు కృష్ణను ఎద్దేవా చేశారు.30 సంవత్సరాలుగా ఉద్యమం పేరుతో టిడిపి, కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలతో, దళిత వ్యతిరేక నాయకులతో అంటకాగి సాటి మాలల మీద విషం చిమ్మి దళితుల ఐక్యతను దెబ్బతీస్తున్నావు అని అన్నారు.

## భూపాలపల్లిలో ఎకో పార్కు ప్రారంభం



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ ఎకో పార్క్ ను భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి ప్రారంభించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, అటవీ అధికారి మొక్కలు నాటారు. అనంతరం శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ఈ స్థలం జిల్లాకు తలమానికమని, రెవెన్యూ భూమి అని అప్పటి అధికారి వ్యక్తిగతంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని భూ కబ్జా బారినపడకుండా కాపాడమని తెలిపారు. అటవీ భూమి అని తేలడంతో అధికారకంగా ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఎకో పార్కును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ భూమి జిల్లాకు చాలా అవసరమని అభివృద్ధి చేయాలనే ఆలోచన నేటితో నేరవేరిందని తెలిపారు. ఈ పార్కును అభివృద్ధి చేసి ప్రజలు వాకింగ్ చేయుటకు అందుబాటులోకి తెస్తామని, అటవీ అధికారులు ఎలాంటి నియమ, నిబంధనలు విధించొద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో మంగీలాల్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



**మాజీ ముఖ్యమంత్రి డా.కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి సభలో నూతనంగా నియామకం అయిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్‌ను చండూర్‌కు చెందిన ఆర్యవైశ్య నాయకులు తెలుకుంట్ల చంద్రశేఖర్ , తేలుకుంట్ల జానయ్య , తడకమళ్ల శ్రీధర్ , పోలా శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.**

**- విశ్వంభర, హైదరాబాద్**

# బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ ధర్నా చౌక్‌లో శతాధిక హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం బంగ్లాదేశ్ హిందువులకు సంఘీభావ సభ జరిగింది.ఇందులో వందకు పైగా హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనేక మంది సాధి సంతులు కూడా పాల్గొని తమ ఆశీస్సులు అందిస్తూ బంగ్లాదేశ్ రక్షణను ఆకాంక్షించారు.అరెస్టు కాబడిన స్వామీజీని వెంటనేచేస్తూ విడుదల చేస్తూ హిందువులకి రక్షణ కల్పించాల్సిందిగా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భారత ప్రభుత్వాన్ని ఇందుకు సహకరించాలని డిమాండ్ చేయడం జరిగింది.ఇందులో పతంజలి యోగ సమితి భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నందనం కృపాకర్ పాల్గొని బంగ్లాదేశ్లో జరుగుతున్న మారణకాండను తీవ్రంగా నిరసించారు. ఆక్కడ వెంటనే ఆ పరిస్థితులను అదుపు చేయాలని. హిందువులకి రక్షణ కల్పించాలని బంగ్లాదేశ్ హిందువులు బంగ్లాదేశ్లో కాకపోతే మరెక్కడ ఉంటారని అక్కడ ఉన్న ముస్లింలకు ఎంత అయితే బంగ్లాదేశ్ లో ఉండే అధికారం ఉందో అక్కడి హిందువులకు కూడా అంతే సమానాధికారం ఉందని అక్కడి ప్రభుత్వం సైన్యము బంగ్లాదేశ్ ముస్లింలు ఇలా ప్రవర్తించడం ఎంత మాత్రం సరి కాదని ..దీన్ని వారు మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా హిందువులపై ఇటువంటి దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ సాధు శాంతులతోపాటు విశ్వహిందూ పరిషత్ మట్ట మందిర అఖిలభారత అధ్యక్షులు రామరాజు, హిందూ వాహిని ఇంచార్జి ఆది రెడ్డి, ఆర్ఎస్ ఎస్ జాతీయ కార్యకారిణి సభ్యు లు భాగయ్య, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ , ఎక్స్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎక్స్ ఎమ్మెల్సీ రామచంద్రరావు తదితర అనేక మంది ప్రముఖులు భాగస్వాములయ్యారు .ఈ కార్యక్రమాన్నివీహెచ్‌పీ జాతీయ స్పోక్ పర్సన్ రావినూతల శశిధర్ నిర్వహించారు.

# మజ్దూర్ యూనియన్ విజయం ఖాయం

### అధ్యక్షులు కాల్వ శ్రీనివాస్ వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్ :** సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకల్ సేడ్ కాజీపేట గుర్తింపు సంఘాల ఎన్నికలలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సాధిస్తుందని అధ్యక్షులు కాలువ శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తూ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు కాలువ శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డిజిల్ బ్రాంచ్ లోకో షెడ్ లో కార్మికుల సంక్షేమానికి ఎన్నో పనులను నెరవేర్చడం జరిగిందన్నారు. ఉద్యోగుల ప్రమోషన్లు ఖాళీల భర్తీలను పెన్షన్లను ఇప్పించడంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ముందుంటామనీ అన్నారు. రాబోయే రోజుల్లో కూడా కార్మికుల సమస్యల కోసం పోరాటం చేస్తామన్నారు. అదేవిధంగా ఎన్పీఎస్ రద్దు కోసానికి పాటుపడతామని పేర్కొన్నారు. అనంతరం జనరల్ సెక్రెటరీ శంకర్ రావు మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ మెకానికల్ జేఈ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజిల్ లోక్ షెడ్ చైర్మన్ జానీ మియా కోశాధికారి రాజేశ్వరరావు వైస్ చైర్మన్లు. భాస్కర్ రెడ్డి తిరుపతి యాదగిరి నాగరాజు అసిస్టెంట్ సెక్రటరీలు యాదగిరి సత్యనారాయణ నరేశ్ యాదవ్లు లు కమిటీ కార్యవర్గ సభ్యులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత

### మహిళా సంఘాల ద్వారా ఆర్థిక పురోగతి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి :** బొల్లారం మహిళా స్వయం సహాయక సంఘాలు బలోపేతం చేయడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవ వారోత్సవాలలో భాగంగా.. బుధవారం బొల్లారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. నాలుగు మహిళా స్వయం సహాక సంఘాలకు మంజూరైన 50 లక్షల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం నుండి అందిస్తున్నారు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొలన్ రోజా బాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంగ తాయారు, సీనియర్ నాయకులు కౌన్సిలర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఎంప్లాయిస్ సంగ్‌దే విజయం



**విశ్వంభర, హైదరాబాద్ ;** సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంగ్ దే ఘనవిజయం సాధిస్తామని డిప్యూటీ డివిజనల్ సెక్రెటరీ మురళి మీడియాతో వెల్లడించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ.. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ విజయం సాధిస్తే రైల్వేల లో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని సమానంగా ఏకికృత పెన్షన్ విధానాన్ని అమలుపరిచే విధంగా కృషి చేస్తామని కార్మికులకు తెలిపారు. అదేవిధంగా ఎనిమిదవ పే కమిషన్ ఏర్పాటు చేయించి కనీస వేతనం 32 వేల 500 వరకు ఇప్పించుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రైల్వేలో 12 గంటల సమయాన్ని శ్రమ దోపిడిని రద్దు చేయించి ఎనిమిది గంటలకె పాటించేవిధంగా చూస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైల్వే కార్మికులను తమ అమూల్యమైన ఓట్లను రైలింజన్ గుర్తుపై అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సాంఘ చైర్మన్ మధుసూదన్ రావు, కార్యదర్శి జగదీశ్వర్ రావు, కోశాధికారి సమ్మయ్య, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు ప్రవీణ్ కుమార్ రాములు శ్రీనివాస్ శ్యామల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయండి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి 2000 కుటుంబాలు జీవిస్తున్నారు. వీరి ఉపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం జనంపల్లి గ్రామంలోని అమృతవనములో కూనూరు మల్లేశం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు, మండల కార్యదర్శి పులి బిక్షమయ్య మాట్లాడుతూ, ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్తులో వారికి ఇబ్బంది కలగకుండా, ప్రతి గ్రామానికి 5 ఎకరాల భూమి కేటాయించి, చెట్లు పెంచి సేఫ్టీ మోకులు ఇచ్చి, తాటి చెట్టు పైనుంచి పడి మరణిస్తే, మెడికల్ సర్టిఫికేట్ పాత పద్ధతిన అమలుపరిచి 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని, కొత్త సభ్యత్వాలు పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి మండల కోశాధికారి మునుకుంట్ల లేనిన్, లగ్గాల స్వామి, పలుసం కిష్టయ్య, పబ్బు వెంకన్న, గుండాల సుందర్, పబ్బు గంగాధర్, చెరుకు శంకరయ్య, గడ్డమీది సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# అదనపు బస్సులు తెప్పించి రద్దీని తగ్గించండి




**విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా :** మహబూబాబాద్ డిపోకు 20 అదనపు బస్సులను తెప్పించి రద్దీని తగ్గించాలని సిపిఐ(ఎంఎల్ ) మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు . సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బస్సు డిపో ముందు కాసేపు ధర్నా నిర్వహించి అనంతరం డిఎం శివకుమార్ కు వినతిపత్రం అందజేశారు . అనంతరం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల రద్దీ పెరిగి ప్రయాణికులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసిన 3000 బస్సులను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా లో ఉన్న అన్ని మండలాల కు తప్పనిసరిగా జిల్లా కేంద్రం నుండి బస్సు సర్వీసులను వేయాలని ఆయన డిమాండ్ చేశారు . నేడు రాష్ట్రవ్యాప్తంగా అన్నింటి డిపోల ముందు జరిగిన నిరసన తర్వాత డిసెంబర్ 9న బస్సు భవన్ ముందు ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు . ఈ కార్యక్రమంలో ప్రజల పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని చంద్రన్న పిలుపునిచ్చారు.

## ఉద్యోగ అవకాశాల కల్పన రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. యువ వికాసం కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి బుధవారం ఐడిఓసి కార్యాలయంలో గ్రూప్4కు ఎంపికైన అభ్యర్థులకు పెద్దపల్లి సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల మేరకు పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టిందని తెలిపారు. మన జిల్లా నుండి ఎంపికైన 101 మంది గ్రూప్ 4 అభ్యర్థులను పెద్దపల్లిలో నియామకపు పత్రాలు తీసుకోవడానికి వెళ్లేందుకు మూడు ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరకాలంలో ఇప్పటివరకు 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆయన వివరించారు. 10 వేలు ఉపాధ్యాయ పోస్టులు, 7,900 వైద్య సిబ్బంది పోస్టులను భర్తీచేసినట్లు తెలిపారు.

## డిసెంబర్ 8న అయ్యప్ప మహా పడిపూజ

**విశ్వంభర, చింతపల్లి :** అయ్యప్ప 18వ మహా పడిపూజకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శివ, ఆంజనేయ, అయ్యప్ప స్వాములు, వివిధ పార్టీల నాయకులు, భక్తజనం భారీగా తరలిరానున్నట్లు 18వ పాదం ధర్మశాస్త్ర భజన్స్ అయ్యప్ప గురుస్వామి గోవిందు యాదగిరి తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో డిసెంబర్ 8న సాయి సుమంగళి గార్డెన్ లో కేరళ తంత్రి సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో గోవిందు భారతమ్మ, నారయ్య దంపతుల కుటుంబ సభ్యులు సాయంత్రం 6 గంటలకు అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం 108 కలశములతో అంగరంగ వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాములు, భక్తులు. అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి అయ్యప్పస్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయ వీర్ రెడ్డి స్వామి, సాయి బాబా ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనుంజయ, చింతపల్లి గురు స్వాములు చెనమోని రాములు, చిలువేరు చంద్రమౌళి, చెట్లపల్లి ప్రసాద్, మొగిలి పుల్లయ్య, రావెళ్ల వెంకట్రావు, ప్రభాకర్రెడ్డి, ఈరటి యాదయ్య, వెన్నం శేఖర్, మేకల నరసింహ తోపాటు అయ్యప్ప స్వాములు, అతిరథ మహారధులు పాల్గొంటారని తెలిపారు.

## 4వ విడత రుణమాఫీ నిధుల విడుదల

**విశ్వంభర, రామన్నపేట**: 4వ విడత రుణమాఫీ డబ్బులను ప్రభుత్వం బ్యాంకుల మెయిన్ బ్రాంచీలకు విడుదల చేసింది. వారం తర్వాత రుణమాఫీ డబ్బులు రైతుల లోన్ అకౌంట్లో జమవుతాయి. కావున లిస్టులో పేరు వున్న రైతులు బ్యాంకులో డబ్బులు పడలేదని ఆందోళన పడవద్దు. మెయిన్ బ్రాంచ్ నుండి రైతుల బ్యాంక్ అకౌంట్లలోకి రుణమాఫీ డబ్బులు వారం రోజుల తర్వాత జమ అవుతాయి. రేషన్ కార్డు లేని రైతు కుటుంబాలకు 4వ విడతలో రుణ మాఫీ జరుగుతున్నది. రేషన్ కార్డు లేక వ్యవసాయ అధికారితో ఫోటో దిగినటువంటి ఆ కుటుంబంలో అందరి మీద మొత్తం కలిపి రెండు లక్షల పైన వున్న రైతు కుటుంబాలకు ఈ విడతలో రుణమాఫీ జరగలేదు. త్వరలో జరుగుతుంది. ఫోటో దిగినా కానీ, మాకు రుణమాఫీ జరగలేదు అని ఆందోళన చెందకుండా ఫ్యామిలీ మొత్తం భార్యాభర్తల మీద కలిపి 2 లక్షల పైన ఉన్నదేమో చూసుకోవాలి. 2 లక్షల పైన రుణం ఉన్న రైతు కుటుంబాలు, 2 లక్షల పైన వున్న డబ్బులు ఎప్పుడు కట్టాలనేది రైతులకు సమాచారం తెలియజేయబడుతుంది. రెండు లక్షల పైన ఉన్న రైతు కుటుంబాలకు 5వ విడతలో రుణమాఫీ జరుగుతుంది. 2 లక్షల లోపు వున్న బ్యాంక్, ఆధార్ పేర్లు తప్పు పడిన రైతులు, రైతుల పేర్లలో వేరే తెలియని రైతుల పేర్లు మ్యాపింగ్ అయిన రైతు కుటుంబాలకు త్వరలో పేర్లు సరిచేసిన తర్వాత 5వ విడతలో రుణమాఫీ జరుగుతుంది. కావున పేర్లు తప్పు పడిన రైతులు ఆందోళన చెందవద్దని మనవి. రుణ మాఫీకి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ ద్వారా తెలియజేయబడుతుంది.

## రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు




**విశ్వంభర, బంజారా హిల్స్ :** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చు అని షైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. మంగళవారం హైటెక్ సిటీ మైండ్ స్పేస్ ఐటీ పార్కు నందు ఏ ఎం డి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాఫ్ట్వేర్ ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముస్తఫా మాట్లాడుతూ ఒక్క బ్లడ్ డోనర్ నుండి సేకరించిన రక్తం ద్వారా తెల్ల రక్త కణాలు, ఎర్ర రక్త కణాలు ఇద్దరు నుండి ముగ్గురికి అందించవచ్చు అని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. రక్తదాన నిర్వహించుటకు సహకరించిన కంపెనీ మేనేజర్ లక్ష్మికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి జ్ఞాపకనే అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి విజయ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలలో ఎమ్మెల్యే దొంతి ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, నర్సంపేట :** చెన్నారావుపేట మండలం లోని అమీనాబాద్ గ్రామంలో ఉండబడిన ప్రభుత్వ మోడల్ పాఠశాల లో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల లో విద్యార్థుల సౌకర్యాలను పాఠశాల ప్రిన్సిపల్ ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిసరాలను పరిశీలించి తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.విద్యార్థులకు అందించే ఫుడ్ పట్ల జాగ్రత్త వహించాలని పాఠశాల ప్రిన్సిపాల్ కి సూచించారు.. ఈ కార్యక్రమంలో వీరి వెంట మండల అధ్యక్షులు జిల్లా నియోజకవర్గ మండల నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- పదేళ్లలో బిఆర్ఎస్ తెలంగాణని అప్పుల కుప్ప గా మార్చింది
  - మంత్రి జూపల్లి కృష్ణారావు
- కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా చివరి ఆయకట్టు రైతుకు నీళ్లు అందిస్తాం
  ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కష్టపడిన కార్యకర్తలకే పదవులు దక్కుతాయి
  - సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీ చంద్‌రెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు :** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్రెడ్డి సమక్షంలో చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి తో పాటు డైరెక్టర్లను రంగారెడ్డి జిల్లా మార్కెట్ కమిటీ డి ఎం రషీద్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం రైతులకు ఏకకాలం లో రుణ మాఫీ చెయ్యలేదని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులూ ఎన్నో ఉన్న అర్హత ఉన్న ప్రతి రైతు కుటుంబానికి 2లక్షలు రుణ మాఫీ చేసిందని, ప్రస్తుతం గత ప్రభుత్వం చేసిన 8 లక్షల కోట్ల రూపాయలకు 67 వేల కోట్లు వడ్డీ కడుతున్నామని అవే డబ్బులు ఉంటే రైతులకు మరిన్ని సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అందించేవారమని అన్నారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చరని విమర్శించారు. ఆరు గ్యారంటీ ల పథకాలను అమలు చేస్తూ ఇంద్రమ్మా ఇండ్ల పంపిణీలో త్వరలో పేదలకు ఇండ్లు దక్కుతాయన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో ముదుపులు ఇచ్చిన వారికే పదవుల వస్తుండే కానీ పార్టీకి పని చేసిన కార్యకర్తలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం పదవులు ఇస్తుందని అన్నారు. త్వరలో జరుగబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. నియోజకవర్గంలో రోడ్ల కోసం 189 కోట్ల నిధులు మంజూరు చేయించానని నియోజకవర్గంలోని మైసిగండి, వేదాద్రి దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు కల్వకుర్తి ఎత్తిపోతల డి 82 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు కొరకు నీళ్లు అందిస్తామని అదేవిధంగా తలకొండపల్లి కర్తాల్ కు కూడా నీళ్లు తీసుకొచ్చేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూలు శాసనసభ్యుడు రాజేష్ రెడ్డి, పి సి బి మెంబర్ బాలాజీ సింగ్ పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ మండల అధ్యక్షులు అధికారులు నాయకులు కార్యకర్తలు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సు



**విశ్వంభర, మహబూబాబాద్ ;** మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశానుసారంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో కేసముద్రం మండలం కల్వల ఆదర్శ పాఠశాల నందు షీటీం, భరోసా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలపై గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షీటీం ఎస్సై సునంద మాట్లాడుతూ బాలికల భద్రత షీ టీం లక్ష్యం అని తెలిపారు. పాఠశాలలో కానీ, బయట కానీ, ఎక్కడైనా ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసిన, వేధించి ఇబ్బంది కలిగించిన, లేదా ఇబ్బందికరంగా మాట్లాడిన, తమకు ఫిర్యాదు చేయాలని, విద్యార్థినిలు చిన్న విషయాలకు ఆవేదనలకు గురికాకూడదని, మంచి ఆలోచనలతో చదువుకోవాలని సూచించారు. మహిళలపై కానీ, విద్యార్థినిలపై కానీ వేధింపులు జరిగినట్లయితే మా షీటీం వాట్సాప్ నెంబర్ 8712656935 నాకు సమాచారం అందించాలని తెలిపారు.

# స్వయంకృషితో ఎదగాలి : మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

**విశ్వంభర, కడ్తాల్ :** యువకులు స్వయంకృషితో ఎదిగి యువతకు ఆదర్శం కావాలని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలోని దేవా నాయక్ నూతనంగా ప్రారంభించిన మహాదేవ్ డాక్యుమెంట్ , ధరణి సెంటర్ ను, అలాగే రాజ్ కుమార్ నూతనంగా ప్రారంభించిన వి ఆర్ డాక్యుమెంట్ మరియు ఆధార్ సెంటర్లను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంకృషితో ఎదుగుతున్న యువతను ప్రోత్సహించారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయం శక్తితో తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. అలా యువత స్వయం కృషితో ఎదిగినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని తెలిపారు. చివరిగా వారికి శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు దుద్య, నరసింహ, బన్సీ, హీరా సింగ్, శ్రీను, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వీరేశంను కలిసిన రజక సంఘం నాయకులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని వివిధ గ్రామాల రజక సంఘాల నాయకులు రజకుల సమస్యల గురించి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించి, సమస్యలను విచారించి పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల రజక సంఘం అధ్యక్షులు కొండూరు శంకర్, యాదాద్రి జిల్లా రజక సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, పట్టణ నాయకులు దామెర నరసింహ, అక్కెనపల్లి లింగయ్య, మాంద్ర కిష్టయ్య, నడిగోట్ రమేష్, గంప సత్తయ్య, ఎలిమినేటి యాదయ్య, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

# రెండో రోజు కొనసాగిన ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ ట్రాఫిక్ సి.ఐ. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ వ్యవసాయ మార్కెట్ ముందు విజయవాడ హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు కి ఇరువైపులా ట్రాఫిక్ కు అంతరాయంగా ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియ రెండో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సి.ఐ. మాట్లాడుతూ పండ్ల వ్యాపారం చేయు దళారులు రోజు వారీ కూలీలను పెట్టి మరీ రోడ్డు కి ఇరువైపులా ఒక్కొక్కరు మూడు నుండీ నాలుగు తోపుడు బండ్లు, ఆటో లలో పండ్లు, కూరగాయలు పెట్టి అమ్ముతూ నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఫుట్ పాత్ లను అడ్డాగా చేసుకుని ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ట్రాఫిక్ అదనపు సి.ఐ. నాగరాజు, ఎస్ ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ బృందం మధ్యాహ్న భోజనం పరిశీలన



**విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా :** రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలలో చదువుతున్న విద్యార్థిని , విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గుగులోతు సూర్య ప్రకాష్ ఫైర్ అయ్యారు . ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కన్వినింగ్ కమిటీ సభ్యులు, మండల ఇన్చార్జి బాణోతు సింహాద్రి ఆధ్వర్యంలో కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్లో ఎస్ఎఫ్ఐ బృందంతో కలిసి మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు . అంతేకాకుండా స్కూల్ కాలేజీలలో ఎలాంటి సమస్యలు ఉన్న మాకు తెలియపరచండి అని విద్యార్థి సంఘాలు ఎప్పుడు మీ వెంట ఉండి ఉద్యమిస్తాయని సూర్య ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, అభిమానులు, ఉన్నారు.

# డిసెంబర్ 7న జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు



**విశ్వంభర, భూపాలపల్లి :** డిసెంబర్ 7వ తేదీన రాష్ట్ర మంత్రులు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొననున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న ప్రజాపాలన.. ప్రజా విజయోత్సవ సభాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభ నిర్వహణకు స్టేజి, ప్రజలు కూర్చోడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బిజెపి ఛార్జ్ షీట్




**విశ్వంభర, వర్ధన్నపేట :** నియోజకవర్గం పరిధిలోని ఇల్లంద గ్రామం వేదికగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బిజెపి పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఛార్జ్ షీట్ ను విడుదల చేసి అనంతరం మీడియా సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ అసెంబ్లీ యాత్ర ప్రముఖ్ బన్న ప్రభాకర్ , మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ , వరంగల్ జిల్లా బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ , జిల్లా బిజెపి పార్టీ ఉపాధ్యక్షులు పట్టపురం ఏకాంతం గౌడ్ , వర్ధన్నపేట మండల అధ్యక్షులు కుమారస్వామి , బిజెపి సీనియర్ నాయకులు జలగం రంజిత్ , బుద్ధ శ్రీనివాస్, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సమగ్ర కుటుంబ సర్వే పత్రాలను పరిశీలించిన జిల్లా సీఈవో

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు రంగారెడ్డి జిల్లా సీఈవో కృష్ణారెడ్డి సందర్శించారు. కార్యాలయంలో మండలంలోని గ్రామ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. సర్వేకు సంబంధించిన జాబితాలను పరిశీలించి భద్రపరచాలని సూచించారు. స్వయంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లతో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇంటి మోడల్ హౌస్ స్థలాన్ని మరియు సబ్ డివిజనల్ కార్యాలయ స్థలాన్ని పరిశీలించారు అదేవిధంగా ఎంపీడీవో కుసుమ మాధురి చెన్నంపల్లి గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మించాలని సిఈవోకు తెలిపారు స్థానిక ఎంపీడీవో కుసుమ మాధురి తెలియజేశారు. ప్రజా పాలన విజయోత్సల సందర్భంగా సీఎం కప్ పేరిట క్రీడా పోటీలను విద్యార్థులకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి లో అథ్లెటిక్స్, ఫుట్బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో, యోగా క్రీడలకు సంబంధించిన పోటీలు ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో నిర్వహిస్తామని ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు.

# మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



**విశ్వంభర, నల్గొండ :** నల్లగొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ భవనంలో జరిగినటువంటి కార్యక్రమంలో రోశయ్య చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి శ్రీనివాస్, అదనపు ప్రధాన కార్యదర్శి నాళ్ళ వెంకటేశ్వర్లు. మహిళా విభాగ్ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, జిల్లా సంఘ మాజీ అధ్యక్షుడు వీరేల్లి కృష్ణయ్య, మాజీ ప్రధాన కార్యదర్శులు కోటగిరి దైవదీనం, బుక్క ఈశ్వరయ్య, నాయకులు రేపాల భద్రాద్రి రాములు, వీరేల్లి సతీష్, బోనగిరి ప్రభాకర్, నాంపల్లి నర్సిహ్మ, నల్లగొండ అశోక్, నల్లగొండ శ్రీనివాస్, నల్లగొండ సంతోష్, వనమా రమేష్, నల్లగొండ సుమలత, కర్నాటి వెంకటేశ్వర్లు, లకుమారపు శ్రీనివాస్ పాల్గొని నివాళులు అర్పించారు.

## లంబాడి హక్కుల పోరాట సమితి

# రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్ నాయక్



**విశ్వంభర, కడ్తాల్:** ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎస్సీ ఎస్టీ రాష్ట్ర మాజీ కమిషనర్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంపాల్ నాయక్ చేతుల మీదుగా నియమక పత్రం కడ్తాల్ మాజీ జడ్పిటిసి దశరథ్ నాయక్ అందుకున్నారు. గిరిజన జాతి కోసం అహర్నిశలు పోరాడుతున్న జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ను లంబాడి హక్కుల పోరాట సమితి గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. షాద్ నగర్ లోని కేకే కన్వెన్షన్ హాల్లో జరిగిన సమావేశంలో రాంపాల్ నాయక్ మాట్లాడుతూ జాతి కోసం నిరంతరం శ్రమిస్తున్న దశరథ్ నాయక్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. లగచర్లలో గిరిజనులకు అండగా ఉండి పోరాడిన దశరథ్ నాయక్ కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. దశరథ్ నాయక్ లాంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ సంఘంలో పనిచేస్తే రానున్న రోజుల్లో గిరిజన జాతికి చాలా మేలు జరుగుతుందని తెలిపారు.

# పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ పెద్ద శంకరంపేట మండల అధ్యక్షుడు హరీష్ కుమార్ పేర్కొన్నారు.. పెద్ద శంకరంపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిపిఎస్ ఉపాధ్యాయులు తెలంగాణ కాంట్రాక్ట్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ కరపత్రాన్ని బుధవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2004 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానాన్ని అమలు చేయడం వల్ల రెండు లక్షల 50 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని నష్టం వాటిల్లుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రజా పాలన విజయోత్సవాలా.. లేక ప్రజల ఆర్తనాదాలా..?



విశ్వంభర, షాద్ నగర్ : రైల్వే బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కారణం అని మీడియా సమావేశంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. అమృత్ 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం 5385 కోట్ల నిధులు విడుదల చేస్తే అందులో నుండి మన షాద్ నగర్ పట్టణానికి 27 కోట్ల రూపాయలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు విడుదల చేస్తే, కేంద్ర ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న డీకే అరుణకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎంపీ పర్మిషన్ లేకుండా, ఆమెను పిలవాలని సోయి లేకుండా ప్రభుత్వం పని చేస్తుందని, గత 10 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 24 కోట్ల 25 లక్షల రూపాయలు షాద్ నగర్ మున్సిపాలిటీకి నిధులు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వ నిధులకు శంకుస్థాపనలు చేయడమే తప్పితే ఒక ఎంపీగా కార్యక్రమాలకు పిలవకపోవడం చాలా శోచనీయమని, దీనిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని, మున్సిపల్ కమిషనర్ పై ప్రివిలేజ్ మోషన్ ద్వారా ముందుకు వెళతామని భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ప్రజా విజయోత్సవాలు ఏడాది ప్రజాపాలనకు తార్కాణం

## ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస రావు

**విశ్వంభర, సరూర్ నగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువు తీరి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా డిసెంబర్ 1 నుండి 9 వరకు జరుపుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు కాంగ్రెస్ ఏడాది పాలనకు తార్కాణమని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వక్క లంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నాడు ఆయన మాట్లాడుతూ పెద్దపల్లిలో యువతతో సీఎం రేవంత్ రెడ్డి సభ, గ్రూపు నాలుగు అభ్యర్థుల నియామక పత్రాలు, 26 నియోజకవర్గాలలో గురుకులాల ప్రారంభానికి శ్రీకారం, గోషామహల్ ఉస్మానియా ఆసుపత్రికి భూమి పూజ, కేబీఆర్ పార్కు చుట్టూ కూడళ్ల అభివృద్ధి, దామరచర్ల లో విద్యుత్ కేంద్ర ప్రారంభం ఇవన్నీ ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలని కితాబు ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 28 నియోజకవర్గాలలో భవనాల పనులు మొదలయ్యాయని, మరో 28 నియోజకవర్గాల పరిధిలో సమీకృత గురుకులాలను ప్రభుత్వం మంజూరు చేసి వాటిని ప్రారంభం చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న యువతలో ఉన్న క్రీడా ఆసక్తిని వెలికి తీయడమే లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహిస్తుందని, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 16 కొత్త నర్సింగ్ కళాశాలలతో పాటు 22మెడికల్ కాలేజీలు నెలకొల్పడం ఒక రికార్డు అని అన్నారు.

# దశ దినకర్మ కార్యక్రమానికి హాజరైన హైడ్రా కమిషనర్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్ అల్కాపురి స్వాగత్ హోటల్ కన్వెన్షన్ హాల్లోని మహాత్మా గాంధీ లా కళాశాల చైర్మన్ గంగుల గోవర్ధన్ రెడ్డి తండ్రి గంగుల జనార్ధన్ రెడ్డి దశ దినకర్మ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ ఏ.వి రంగనాథ్, మల్టీజోన్ ఐ జి వి.సత్యనారాయణ, ఎస్.పి.ఎఫ్.డి.జి.పి అనిల్ , యూత్ ఆక్టివిటీస్ డెవలప్మెంట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు , యాదాద్రి జిల్లా కలెక్టర్ ఎం మ్ . హనుమంత రావు,చైర్మన్ హైర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, మధుసూదన్ రావు, సురేష్, ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్'కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లు ప్రారంభం



**విశ్వంభర, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నసీఎం కప్2024లో పోటీల్లో పాల్గొనడానికి పేర్లను ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఇందుకు సంబంధించిన వెబ్సైట్ ప్రారంభమైందని, ఈమేరకు గ్రామ, మండల, స్థాయిలో జరిగే ఈ పోటీలు ఏయే తేదీల్లో, ఏయే క్రీడలుజరుగుతాయనే వివరాలను అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో వెల్లడించారు.బుధవారం ఐ.డి.ఓ.సి లోని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆధ్యక్షతన సీ.ఎం. కప్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ స్థాయిలో ఈ నెల 7, 8వతేదీల్లో, మండల స్థాయిలో 10, 12వ తేదీల్లో,జిల్లా స్థాయిలో 16 నుంచి 21వ తేదీ వరకు పోటీలుఉంటాయని పేర్కొన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు https:// cmcup2024.telangana.gov.inలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఓటీపీ లేకుండా అయితే https://cmcup2024. telangana.gov.in/offlineregister/156లో నమోదుచేసుకోవాలని సూచించారు. ఈ లింక్ ఈ నెల 6వతేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీ, పీడీలు క్రీడాకారుల వివరాలు పొందుపరచాలని సూచించారు.

# 6 గారంటీలు 66 మోసాలు

**విశ్వం భర, నర్సంపేట :** ప్రజలను 6 గారంటీలు 66 మోసాలు చేశారని, సంవత్సర కాలంలో ఏమి చేశారని సంబరాలు చేసుకుంటున్నారని వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు అన్నారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం నుండి అంబేద్కర్ కూడలి వరకు ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన 6 గ్యారంటీలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకుంటున్నారని ఎద్దేవా చేసారు. నర్సంపేట అభివృద్ధికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక బిజేపి పార్టీ నుండి చార్జ్ షీట్ విడుదల చేస్తున్నామని వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సఖ్యతగా లేకుండా నర్సంపేట అభివృద్ధికి సహకరించడం లేదని ఇప్పటికైనా ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో సయోధ్య కలిగి ఉండి నర్సంపేట ను రావలసిన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేయాలని లేకుంటే రానున్న కాలంలో ఓటు వేసిన ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు.

# సెల్ ఫోన్‌ను బాధితునికి అందించిన పేట ఎస్సై శంకర్




**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** గత 15 రోజుల క్రితం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కమలాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ గోపాల్ తన ఫోన్ పోగొట్టుకున్నానని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి బుధవారం పెద్ద శంకరంపేట ఎస్సై బాధితునికి పోలీస్ స్టేషన్లో పోగొట్టుకున్న ఫోన్ ను తిరిగి అందించారు. గోపాల్ ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు సిఇఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్ ను రికవరీ చేసి బాధితునికి అందించారు. ఎవరైనా తమ సెల్ ఫోన్ లను పోగొట్టుకున్నట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్ లో ఐ ఎం ఈ ఐ ఫోన్ నెంబర్తో ఫిర్యాదు చేయాలన్నారు. సి. ఈ ఐ ఆర్ నమోదు చేసినట్లయితే పోగొట్టుకున్న ఫోన్ లను తిరిగి పొందవచ్చు అన్నారు.

# బంగ్లా హిందువులకు రక్షణ కల్పించాలి..

- కదం తొక్కిన హిందూ ఐక్యవేదిక
- కరీంనగర్ లో భారీ ర్యాలీ.. కలెక్టరేట్ ఎదుట నిరసన




**విశ్వంభర, కరీంనగర్:** బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న నిరంతర దాడులను నిరసిస్తూ కరీంనగర్ హిందూ ఐక్యవేదిక బుధవారం రోజున భారీ నిరసన , ఆందోళన కార్యక్రమం చేపట్టింది. వేలాదిగా తరలివచ్చిన హిందూ జన సమూహంతో కరీంనగర్లోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్ నుండి ప్రారంభించిన నిరసన ర్యాలీ పట్టణంలోని పలు ప్రాంతాల మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. ర్యాలీ సందర్భంగా బంగ్లాదేశ్ హిందువులను కాపాడండి, రక్షించండని ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ వద్ద పీఠాధిపతులు, హిందూ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ లో హిందువులు ఏం పాపం చేశారని దాడులు చేస్తున్నారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్ లో ప్రజాస్వామ్యం లేదని, హిందువులకు రక్షణ కల్పించమని అడిగినందుకు ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణదాస్ ను జైల్లో వేశారని, ఆయనకు అండగా నిలిచిన వారిపై దాడులు చేస్తు మారణ హోమం సృష్టిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ లో ఇస్లామిక్ తీవ్రవాదుల దాడులు రోజు,రోజుకీఅధికమయ్యాయన్నారు. హిందువులు, ఇతర మతపరమైన మైనార్టీలపై నిరంతరం దాడులు ,హత్యలు, దోపిడీలు, మహిళలపై అమానవీయ వేధింపులు పెరిగిపోతున్నాయని, ఇది తీవ్రమైన ఆందోళనకరమైన విషయమని, దీన్ని హిందూ ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశ్ హిందువులు స్వీయ రక్షణ కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తమ గళాన్ని ఎత్తినప్పుడు , వారి గళాన్ని అణచివేయడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం దుర్మార్గ ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో బంగ్లాదేశ్ లో వరదలొస్తే ఎవరి మతం ఏంటనేది చూడకుండా అన్నం పెట్టిన ఇస్కాన్ పై బంగ్లాదేశ్ నియంత ప్రభుత్వం అణిచివేత ధోరణి అవలంబిస్తుందన్నారు. అందులో భాగంగానే ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణదాస్ ను జైల్లో వేసి ఇబ్బంది పెడుతుందన్నారు. స్వామీజీకి అండగా నిలిచిన వారిపై ఉక్కు పాదం మోపుతుందన్నారు. ఇలాంటి చర్యలు సరికావని బంగ్లాదేశ్ ఇప్పటికైనా హిందూ మైనార్టీల పైన జరుగుతున్న దాడులను నివారించడానికి అన్ని విధాలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువులకు విశ్వ మానవాళి అండగా నిలబడి సంఘీభావాన్ని వ్యక్తపరచడం అత్యవసరమన్నారు. బంగ్లాదేశ్ మైనారిటీ హిందువుల రక్షణ కోసం, అక్కడి ప్రజలకు అండగా నిలవడానికి, నైతిక మద్దతు అందించడానికి హిందూ ఐక్యవేదిక నిరంతర ప్రయత్నం చేస్తుందన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా భారత రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో హిందూ ఐక్య వేదిక కరీంనగర్ జిల్లా కన్వీనర్ అనుమండ్ల రాజిరెడ్డి, కో కన్వీనర్లు డా . రమణాచారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, రామ్ కిరణ్, పి .కిషన్, కిరణ్ సింగ్, ఆది శ్రీనివాసరావు, పీఠాధిపతులు శ్రీశ్రీ సనక సనంద స్వామీజీ, పురాణం మహేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



## గురుకులాలు, ప్రభుత్వ హాస్టల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

### మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, ఎమ్మెల్యే

**విశ్వంభర, మిర్యాలగూడ :** సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ , మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్ని విభాగాల అధికారులతో , ఎం ఈ ఓ లతో, గురుకులాల ప్రిన్సిపల్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ గురుకులాలు, ప్రభుత్వ హాస్టల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలియజేసారు. అలాగే సరైన విద్య వారికి కావాల్సిన బుక్స్ విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. దానికోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి అని ఆదేశించారు.

అలానే విద్యార్థులకు సరైన పౌష్టిక ఆహారం అందించకపోయిన, పరిసరాలు శుభ్రంగా లేకపోయిన నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు విచారణకు సహకరించాల్సిందే: హైకోర్టు



**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహిల్ పోలీసుల విచారణకు హాజరు కావాల్సిందేనని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. డిసెంబరు 16న పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరుకావాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ప్రజాభవన్ ఎదుట బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో సాహిల్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సాహిల్ దుబాయ్‌లో ఉంటున్నారు. తాజాగా ఈ కేసుపై విచారణ చేసిన న్యాయస్థానం... పోలీసు విచారణకు సహకరించాలని సాహిల్‌ను ఆదేశించింది.

## పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు



**విశ్వంభర, హైదరాబాద్:** కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. కింది కోర్టు ఉత్తర్వులు కొట్టివేయాలన్న ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది. లగచర్ల ఘటనలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ నరేందర్‌రెడ్డి ఇటీవల క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని హైకోర్టు తిరస్కరించడంతో పాటు.. మెరిట్స్ ఆధారంగా బెయిల్ పిటిషన్‌ను పరిశీలించాలని కింది కోర్టును ఆదేశించింది.

### బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై

## బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. విధులు అడ్డగించి బెదిరించారని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కౌశిక్‌రెడ్డి సహా 20 మంది అనుచరులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్న వారిని గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసేందుకు కౌశిక్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం బంజారాహిల్స్ పీఎస్‌కు వచ్చారు. ఎమ్మెల్యే వచ్చే సమయానికి బయటికి వెళ్తున్న సీఐను గమనించి తన ఫిర్యాదు స్వీకరించిన అనంతరమే వెళ్లాలని డిమాండ్ చేశారు. అర్జంట్ పని ఉంది బయటకు వెళ్తున్నా.. తిరిగి వచ్చిన తర్వాత తీసుకుంటానని సీఐ చెప్పడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారాస కార్యకర్తలు సీఐ వాహనాన్ని అడ్డుకుని నినాదాలు చేశారు. దీంతో సీఐ వెనక్కి వచ్చి ఎమ్మెల్యే వద్ద ఫిర్యాదు పత్రం తీసుకున్నారు.

### రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో

## జీజీహెచ్ వైద్యులను విచారించిన ఎస్పీ

**విశ్వంభర, ఒంగోలు:** ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, నరసాపురం మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజును కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన కేసులో విచారణ కొనసాగుతోంది. రఘురామ వైద్య నివేదికను అప్పటి జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ట్యాంపరింగ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం గుంటూరు జీజీహెచ్ సిబ్బందిని ప్రకాశం ఎస్పీ దామోదర్ విచారించారు. జీజీహెచ్ ఆర్ఎంవో సతీష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేంద్ర, ఈసీజీ టెక్నీషియన్ నాగరాజు విచారణకు హాజరయ్యారు. ఒంగోలు ఎస్పీ కార్యాలయంలో ముగ్గురినీ 5 గంటల పాటు ఎస్పీ విచారించి.. వారి వాంగ్మూలాలు నమోదు చేశారు.

## గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ




**విశ్వంభర, హాలియా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్. మొహమ్మద్ హసన్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు శివకోటికి బుధవారం సుమారు 8వేల రూపాయల విలువైనసాహిత్య, ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను నల్గొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీ దస్రు నాయక్ సమక్షంలో వారి గ్రంథాలయానికి అందజేశారు.

### మహాలక్ష్మి పథకం కింద

## ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ. 2500 ఇవ్వాల్సిందే

**12 నెలల కాలానికి గానూ బాకీ పడ్డ రూ 30 వేలు చెల్లించాలి**

**రేవంత్ సీఎం అయిన తర్వాత ఆరు నెలల పాటు ఒక్క ప్రాజెక్టు లో స్పూన్ మట్టి కూడా తియ్యలేదు**

**తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చడం కాదు...**

**మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేసినప్పడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి**

**తెలంగాణ జాగృతి ఉమ్మడి వరంగల్, నిజామాబాద్ జిల్లాల నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**




**విశ్వంభర, హైదరాబాద్ :** అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంటపడుతూనే ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. ప్రభుత్వంలో జరిగే తప్పులను తెలంగాణ జాగృతి సంస్థ ఎప్పటికప్పుడు ఎత్తిచూపిస్తుందన్నారు. బుధవారం తన నివాసంలో జరిగిన తెలంగాణ జాగృతి వరంగల్, నల్గొండ జిల్లాల నాయకుల సమావేశంలో ఎమ్మెల్సీ కవితమాట్లాడుతూ ముఖ్యమంత్రి తమకు ఏదో చేస్తారన్న విశ్వసం ప్రజల్లో లేదని స్పష్టం చేశారు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా ఇవ్వడం లేదు. నెలకు రూ. 2500 చొప్పున రూ. 30 వేలు ఒక్కో మహిళకు సీఎం బాకీ ఉన్నారు. రూ. 2 వేలు పెన్షన్ పెంచామని చెప్పారు కానీ పెంచలేదు. ఆ మొత్తం కూడా ఒక్కొక్కరికి రూ. 24 వేలు సీఎం బాకీ పడ్డారు. వీటన్నింటిపై మనం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసినప్పడే తెలంగాణ తల్లికి నిజమైన నివాళి అర్పించినవాళ్లవుతారని స్పష్టం చేశారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్పు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిమళ్లింపు రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించడం, ప్రజా సమస్యలపై ప్రశ్నించడమే తెలంగాణ సంస్కృతి అని తెలిపారు.కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు తెలంగాణ చేతిలో ఉండేదని, ఇప్పుడు అక్కడ కేంద్ర బలగాలు మోహరించాయని తెలిపారు. నరసింహావతారంలా పేగులు మెడల వేసుకుంటా అని సీఎం అంటున్నారు కాదా ? నిజంగా ధైర్యం ఉంటే నాగార్జున సాగర్ వద్ద నరసింహావతారం ఎత్తి కేంద్ర బలగాలను వెనక్కి పంపించి మన నీళ్లు మనకు తీసుకురావాలని సవాలు చేస్తున్నాను అని వ్యాఖ్యానించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణ జలాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరలించుకుపోతుంటే సీఎం రేవంత్ రెడ్డి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని అన్నారు.ఏ హస్టల్ లో ఏ ఆడపిల్లకు అన్యాయం జరిగి చనిపోయినా అక్కడికి వెళ్లి ఆ అన్యాయాన్ని ప్రశ్నించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా వస్తున్న సామాజిక మార్పులను పరిగణలోకి తీసుకొని బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అంశాన్ని తీసుకున్నాము అని వ్యాఖ్యానించారు. గతంలో ప్రారంభించిన కార్యచరణను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. అనేక వర్గాల నుంచి తమకు మద్ధతు వస్తోందని చెప్పారు.కేసీఆర్ స్ఫూర్తితో, ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకత్వంలో తెలంగాణ జాగృతి సంస్థ ఏర్పడిందని, తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా అనేక సామాజిక అంశాలపై తెలంగాణ జాగృతి ఉద్యమించిందని తెలిపారు. అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం పోరాడి సాధించామని గుర్తు చేశారు. 16 రాజకీయ పార్టీలను ఒప్పించి మహిళా రిజర్వేషన్ చట్టం సాకారం కావడానికి కృషి చేశామని ఆమె స్పష్టం చేశారు.

### వైభవంగా

## నాగచైతన్య - శోభిత వివాహం



**విశ్వంభర, హైదరాబాద్ :** అక్కినేని ఇంట పెళ్లి బాజా మోగింది. నాగచైతన్య శోభిత వివాహం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. హిందూ సంప్రదాయ పద్ధతిలో అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ఈ ముచ్చటైన వేడుకకు సినీ ప్రముఖులు చిరంజీవి దంపతులు, వెంకటేశ్, అల్లు అర్జున్, టి. సుబ్బరామిరెడ్డి, ఎన్టీఆర్, రామ్ చరణ్, రానా, అల్లు అరవింద్, కీరవాణి, సుహాసిని తదితరులు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు.

కాగా..స్నేహితులైన చైశోభిత నిశ్చితార్థం ఆగస్టులో జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు, నాగచైతన్య సోదరుడు, నటుడు అఖిల్‌కు సైతం ఇటీవల నిశ్చితార్థం జరిగింది. వచ్చే ఏడాది వివాహం జరగనుంది. ఇక సినిమాల విషయానికొస్తే.. నాగచైతన్య 'తండేల్'తో బిజీగా ఉన్నారు. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు.

మా జీవితాల్లో ఆనందాన్ని తెచ్చారు: నాగార్జున

పెళ్లి ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ నాగార్జున ఆనందం వ్యక్తం చేశారు. ''శోభిత, చైతు కలిసి అందమైన అధ్యాయాన్ని ప్రారంభించడం నాకు ప్రత్యేకమైన, భావోద్వేగ క్షణం. చైకి అభినందనలు. శోభితకు మా కుటుంబంలోకి స్వాగతం. మీరు ఇప్పటికే మా జీవితాల్లో చాలా ఆనందాన్ని తెచ్చారు. శతజయంతికి గుర్తుగా స్థాపించిన ఏఎన్నార్ విగ్రహం చెంత ఆయన ఆశీర్వాదంతో ఈ వేడుక జరగడం మరింత అర్థాన్ని తీసుకొచ్చింది. ఈ ప్రయాణంలో అడుగడుగునా ఆయన ప్రేమ, మార్గదర్శకత్వం మాతో ఉన్నట్లు అనిపిస్తోంది'' అని పేర్కొన్నారు.

## గీతం స్కాలర్ అభిలాషకు డాక్టరేట్



**విశ్వంభర, సంగారెడ్డి :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి అభిలాష దుబ్బా డాక్టరేట్ కు అర్హత సాధించారు. ఐదు హెటెరోసైక్లిక్ సమ్మేళనాలను కలిగి ఉన్న ఇండోల్ యొక్క సంశ్లేషణ, ఫార్మకోలాజికల్ మూల్యాంకనం' అనే అంశంపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కొప్పుల బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అభిలాష పరిశోధన ఫార్మాకోఫోర్ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగించి నూతన హెటెరోసైక్లిక్ సమ్మేళనాల సంశ్లేషణపై దృష్టి పెట్టడడమే గాక, వాటి జీవసంబంధ కార్యకలాపాలను మూల్యాంకనం చేసినట్టు తెలియజేశారు.ఈ పరిశోధనలో సంశ్లేషణ చేసిన సమ్మేళనాలు నూతన క్యాన్సర్ నిరోధక, బాక్టీరియా నిరోధక ఏజెంట్ల కోసం అన్వేషణలో విలువైన ఔషధ గుణాలు గల అణువులుగా ఉపయోగపడే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, ఇది ఔషధ రసాయన శాస్త్రంలో మంచి పురోగతిని సూచిస్తోందన్నారు.అభిలాష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ట్రస్ట్ ఆస్తులు కాపాడండి



**విశ్వంభర,కుత్బుల్లాపూర్ :** గాజులరామారం డివిజన్ వెంకటాద్రి హిల్స్ నల్లగుట్ట లో స్వయంభుగా వెలసిన సత్యనారాయణ స్వామి వైష్ణవి దేవి ఆలయాలు, గాజుల రామారం లోని పటేల్, పట్వారిలు, శాశ్వత సభ్యులుగా కొనసాగారు. సర్వేనెంబర్ 79 లో గల భూమిని అప్పట్లో రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న దేవేందర్ గౌడ్ 1996లో దేవస్థానాలకు పది ఎకరాలు కేటాయించడం జరిగింది. ఇక్కడ మొత్తం 47 ఎకరాలు కొండగా ఉండడంతో పరమేశ్వర్ సింగ్, ట్రస్టుకు పది ఎకరాలు కేటాయించడం జరిగింది, పరమేశ్వర్ సింగ్ చనిపోయిన తర్వాత వారసత్వంగా వారి వారసులు, గన్ను సింగ్, సురేందర్ సింగ్, రామ్ నారాయణ సింగ్, దేవస్థానం సభ్యులుగా కొనసాగుతున్నారు. వైష్ణవి మాత దేవాలయం సభ్యులుగా ఠాగూర్ జ్యోతి బోనియా, నవీన్ బోనియా, గత 35 సంవత్సరాలుగా ట్రస్ట్ గా ఏర్పడి దీనిని ఇప్పటివరకు కాపాడుతూ వచ్చారు. ప్రతి సంవత్సరం ఇక్కడ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. హైదరాబాద్ నుండి కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి వేలాది ప్రజలు ఇక్కడికి రావడం జరుగుతుంది, సత్యనారాయణ స్వామి వైష్ణవి దేవాలయాల మొక్కులు తీర్చుకుంటే తమకు అనుకున్న జరుగుతుందని ఇక్కడ భక్తుల నమ్మకం, ఈ పది ఎకరాలు స్థలంలో వసతి గృహాలు, గోశాల, మంటపం మొదలైనవి ఉన్నాయి. రాజీవ్ గృహకల్ప వారు తమకు కేటాయించిన స్థలాన్ని హై కోర్ట్ ఆర్డర్ ఉండగా తమ దగ్గర గల స్థలాన్ని, స్థానిక నాయకులతో కలిసి కబ్జా చేయాలని చూస్తున్నారు. తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇక్కడ విగ్రహాలను ధ్వంసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. దీనిపైన న్యాయం చేసి దేవాలయాల భూములను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రధానమంత్రి సురక్ష బీమాను సద్వినియోగం చేసుకోవాలి



**విశ్వంభర, ఆమనగల్లు :** సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ తిరుపతి అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదే శాల మేరకు బుధవారం ఆమనగల్లు మండలంలోని మంగళపల్లి, గౌరీపల్లి గ్రామంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం భాగంగా ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూ రిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంవ త్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం వుందన్నా రు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన 436 సంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హులు ఫిషింగ్ కాల్స్ ద్వారా సేవింగ్ కాల్స్ ద్వారా ఆన్లైన్ ద్వారా జరిగే ఫ్రాడ్స్ పై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు సివివి నెంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు. ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే 1930 కి కాల్ చేసి తెలపాలని కోరారు. అదేవిధంగాసైబర్ మోసలపై వీడ్స్ కౌన్సిలర్స్ అవగాహనా నిర్వహించమన్నారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉచిత విద్యుత్‌పై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: మంత్రి గొట్టిపాటి



**విశ్వంభర, అమరావతి:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. 200 యూనిట్ల వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరూ దీన్ని వినియోగించుకోవాలని కోరారు. 15,17,298 ఎస్సీ కుటుంబాలకు, 4,75,557 ఎస్టీ కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందిస్తోందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది తెదేపానే అని గుర్తుచేశారు. దీనిపై అసత్య ప్రచారాలు నమ్మొద్దని కోరారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లేలా కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు.

# తెలుగు రాష్ట్రాల్లో స్వల్ప భూ ప్రకంపనలు

- ఇళ్ల నుంచి బయటకు ప్రజల పరుగులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. బుధవారం ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుంచి బయటకు పరుగులు తీశారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.0గా నమోదైంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు వెల్లడించారు. భూకంప కేంద్రం నుంచి 225 కి.మీ పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది. ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, జగ్గయ్యపేట, నందిగామ, ఏలూరు సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. తెలంగాణలో హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, జనగామ జిల్లాల పరిధిలో ప్రకంపనలు వచ్చాయి. హైదరాబాద్ నగర పరిధిలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పరిసర ప్రాంతాల్లో భూమి కంపించింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, హనుమకొండ, భూపాలపల్లితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, చింతకాని, నాగులవంచ, ఇల్లెందు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రకంపనలు వచ్చాయి. ఏటూరు నాగారం మండలం శంకరాజుపల్లెలో ఓ ఇంటి గోడ కూలింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 3 సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

**ములుగు నుంచి 50కి.మీ దూరంలో..**

ములుగు నుంచి 50 కిలోమీటర్లు ఈశాన్యం వైపు ఏటూరు నాగారం భూకంప కేంద్రంలో రిక్టర్ స్కేల్ పై 5 తీవ్రతగా భూకంపం నమోదైందని వరంగల్ కాకతీయ వర్సిటీ జియాలజీ విభాగాధిపతి ఆర్. మల్లికార్జునరెడ్డి తెలిపారు. గతంలో 1969, 2018లో కొత్తగూడెం, భద్రాచలంలో భూ ప్రకంపనలు వచ్చాయని వెల్లడించారు. భూ కంపాలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలు మూడో జోన్ కిందికి వస్తాయన్నారు. భూ ప్రకంపనలు వచ్చిన మరికొన్ని ప్రాంతాలు..



ఏలూరు జిల్లా కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టయగూడెం, టి.నరసాపురం మండలం బొర్రాంపాలెం, జంగారెడ్డిగూడెం పట్టణం, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ఎన్టీఆర్ జిల్లా నందిగామ, గంపలగూడెం, అనుముల్లంక, తిరువూరు, పెనుగంచిప్రోలు, వరంగల్ జిల్లాలోని నర్సంపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, చెన్నారావుపేట మండల కేంద్రం.

**50 ఏళ్ల తర్వాత ఆ తీవ్రతతో..**

1969లో భద్రాచలం పరిసరాల్లో దాదాపు ఇదే తీవ్రతతో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. సుమారు 50 ఏళ్ల తర్వాత నేడు ఆ తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని భూగర్భ శాస్త్రవేత్తలు చెప్పారు. భూమి పగుళ్లలో ఒత్తిడితో స్థానచలనం జరిగి ప్రకంపనలు వస్తుంటాయని తెలిపారు.హైదరాబాద్, భద్రాచలం, ఏటూరు నాగారం, ములుగు తదితర ప్రాంతాలు జోన్3లో ఉన్నాయన్నారు. జోన్5లో ఉన్న ఉత్తర భారతంలోని ప్రాంతాలతో పోలిస్తే మన దగ్గర తీవ్రత తక్కువగా ఉంటుందని చెప్పారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

**ఆ ఘటనతో సంబంధముందా?**

మేడారంలో భూకంప కేంద్రం గుర్తించిన నేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ ఘటనపై స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు 31న మేడారం ప్రాంతంలో భారీ వర్షంతో పాటు టోర్నడో తరహాలో బలమైన ఈదురు గాలులు వీచాయి. సుమారు 50వేల చెట్లు నేలకూలాయి. ఏటూరునాగారం నుంచి మేడారం మీదుగా తాడ్వాయి మండలం గోనెపల్లి వరకు దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో ఈ నష్టం జరిగింది. ఇప్పుడు అదే ప్రాంతంలో భూకంప కేంద్రాన్ని శాస్త్రవేత్తలు గుర్తించడంతో ఆ ఘటనతో దీనికి ఏమైనా సంబంధం ఉందా?అనే కోణంలో చర్చ జరుగుతోంది. అయితే వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులకు, భూ ప్రకంపనలకు సంబంధం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**40 కి.మీ లోతులో భూకంప కేంద్రం: అర్విందకుమార్**

తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలపై తెలంగాణ విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ వివరణ ఇచ్చారు. ములుగు జిల్లా మేడారం వద్ద భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు చెప్పారు. భూమికి 40 కి.మీ లోతులో ప్రకంపనలు వచ్చాయన్నారు. భూకంప కేంద్రం ఎక్కువ లోతులో ఉన్నందున ప్రకంపనల తీవ్రత తక్కువగా ఉందని చెప్పారు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని వివరించారు.






## దేశంలోని కళలను ప్రపంచానికి తెలిపేందుకే 'కృష్ణవేణి సంగీత నీరాజనం': మంత్రి దుర్గేశ్



**విశ్వంభర, విజయవాడ:** కేంద్ర, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. దేశంలో ఉన్న కళలను ప్రపంచానికి తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే దీనికి సంబంధించి రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ముందుగా ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో కేంద్ర మంత్రులు షెకావత్, నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు పాల్గొంటారని తెలిపారు.గడిచిన ఐదేళ్లలో ఇటువంటి కార్యక్రమాలు ఎక్కడ జరగలేదని, మళ్లీ వాటిని తాము పునఃప్రారంభిస్తున్నామని మంత్రి దుర్గేశ్ వివరించారు. సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో కేంద్రం నుంచి స్పెషల్ అసిస్టెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కింద పర్యాటక రంగానికి రూ.177 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. గత పాలకులు పర్యాటక రంగాన్ని గాలికొదిలేశారన్నారు. గతంలో ప్రతిపక్షనేతలుగా ఉన్న చంద్రబాబు, పవన్‌ను దూషించేందుకే ఆ శాఖ మంత్రిని వాడుకున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు మన సాంస్కృతి, కళారూపాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకోస్తామన్నారు.

## అర్బన్ అథారిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు భూమిని గుర్తించాలి: మంత్రి నారాయణ



**విశ్వంభర, అమరావతి:** అర్బన్ అథారిటీల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. కర్నూలు, కడప, అనంతపురంహిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల అధికారులు, ఛైర్మన్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అర్బన్ అథారిటీల ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణం, లేఅవుట్లను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు.పట్టణ ప్రాంతాలకు సమీపంలో మిడిల్ ఇన్‌కం గ్రూప్, హై ఇన్‌కం గ్రూప్ ఇళ్లను నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఇళ్ల నిర్మాణాల కోసం అవసరమైన భూమిని ఎంపిక చేయాలని ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెలాఖరులోగా స్థలం ఎంపిక పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలన్నారు.

## పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం వాయిదా



**విశ్వంభర, శ్రీహరికోట:** శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి చేపట్టాల్సిన పీఎస్ఎల్వీసీ59 ప్రయోగం వాయిదా పడింది. కౌంట్‌డౌన్ ప్రక్రియ 25.30 గంటల పాటు కొనసాగిన తర్వాత బుధవారం సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీసీ59ను మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి పంపాలని శాస్త్రవేత్తలు ఏర్పాట్లు చేశారు. ఉపగ్రహంలో సాంకేతిక లోపం కారణంగా వాయిదా పడింది. గురువారం సాయంత్రం 4.12 గంటలకు పీఎస్ఎల్వీసీ59 నింగిలోకి పంపుతామని ఇస్రో ప్రకటించింది. యురోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా3 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీసీ59 ..కక్ష్యలోకి తీసుకెళ్లనుంది.

## ఆమె త్యాగం వెలకట్టలేనిది

- అందుకే ఆమె మరణించినా జీవితకాలం బతికి ఉండిపోతారు
- శరీర దాత వీరగోని లక్ష్మి సంస్మరణ సభలో వక్తలు



**విశ్వంభర,కరీంనగర్:** బతుకు..అందరినీ బతకనివ్వు అనే సందేశాన్ని స్వర్గీయ వీరగోని లక్ష్మి సమాజానికి అందించిందని వక్తలు అభిప్రాయపడ్డారు. మనిషి జీవితం, నడవడిక పుస్తకాలు నేర్పితే వచ్చేవి కావన్నారు. వీరగోని లక్ష్మి త్యాగం,సంఘర్షణ వెలకట్టలేనివని కొనియాడారు.బుధవారం కరీంనగర్ భగత్ నగర్ లోని బృందావన్ గార్డెన్స్ లో జరిగిన శరీర దాత వీరగోని లక్ష్మి సంస్మరణ సభకు కవులు, రచయితలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ వేత్తలు,పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.పది రోజుల క్రితం ఉపాధ్యాయ సంఘం నాయకులు, రిటైర్డ్ ఎంఈఓ వీరగోని పెంటయ్య సతీమణి లక్ష్మి అనారోగ్యంతో మరణించగా ఆమె ఆశయం మేరకు కుటుంబ సభ్యులు పార్థీవ దేహాన్ని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీకి సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.కుటుంబ సభ్యులు, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంస్మరణ సభ నిర్వహించగా, ఇందులో పాల్గొన్న వ్యక్తులు మాట్లాడుతూ లక్ష్మి జీవించి ఉన్నప్పుడే కాదు, మరణించిన తరువాత కూడా సమాజానికిసందేశం ఇస్తూ పోయిందన్నారు. ఆమెను మానవీయ మహిళగా అభివర్ణించారు. మొద్దు బారిన హృదయాలున్న సమాజంలో మనం జీవిస్తున్నామని, అలాంటి సమాజంలో స్వచ్ఛమైన గోదావరి ప్రవాహం వలె లక్ష్మి ముందుకు సాగిందన్నారు. ప్రపంచ స్పృహ,లౌక్యం తెలిసిన వ్యక్తిగా ఆమెను కొనియాడారు. తాను చదువుకోకపోయినా.. సంఘర్షణలను తట్టుకొని నిలబడగలిగారని, మరణించేంతవరకు సాటివారిపై ప్రేమను కురిపిస్తూనే వచ్చారని చెప్పారు. అందుకే ఆమె చనిపోయినా, జీవితకాలం బతికి ఉండిపోతారని తెలిపారు.ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. శరీర దానం చేసిన సందర్భంగా లక్ష్మి భర్త వీరగోని పెంటయ్య,వారి కుమారులు సురేష్ మానస, నరేష్ కృష్ణవేణి, కూతుర్లు అల్లుండ్లు సమతతిరుపతి సౌజన్యశ్రీనివాస్ లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, సలహాదారులు తాడూరు కరుణాకర్, కరీంనగర్ పట్టణ కన్వీనర్ యస్.రాజకనకయ్య జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావ్, బిజెపి నేత చల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు రఘు శంకర్ రెడ్డి, కోల.రాజమల్లు, నారాయణరెడ్డి, ప్రముఖ కథా రచయిత అల్లం రాజయ్య, కవి అన్నవరం దేవేందర్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర బాబు, రిటైర్డ్ ప్రిన్సిపల్ జి నాగేందర్, స్వర్గీయ ఆకుల భూమయ్య కుమార్తె ఆకుల కవిత, తదితరులు శరీర దాత లక్ష్మితో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. తొలుత ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## థరూర్‌జీ.. అవసరమైతే ధర్నాకు కూర్చోండి

### అశ్వినీ వైష్ణవ్ సూచన



**దిల్లీ:** తిరువనంతపురంలో రైల్వే ప్రాజెక్టులో జాప్యంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు పూర్తయ్యేలా భూ సేకరణ కోసం రైల్వేలకు సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేయాలని కోరారు. రైల్వే ప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణ కోసం అవసరమైతే కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కేరళలో ధర్నా చేయవచ్చని వైష్ణవ్ సూచించారు.లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో శశిథరూర్ తన సొంత నియోజకవర్గమైన తిరువనంతపురంలో నెమోమ్ రైల్వే టెర్మినల్ ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం, నిధుల కొరతపై అడిగిన ప్రశ్నకు వైష్ణవ్ పైవిధంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద నగరాలు,జంక్షన్లలో రద్దీని తగ్గించడంపై, కొత్త టెర్మినల్స్ నిర్మాణంపై దృష్టిపెట్టిందన్నారు. రాబోయే 50 ఏళ్లలో డిమాండ్లు, అవసరాలను తీర్చేలా డిజైన్లు రూపకల్పన చేస్తోందన్నారు. అయితే, కేరళలో నిధుల సమస్య కాదని, ఇప్పటికే భూసేకరణ కోసం రూ.2,150 కోట్లు డిపాజిట్ చేసినట్లు మంత్రి వెల్లడించారు. అవసరమైతే భూసేకరణ కోసం రాష్ట్రప్రభుత్వం ముందు ధర్నాకు కూర్చోవాలని థరూర్‌ని కోరుతున్నట్లు వైష్ణవ్ తెలిపారు.

**10వేల జనరల్ బోగీల తయారీకి ప్రత్యేక చర్యలు**

దేశ వ్యాప్తంగా కోట్ల మంది ప్రజలకు సేవలందిస్తోన్న రైళ్లకు కొత్త జనరల్ బోగీలను ఏర్పాటు చేయడంపై దృష్టిపెట్టినట్లు కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. మోదీ సర్కారు పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. "ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, థర్డ్ ఏసీ బోగీలపై కాకుండా జనరల్ కోచ్‌లపైనే ఎక్కువ ఫోకస్ పెట్టాం. డిసెంబర్ నెలాఖరు నాటికి 1000 జనరల్ కోచ్‌లను రైల్వే నెట్ వర్క్‌లకు జత చేస్తాం. 10వేల జనరల్ కోచ్‌ల తయారీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 1300 రైల్వే స్టేషన్లను పునర్నిర్మించి ఆధునీకరిస్తున్నాం. ఈ ప్రాజెక్టు కింద అనేక రైల్వే స్టేషన్లను రూ.700 800 కోట్లతో, మరికొన్ని రూ.100 రూ.200 కోట్లతో పునర్నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టు పూర్తయితే.. రైల్వే స్టేషన్లు మరింతగా మెరుగుపడాలన్న ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి" అన్నారు.

## యూపీఐ లైట్ వాలెట్ పరిమితి ఇక ₹5వేలు

**ముంబయి:** యూపీఐ లైట్‌కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. యూపీఐ లైట్ వాలెట్ పరిమితిని రూ.5 వేలకు పెంచింది. ప్రస్తుతం ఈ మొత్తం రూ.2వేలుగా ఉంది. అలాగే, ఒక్కో లావాదేవీ పరిమితిని సైతం రూ. 500 నుంచి వెయ్యి రూపాయలకు పెంచుతున్నట్లు తెలిపింది. సత్వరమే జరిగే ఈ డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో లైట్ పరిమితిని పెంచినట్లు ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్‌లో ఎంపీసీ భేటీ సందర్భంగా దీనికి సంబంధించి ఆర్‌బీఐ ప్రకటన చేసింది.ఎలాంటి పిన్ ఎంటర్ చేయకుండానే యూపీఐ పేమెంట్స్ చేయడానికి ఉపయోగించేదే యూపీఐ లైట్. ఈ సేవలు పొందాలంటే ముందుగా యూపీఐ లైట్ వాలెట్‌లో బ్యాలెన్స్ ఉండాలి. బ్యాంకు ఖాతా నుంచి యూపీఐ ద్వారా లోడ్ చేసుకోవచ్చు. ఆపై స్కాన్ చేసిన ప్రతిసారీ పిన్ ఎంటర్ చేయకుండానే పేమెంట్ చేయొచ్చు. యూపీఐ లైట్ విస్తృతంగా వినియోగించే వారికి ఈ నిర్ణయంతో పదే పదే లోడ్ చేసుకోవాల్సిన అవసరం తప్పుతుంది.

## కనిపించకుండా పోయిన బాలుడు.. పదేళ్ల తర్వాత ఆచూకీ లభ్యం




**విశ్వంభర, హైదరాబాద్:** ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకుండా పోయిన బాలుడి ఆచూకీ పదేళ్ల తర్వాత మహిళా భద్రత విభాగం పోలీసులు గుర్తించారు. నగరంలోని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే మహ్మద్ అర్షద్ కుమారుడు పన్నెండేళ్ల మహ్మద్ ఖలీల్ 2014లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలుడు తన వెంట ఆధార్ కార్డు తీసుకుని వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కేసును ఏహెచ్‌టీయూ, సీఐడీ విభాగానికి బదిలీ చేశారు. విచారణ చేపట్టిన ఏహెచ్‌టీయూ పోలీసులు పలు ప్రాంతాల్లో బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నించారు.అయితే ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ రైల్వే స్టేషన్‌లో అక్కడి రైల్వే పోలీసులు బాలుడిని గుర్తించి బాలల సంరక్షణ కేంద్రంలో చేర్పించారు. 2022 వరకు అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత ఓ ప్రభుత్వ ఉద్యోగి బాలుడిని దత్తత తీసుకున్నాడు. పేరును అభినవ్ సింగ్‌గా మార్చేశాడు. ఎట్టకేలకు పోలీసులు ఆచూకీని కనుగొని అతన్ని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పదేళ్ల తర్వాత తమ కుమారుడి ఆచూకీ లభించడంతో కుటుంబసభ్యులు ఆనందంలో మునిగిపోయారు.

## గెలుపోటములు కేసీఆర్ చరిత్ర ముందు చాలా చిన్నవి : జగదీశ్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** గెలుపోటములు అనేవి కేసీఆర్ చరిత్ర ముందు చాలా చిన్నవని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో పుస్తక ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు తన గురించి తాను చెప్పుకోవడం ఇష్టముండదన్నారు. కేసీఆర్ గొప్ప గురించి సరిగా చెప్పకపోవడం మన తప్పేనన్నారు. ఇక్కడ లిల్లీ పుట్ ల గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేసీఆర్ చరిత్రలో సీఎం పదవి అనేది చాలా చిన్నదని.. సీఎం పదవి కేసీఆర్ కాలిగోటికి సమానమని.. కేసీఆర్‌కు తెలంగాణ తెచ్చిన యోధుడిగానే చూడడానికి నేను ఇష్టపడతానన్నారు. నాగార్జున సాగర్‌కు కిందకు జరిపిన ఆయనకు ఆంధ్రావాళ్లు మంత్రి పదవి ఇచ్చి గౌరవించారన్నారు. కేసీఆర్ ప్రాణాన్ని ఫణంగా పెట్టి తెలంగాణ సాధిస్తే ఆయనకు ఇక్కడి పార్టీలు ఇచ్చిన గౌరవమేమిటి? అని ప్రశ్నించారు. కేసీఆర్ మీద కూడా ఎన్నికల్లో పోటీపెట్టడం బాధాకరమైన విషయమన్నారు. కేసీఆర్‌కు ఇక్కడి రాజకీయ పార్టీలు ఇచ్చిన గౌరవాన్ని చూసి బాధపడ్డానన్నారు.కొందరు కేసీఆర్‌పై రాసేందుకు ఎందుకు బిడియపడుతున్నారో చెప్పాలన్నారు. మార్క్స్, లెనిన్ గురించి చెప్పే వారు.. కేసీఆర్ గురించి ఎందుకు చెప్పడం లేదన్నారు. కేసీఆర్ ఏం చేసినా యజ్ఞంలా చేశారన్నారు. కేసీఆర్ ఉద్యమ పిచ్చి.. తెలంగాణ వచ్చాక కేసీఆర్ అభివృద్ధి పిచ్చి.. మిగతావి ఏవీ కేసీఆర్ అస్సలు పట్టించుకోలేదన్నారు. రాజకీయాలను కేసీఆర్ అస్సలు పట్టించుకోలేదని.. మన నాయకుడి గురించి మనం రాసుకోవడానికి ఇబ్బంది ఏంటీ అన్నారు. ఒకే భాష మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలు తీసుకువచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. గెలుపు, ఓటములు కేసీఆర్ చరిత్ర ముందు చాలా చిన్నవని.. కేసీఆర్ పద్నాలుగేళ్ల పోరాటం ప్రతి రోజూ ఒక పుస్తకం రాయొచ్చన్నారు. సార్ దృష్టిలో 2009 డిసెంబర్ 9నే తెలంగాణ వచ్చిన రోజు అని.. అప్పట్నుంచే కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రణాళికలు రచించారన్నారు. అప్పుడు కొందరు నవ్వుకున్నారని.. అప్పుడు కేసీఆర్ వేసుకున్న ప్రణాళికలు రాష్ట్రం వచ్చిన తర్వాత అమలయ్యాయన్నారు.

హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్..

# ప్రభుత్వంతో కీలక ఒప్పందం



**విశ్వంభర, హైదరాబాద్:** డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందు వరుసలో ఉందని, ఐటీ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సైబర్ సమస్యలపై హైదరాబాద్ కేంద్రంగా పరిష్కారం లభిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో గూగుల్ ప్రతినిధులు భేటీ అయ్యారు. జీఎస్ఈసీ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో గూగుల్ కంపెనీ కీలక ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఐవో రాయల్ హన్సెన్, అరిజిత్ సర్కార్, శ్రీనివాస్ రెడ్డికి.. సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.ప్రముఖ ఐటీ కంపెనీలు ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్నాయని.. గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, అమెజాన్, మెటా సంస్థలు ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేశాయన్నారు. సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్ ఏర్పాటు వల్ల వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. గ్లోబల్ హబ్‌గా మారేందుకు హైదరాబాద్‌కు అన్ని అవకాశాలున్నాయని రాయల్ హన్సెన్ తెలిపారు. సైబర్, డిజిటల్ సెక్యూరిటీ, సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేయడానికి హైదరాబాద్ అనుకూల ప్రాంతమని ఆయన తెలిపారు.

# స్టెల్లా ఎల్ పనామా నౌకలో మరోసారి తనిఖీలు




**విశ్వంభర, కాకినాడ:** రేషన్ బియ్యం నిల్వచేసిన స్టెల్లా ఎల్ పనామా నౌకలో మరోసారి తనిఖీలు చేపట్టారు. ఇందు కోసం పోర్టు, కస్టమ్స్, పౌరసరఫరాలు, పోలీసు, రెవెన్యూ అధికారులతో బృందం సముద్రంలోకి వెళ్లారు. ఈ మల్టీ డిసిప్లీనరీ కమిటీ బృందం రేషన్ బియ్యం నమూనాలు సేకరించి నిజానిజాలు నిగ్గు తేల్చనుంది.నౌకలో 640 టన్నుల పేదల బియ్యం ఉన్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ గత నెల 27న ప్రకటించారు. 29న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ పోర్టులు సందర్శించి.. ఇక్కడి భద్రత వైఫల్యాలు, కీలక శాఖల పర్యవేక్షణ లోపాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్కడికక్కడే 'సీజ్ ద షిప్' అని ఆదేశించారు. దీంతో అందరి దృష్టి కాకినాడ పోర్టుల వైపు మళ్లింది. కాకినాడ కేంద్రంగా గత అయిదేళ్లు రెచ్చిపోయిన రేషన్ మాఫియా రెక్కలు విరిచేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. వివాదాస్పద నౌక నుంచే ప్రక్షాళనకు నిర్ణయించింది. ఈనేపథ్యంలో ఏర్పాటు చేసిన బృందం బుధవారం నౌకను పరిశీలించింది.

# డిప్యూటీకి 'ఓకే' చెప్పిన శిందే!



**ముంబయి:** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతుండగా.. డిప్యూటీ సీఎం పదవిని స్వీకరించేందుకు ఏక్‌నాథ్ శిందే సుముఖత చూపారు. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రెండున్నర ఏళ్ల పాటు సీఎం పదవిలో కొనసాగిన శిందే.. డిప్యూటీ సీఎం బాధ్యతలను సహకరించేందుకు నిరాకరించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన తీసుకున్న ఈ నిర్ణయం ఊహాగానాలకు చెక్ పెట్టినట్లయింది. కాగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. సీఎం పదవిలో బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌ను కూర్చోబెట్టేందుకు భాజపా అధిష్ఠానం నిర్ణయించింది. బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో ఫడణవీస్ పేరును ప్రతిపాదించగా.. ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబరు 5న ప్రమాణ స్వీకరణ కార్యక్రమం జరగనుండగా.. ఎవరెవరూ ఏ బాధ్యతలు తీసుకుంటారనే విషయంపై స్పష్టత లేకపోయింది. ఎన్సీపీ నేత అజిత్ పవార్‌తో పాటు డిప్యూటీ సీఎంగా బాధ్యతలు తీసుకునేందుకు శిందే అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.

# యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో హత్య

**న్యూయార్క్:** న్యూయార్క్‌లో దారుణం చోటుచేసుకుంది. అమెరికాలో ప్రముఖ ఇన్సూరెన్సు సంస్థ యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో బ్రియాన్ థాంప్సన్ హత్యకు గురయ్యారు. మిడ్‌టౌన్‌లోని హిల్టన్ హోటల్ బయట బుధవారం ఉదయం ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు వెల్లడించారు. ముఖానికి మాస్కుతో వచ్చిన దుండగుడు బ్రియాన్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. అదే హోటల్‌లో ఇన్వెస్టర్ డే కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొనాల్సి ఉందని యునైటెడ్ హెల్త్ గ్రూప్ సీఈవో ఆండ్రూ విట్టీ పేర్కొన్నారు.



# పాలస్తీనా ఆక్రమణను వ్యతిరేకిస్తూ ఐరాసలో తీర్మానం

### అనుకూలంగా ఓటేసిన భారత్

**దిల్లీ:** తమ భూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించుకోవడం చట్ట విరుద్ధమని ప్రకటించాలని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని పాలస్తీనా కోరుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్ దళాలు వీడాలంటూ ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. 1967 నుంచి తూర్పు జెరూసలెం సహా పలు ప్రాంతాలను ఇజ్రాయెల్ ఆక్రమించడంపై శాంతియుత పరిష్కారం కోరుతూ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానంపై ఐరాసలో ఓటింగ్ నిర్వహించారు. కాగా దీనికి అనుకూలంగా భారత్‌తో సహా 157 దేశాలు ఓటు వేశాయి. అమెరికా, ఇజ్రాయెల్, అర్జెంటీనా సహా ఇతర 8 దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశాయి.కాగా ఉక్రెయిన్, ఉరుగ్వే, పరాగ్వే, జార్జియా, ఈక్వెడార్, చెకియా, కామెరూన్ వంటి దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికి, శాశ్వత శాంతిని నెలకొల్పాలని ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత్ పునరుద్ఘాటించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో సైనిక దాడులు, విధ్వంసం, ఉగ్రవాద, హింసాత్మక చర్యలను తక్షణమే నిలివేయాలని ఈ తీర్మానం స్పష్టం చేసింది. ఆ ప్రాంతాల నుంచి వైదొలగాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేసింది.1947లో అప్పటికి బ్రిటిష్ పాలనలో ఉన్న పాలస్తీనాను రెండుగా విభజించి.. అరబ్బులకు పాలస్తీనా, యూదులకు ఇజ్రాయెల్ ఏర్పాటుచేయాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానించింది. అప్పటికి బ్రిటీషర్ల అధీనంలో ఉన్న భూభాగంలో 55 శాతం ఇజ్రాయెల్‌కు, 45 శాతం పాలస్తీనాకు ఇవ్వాలని నిర్ణయించారు. యూదులు ఈ ప్రతిపాదనకు అంగీకరించగా, పాలస్తీనావాసులు ససేమిరా అన్నారు. దీంతో ఐరాస ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు. ఇంతలో ఇజ్రాయెల్ యూదులు అధికంగా ఉండే ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. వెంటనే చుట్టూ ఉన్న ఇతర అరబ్ దేశాలతోపాటు పాలస్తీనీయులు ఇజ్రాయెల్‌పై యుద్ధం ప్రకటించారు.



ఆ యుద్ధంలో ఇజ్రాయెల్ నెగ్గి.. మరింత భూభాగాన్ని సొంతం చేసుకుంది. తర్వాత జరిగిన అరబ్ యుద్ధాల్లోనూ విజయం సాధించడంతో ఇజ్రాయెల్ భూభాగం పెరుగుతూ పోయింది. పాలస్తీనీయులు ఇజ్రాయెల్‌లో వెస్ట్ బ్యాంక్, గాజా లాంటి కొన్ని ప్రాంతాలకే పరిమితం కావాల్సి వచ్చింది. పాలస్తీనా, ఇజ్రాయెల్‌ల మధ్య సరిహద్దుల విషయంలో ఘర్షణలు చెలరేగాయి. దీంతో 57ఏళ్ల క్రితం నుంచి ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్న తమ భూభాగాలను తిరిగి అప్పగించి ప్రత్యేక దేశంగా పాలస్తీనాను ఏర్పాటుచేయాలని ఆ దేశం కోరుతోంది. కాగా ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది.

# స్వర్ణ దేవాలయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌పై హత్యాయత్నం



**అమృత్‌సర్:** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో కాల్పులు కలకలం రేపాయి. ప్రఖ్యాత స్వర్ణ దేవాలయంలో పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ నేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ )పై గుర్తుతెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన సేవాదార్‌గా శిక్ష అనుభవిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.శిక్షలో భాగంగా స్వర్ణ దేవాలయ ప్రవేశద్వారం వద్ద సుఖ్‌బీర్ చక్రాల కుర్చీపై కూర్చొని సేవాదార్ (కాపలాదారుడు)గా ఉండగా.. ఓ వృద్ధుడు ఆయనను సమీపించాడు. కొన్ని అడుగుల దూరంలోనే ఉన్న అతడు ప్యాంట్ జేబులోంచి తుపాకీ తీసి సుఖ్‌బీర్‌పైకి కాల్పులు జరిపాడు. గమనించిన సుఖ్‌బీర్ వ్యక్తిగత సిబ్బంది వెంటనే వృద్ధుడిని అడ్డుకొని పక్కకు తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. భద్రతా సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనలో సుఖ్‌బీర్‌కు ఎలాంటి హానీ జరగలేదు. ఘటనపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పందించారు. ''సుఖ్‌బీర్ బాదల్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. దీనిపై తక్షణమే దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించా'' అని వెల్లడించారు. కాల్పుల ఘటన అనంతరం సుఖ్‌బీర్ తన శిక్షను కొనసాగించారు. సతీమణి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్‌తో కలిసి స్వర్ణదేవాలయంలో వంటపాత్రలు శుభ్రం చేశారు. నిందితుడిని నరైన్ సింగ్ చౌరాగా గుర్తించారు. అతడు గతంలో బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్ అనే ఉగ్రముఠాలో పనిచేసినట్లు పలు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. 1984లో నరైన్ సింగ్ సరిహద్దులు దాటి పాకిస్థాన్ వెళ్లినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. పంజాబ్‌లోకి అక్రమ ఆయుధాలు తేవడం, పేలుడు పదార్థాల రవాణాలో ఇతడు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆ తర్వాత కొంతకాలానికి భారత్ తిరిగొచ్చిన అతడిని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. కొన్నాళ్ల పాటు జైలుశిక్ష కూడా అనుభవించినట్లు తెలుస్తోంది. శిరోమణి అకాలీదళ్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మతపరమైన తప్పిదాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. 2007-17 మధ్య కాలంలో పార్టీతోపాటు వారి ప్రభుత్వం రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నట్లు అకాల్ తఖ్త్ నిర్ధరించింది. ఈ విషయంలో పార్టీ చీఫ్ సుఖ్‌బీర్‌ను దోషిగా తేల్చింది. సేవకుడిగా అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో పాత్రలు, బూట్లు శుభ్రం చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా శిరోమణి అకాలీదళ్ పార్టీ చీఫ్‌గా ఉన్న ఆయన రాజీనామాను ఆమోదించి.. ఆరు నెలల్లోగా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని సూచించింది. దీంతో ఆయన మంగళవారం నుంచి ఈ శిక్షను అనుభవిస్తున్నారు. చేసిన తప్పులను అంగీకరిస్తున్నట్లు రాసి ఉన్న ఓ చిన్న బోర్డును మెడలో వేసుకొని, చేతిలో ఈటెను ధరించి సేవాదార్‌గా పనిచేస్తున్నారు.

# సీఏపీఎఫ్‌ల్లో లక్షకు పైనే ఉద్యోగ ఖాళీలు

**దిల్లీ:** కేంద్ర సాయుధ బలగాలు , అస్సాం రైఫిల్స్‌లో లక్షకు పైనే ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. గత ఐదేళ్లలో 71,231 పోస్టులు భర్తీ చేసినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. వీటిలో చాలా వరకు పదవీ విరమణ, రాజీనామాలు, పదోన్నతులు, మరణాలు, కొత్త బెటాలియన్ ఏర్పాటు, కొత్త పోస్టులను సృష్టించడం వంటి కారణాల వల్ల ఏర్పడిన ఖాళీలేనన్నారు. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**విభాగాల వారీగా ఖాళీలు ఇలా..**

అక్టోబర్ 30 నాటికి సీఏపీఎఫ్, ఏఆర్‌లో మొత్తంగా 1,00,204 పోస్టులు ఖాళీగా ఉండగా.. అత్యధికంగా సీఆర్‌పీఎఫ్‌లో 33,730, సీఐఎస్ఎఫ్‌లో 31,782, బీఎస్ఎఫ్‌లో 12,808, ఐటీబీపీలో 9,861, ఎస్ఎస్‌బీలో 8,646, అస్సాం రైఫిల్స్‌లో 3377 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ ద్వారా ఈ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేందుకు మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసేందుకు వైద్య పరీక్షలకు సంబంధించి సమయాన్ని తగ్గించడం, కానిస్టేబుల్ జీడీ కోసం షార్ట్ లిస్ట్ అయిన అభ్యర్థుల కటాఫ్ మార్కులను తగ్గించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**ఏడాదిలో 100 రోజులు సెలవులపై..**

మరోవైపు, కేంద్ర సాయుధ బలగాల్లో పనిచేసే సిబ్బంది శ్రేయస్సుకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని మరో ప్రశ్నకు సమాధానంగా మంత్రి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సీఏపీఎఫ్ సిబ్బంది జీవిత సమతుల్యతను మెరుగుపరిచేలా ఏడాదిలో 100 రోజులు వారంతా కుటుంబంతో గడిపేలా మంత్రిత్వశాఖ నిరంతరం కృషిచేస్తోందని తెలిపారు. 2020 నుంచి 2024 అక్టోబర్ వరకు 42,797 మంది సీఏపీఎఫ్, ఏఆర్ సిబ్బంది 100 రోజుల సెలవులు పొందారని గణాంకాలను పేర్కొన్నారు.

# చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలి

### బీజేపీ ఎంపీ అనిల్ ఫిరోజియా

**దిల్లీ:** ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్‌లో అరెస్టు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని బీజేపీ ఎంపీ అనిల్ ఫిరోజియా కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా నిర్వహించిన లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ కృష్ణదాస్ అరెస్ట్ విషయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వానికి సందేశం పంపేందుకు పార్లమెంట్‌లో తీర్మానాన్ని తీసుకువచ్చి, ఆమోదించాలని ప్రధానిని కోరారు. బంగ్లాదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఆ దేశానికి చెందిన లక్షలాది మంది అస్సాంలోకి చొరబడ్డారని అన్నారు. ప్రస్తుతం వారు ఇక్కడి రాజకీయ, ఎన్నికల వ్యవస్థలో నిర్ణయాత్మక అంశంగా మారారని పేర్కొన్నారు. పోలీసుల అదుపులో ఉన్న ఇస్కాన్ ప్రచారకర్త చిన్మయ్ కృష్ణదాస్ కేసులో వాదించేందుకు ముందుకు వచ్చిన న్యాయవాదులపై నిరసనకారులు దాడులు చేస్తున్నారని..వారి దాడిలో తీవ్రంగా గాయపడిన ఓ లాయర్ పరిస్థితి విషమంగా ఉందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎవరూ ఆయన తరపున వాదించేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. దీనిపై సినీ నటి, బీజేపీ నేత హేమమాలిని స్పందించారు. హిందువులపై దాడులు చేస్తే సహించేది లేదని.. అటువంటి చర్యలను భాజపా చూస్తూ ఊరుకోదన్నారు. రెండు దేశాల ప్రజల భావోద్వేగాలు, భగవంతుడి పట్ల ఉన్న భక్తితో ఇది ముడిపడి ఉంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇస్కాన్ ప్రచారకర్తను త్వరలోనే విడుదల చేస్తుందని ఆశిస్తున్నాను అని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ ఆ దేశ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో చెలరేగిన ఘర్షణల్లో ఓ న్యాయవాది ప్రాణాలు కోల్పోవడంతో అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) కార్యకలాపాలపై నిషేధం విధించాలని ఓ న్యాయవాది పిటిషన్ వేశారు. బంగ్లా హైకోర్టు దానిని కొట్టివేసింది. అయితే ఆయన బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు వచ్చే లాయర్లపై ఆందోళనకారులు దాడులు చేస్తుండడంతో.. న్యాయవాదులు ఎవరూ ముందుకురావట్లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.



# హరిద్వార్‌లోని గంగాజలం తాగడానికి పనికి రాదు: పీసీబీ



**హరిద్వార్:** ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని గంగాజలానికి సంబంధించిన కీలక విషయాలని అక్కడి కాలుష్య నియంత్రణ బోర్డు తెలిపింది. ఆ నీరు తాగడానికి పనికి రావని, కేవలం భక్తులు స్నానాలకే వినియోగించవచ్చని పేర్కొంది. ప్రతినెలా 8 ప్రాంతాల్లో నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహిస్తామని.. అందులోభాగంగా హరిద్వార్‌లోని నీరు 'బి' కేటగిరీలో ఉన్నట్లు గుర్తించామని వెల్లడించింది. 'కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి నాణ్యతను ఐదు తరగతులుగా విభజించింది. నాలుగు పారామీటర్‌ల (పీహెచ్, ఆక్సిజన్, బయోలాజికల్ ఆక్సిజన్, కోలిఫాం బ్యాక్టీరియా) ఆధారంగా హరిద్వార్‌లో నీటిని 'బి' కేటగిరీలో ఉన్నట్లు కనుగొన్నాం. ఈ నీరు తాగడానికి పనికిరాదు. భక్తులు స్నానాలు చేయడానికి వినియోగించవచ్చు' అని యూకే పీసీబీ (PCB) అధికారి రాజేంద్రసింగ్ తెలిపారు. మరోవైపు నీటి కాలుష్యంపై స్థానిక పూజారి ఉజ్వల్ పండిట్ ఆందోళన వ్యక్తంచేశారు. మానవవ్యర్థాలే గంగాజల స్వచ్ఛతను దెబ్బతీస్తున్నాయన్నారు. ఇదిలాఉండగా.. దిల్లీలోని యమునా నదిలోనూ కాలుష్యం కోరలు చాస్తోంది. నీటి కాలుష్యం వల్ల నదిలో విషపూరిత నురుగు ప్రవహిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ఈక్రమంలోనే హరిద్వార్‌లోని గంగాజలంలోనూ నాణ్యత లేకపోవడం గమనార్హం.

వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం

# ఇప్పుడే చూస్తున్నాం

### సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** అధికారం అండతో గన్నుపెట్టి ఆస్తులు రాయించుకోవడం ఎక్కడా లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వ్యాపారాల్లో వాటాలు తీసుకున్న ఘటనలు దేశ చరిత్రలోనే లేవన్నారు. కొత్త తరహా నేరాల పట్ల చర్యలేంటో ప్రభుత్వం తీవ్రంగా ఆలోచిస్తోందని పేర్కొన్నారు. అవినీతి గురించి విన్నాం కానీ.. వ్యాపారాల్లో వాటాలు లాక్కోవడం ఇప్పుడే చూస్తున్నామన్నారు. తుపాకీ చూపించి మరీ ఆస్తుల్లో వాటాలు లాక్కోవడం మునుపెన్నడూ లేదన్నారు. ముంబయిలో మాఫియా బృందాలు లాక్కునే ఆస్తులను సీజ్ చేసే చట్టం ఉందని.. ఆ అంశంపై సమాచారం తెప్పించుకుంటామని చెప్పారు. ఆస్తులను పోగొట్టుకున్న వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

# దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానం



**సియోల్:** దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ పై ఆ దేశ పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఇది గట్టెక్కాలంటే పార్లమెంటులో మూడింట రెండు వంతుల సభ్యుల మద్దతు అవసరం. కనీసం ఆరుగురు రాజ్యాంగ న్యాయమూర్తులు దీనికి అనుకూలంగా ఓటు వేయాల్సి ఉంటుంది. దక్షిణకొరియా పార్లమెంట్‌లో 300 మంది సభ్యులు ఉన్నారు. ఒకవేళ అధ్యక్షుడు అభిశంసనను గట్టెక్కాలంటే 200 మంది సభ్యుల మద్దతు అవసరం. ఈ తీర్మానాన్ని శుక్రవారం లోపు ఓటింగ్‌కు తీసుకురావచ్చని డెమోక్రటిక్ పార్టీ శాసనసభ్యుడు కిమ్ యోంగ్-మిన్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ.. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మంగళవారం సాయంత్రం 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించిన విషయం తెలిసిందే. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో యూన్ సుక్ తన ప్రకటనను విరమించుకున్నా.. ఆయన తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈనేపథ్యంలో 'మార్షల్ లా' అమలును వ్యతిరేకిస్తూ తీర్మానం తీసుకురాగా.. పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మార్షల్ లా అమలు చట్టవిరుద్ధం అంటూ స్పీకర్ ప్రకటించారు. తాజాగా ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ దక్షిణ కొరియా అధ్యక్షుడిపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. కాగా యూన్ సుక్ యోల్ దక్షిణ కొరియా అధ్యక్ష పదవి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నట్లు ఆయన సీనియర్ సలహాదారులు, కార్యదర్శులు చెబుతున్నారు.

# ఆధునిక అభిమన్యుడు దేవేంద్రుడే!



## 'చక్రవ్యూహాన్ని ఛేదించి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన వ్యూహకర్త..

**మహారాష్ట్రలో ఎట్టకేలకు కొత్త ప్రభుత్వం కొలువుదీరబోతోంది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి బీజేపీ సీనియర్ దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖాయమైంది. సీఎంగా మూడోసారి నేడు ప్రమాణస్వీకారం చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.మచ్చలేని రికార్డు, అభివృద్ధి-కేంద్రీకృత ఎజెండా, సాటిలేని రాజకీయ చతురతతో, ఫడ్నవీస్ మహారాష్ట్ర రాజకీయ దృశ్యంలో ఒక మహోన్నత వ్యక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. ఈనేపథ్యంలో ఫడ్నవీస్ జీవితం, రాజకీయ ప్రస్థానంపై విశ్వంభర ప్రత్యేక కథనం..**

**''నేను ఆధునిక అభిమన్యుడిని..**

''నేను సముద్రం లాంటి వాడిని.. మళ్లీ తిరిగొస్తాను'' అని 2019లో ఉద్ధవ్ తన నుంచి సీఎం పీఠం లాక్కొన్న తర్వాత పలు మార్లు దేవేంద్ర ఫడణవీస్ చేసిన వ్యాఖ్యలు. మహా వికాస్ అఘాడీ నుంచి 2022లో తిరిగి పీఠం మహాయుతి దక్కించుకొన్నా.. ఆయన స్థాయిని తగ్గించి డిప్యూటీ సీఎం పదవికే పరిమితం చేశారు. ఈ అంశాన్ని పట్టుకొని తరచూ ఉద్ధవ్ క్యాంప్ ఆయన్ను వెక్కిరించేది. రాజకీయ చక్రవ్యూహంలో ఫడణవీస్ చిక్కుకొన్నట్లు చెప్పేంది. కొన్నాళ్ల క్రితం ఎన్సీపీ నేత సుప్రియ సులే మాట్లాడుతూ ''ఒంటరిగా ఫడణవీస్ ఏం చేయగలడు'' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో భాజపా కూటమి దెబ్బతినడం కూడా ఆయనకు రాజకీయ సవాళ్లను సృష్టించింది. దీంతో మహా రాజకీయాల్లో దేవేంద్రుడి యుగం ముగిసినట్లే అని అంతా భావించారు.

**ఉపముఖ్యమంత్రి బాధ్యతలను వీడి..**

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో ఒక్కసారి అప్రమత్తమైన ఫడణవీస్ ఉపముఖ్యమంత్రి బాధ్యతలను వీడి పార్టీని గాడిన పెట్టాలని ఆశించారు. కానీ, దిల్లీ నేతల సూచనలతో ఆయన పదవిలో కొనసాగినా.. క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేసే పనిని భుజానికెత్తుకొన్నారు. తన పదునైన మాటలతో అభివృద్ధి నినాదాన్ని ప్రచారం చేశారు. ''నేను ఆధునిక అభిమన్యుడిని.. చక్రవ్యూహాన్ని ఛేదించడం, విజయం సాధించడం తెలిసినవాడిని'' అనేది ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రధాన నినాదంగా మారింది. మహారాష్ట్రలోని గ్రామీణ, పట్టణ ప్రజల మద్దతును కూడగట్టగలిగే ఆయన సమర్థత కూటమి విజయానికి బాగా కలిసొచ్చిందనే చెప్పాలి. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో 85శాతం విజయశాతంతో 132 స్థానాల్లో పార్టీని గెలిపించారు.



**బ్యాక్ బెంచర్..**

**యావరేజీ స్టూడెంట్: ఫడ్నవీస్ టీచర్**

ఫడ్నవీస్ స్కూల్ టీచర్ ఒకరు ఫడ్నవీస్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. స్కూల్‌లో ఉన్నప్పుడు ఆయన ఎలా ఉండేవారన్నదానిపై ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ చాలా మర్యాదపూర్వకంగా ఉండేవారని, సున్నితమనస్కుడని తెలిపారు.మహారాష్ట్ర లోని నాగ్‌పూర్ సరస్వతి విద్యాలయంలో ఫడణవీస్ 8 నుంచి 10వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ సమయంలో సావిత్రి సుబ్రమణియం అనే ఉపాధ్యాయురాలు అక్కడ పనిచేశారు. తాజాగా ఫడణవీస్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికవడంతో ఆమెను మీడియా పలకరించింది. దీంతో కాబోయే సీఎంతో తనకున్న అనుబంధాన్ని ఆమె పంచుకున్నారు. ''ఫడ్నవీస్ చదువులో పెద్దగా అసాధారణ ప్రతిభ గల విద్యార్థేం కాదు. యావరేజ్ స్టూడెంటే కానీ బాగానే చదివేవాడు. పొడుగ్గా ఉండటంతో ఎప్పుడూ లాస్ట్ బెంచ్‌లోనే కూర్చునేవాడు. అతడు చాలా సున్నిత మనస్కుడు. తన చుట్టూ ఉన్నవారికి సాయం చేసేందుకు ముందుండేవాడు'' అని గుర్తుచేసుకున్నారు.''ఫడణవీస్ చదువుకునే రోజుల్లో ఆయన తండ్రి గంగాధర్‌రావు ఎమ్మెల్సీగా ఉన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినా అందరితో మర్యాదగా వ్యవహరించేవాడు. అయితే స్కూల్ రోజుల్లో ఒక్కసారి కూడా ఏ ప్రోగ్రామ్‌లోనూ స్టేజ్‌పైకి రాలేదు. ఎందులోనూ పాల్గొనలేదు. అతడు ఇంత మంచి వక్త అవుతాడని ఆ రోజుల్లో నేను అనుకోలేదు. బహుశా ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా చేరిన తర్వాతే మార్పు వచ్చి ఉంటుంది'' అని ఆ టీచర్ తెలిపారు.ఇప్పుడు మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం వచ్చినందుకు ఫడణవీస్ పట్ల గర్వంగా ఉందని ఆమె అన్నారు. ఆయన నాయకత్వంలో మహారాష్ట్ర మరింత పురోగతి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిసెంబరు 5న ఫడణవీస్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

## రాజకీయ ప్రస్థానం..

ఫడ్నవీస్ క్రియాశీల రాజకీయాల్లో రాకమునుపే ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్నారు. 1992 సంవత్సరంలో 22 సంవత్సరాల వయస్సులో కార్పొరేటర్ అయ్యాడు. 5 సంవత్సరాల తరువాత, 1997లో, 27 సంవత్సరాల వయస్సులో ఫడ్నవిస్ నాగ్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్‌కి అతి పిన్న వయస్కుడైన మేయర్ అయ్యాడు. భారతదేశ చరిత్రలో 27ఏళ్ల వయసులో రెండవ అతి పిన్న వయస్కుడైన మేయర్గా ఎన్నికై సంచలనం రేపారు. 1999లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో నాగ్‌పుర్ నైరుతి నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. విదర్భ ప్రాంతంలో ఆయన అత్యంత ప్రభావ వంతమైన నేతగా ఎదిగారు. నాలుగు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచారు. 1 ఏప్రిల్ 2013 నుంచి 6 జనవరి 2015 వరకు దాదాపు యేడాదిన్నర వరకు మహారాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2009 నుంచి నాగ్‌పూర్ పశ్చిమం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వస్తున్నారు.2014లో తన 44వ ఏట ఆయన ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. రాష్ట్ర చరిత్రలో శరద్‌పవార్ తర్వాత అతి పిన్నవయసు సీఎంగా గుర్తింపు పొందారు. ఇక 2014లో మహారాష్ట్రలో గెలిచిన తర్వాత ఆ రాష్ట్ర 18వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.మహారాష్ట్రలో ఒక టర్మ్ మొత్తంగా ముఖ్యమంత్రిగా ఉన్న నేతగా దేవేంద్ర ఫడణవీస్ రికార్డు క్రియేట్ చేసారు. 31 అక్టోబర్ 2014 నుంచి 12 నవంబర్ 2019 వరకు సీఎంగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత 2019లో 23 నవంబర్ నుంచి 28 నవంబర్ వరకు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కేవలం 5 రోజులకే ఫడణవీస్ రాజీనామా చేయాల్సి వచ్చింది.అయితే.. అప్పట్లో శివసేన ..కాంగ్రెస్, ఎన్సీసీలతో కలిసి మహా వికాస్ అఘాడీగా ఏర్పడి ఉద్ధవ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువైంది. అపుడు మహారాష్ట్ర ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వహించారు.ఆ తర్వాత శివసేనలో ఏక్ నాథ్ షిండే నేతృత్వంలో చీలిక తీసుకొచ్చారు. ఆ తర్వాత కొత్తగా ఏర్పడిన మహాయుతిగా ఏర్పడి కూటమిలో ఏక్ నాథ్ షిండే ముఖ్యమంత్రి చేయడంలో కీలక భూమిక పోషించారు. ఆయన మంత్రివర్గంలో తన స్థాయి తగ్గించుకొని ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.2024 లోక్ సభ ఎన్నికల్లో మహా యుతి దెబ్బ తిన్నా.. అసెంబ్లీ ఎన్నికల వరకు పుంజుకొని గోడకు కొట్టిన బంతిలా పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో సక్సెస్ అయ్యారు దేవేంద్ర ఫడ్నవీస్. ఇపుడు మహారాష్ట్రకు మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు.



## ప్రమాణస్వీకార పత్రంలో ఆశ్చర్యపరిచిన ఫడ్నవీస్ కొత్త పేరు

దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారానికి సంబంధించిన ఆహ్వాన పత్రిక ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చీఫ్ సెక్రటరీ సుజాతా సౌనిక్ జారీ చేసిన ఈ ఆహ్వానంలో ఫడ్నవీస్ పేరు '' దేవేంద్ర సరితా గంగధరరావు ఫడ్నవీస్'' అని ఉంది. ఫడ్నవీస్ తల్లి పేరు సరిత కాగా, తండ్రి పేరు గంగాధర్. మహారాష్ట్ర ప్రజలు సాధారణంగా తండ్రిపేరున తమ మిడిల్ నేమ్‌గా ఉపయోగించడం ఆనవాయితీ. అయితే ఫడ్నవీస్ తన తల్లి పేరును ఉపయోగించడం ఇదే మొదటిసారి.ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు దాఖలు చేసిన అఫిడవిట్‌లో బీజేపీ నాయకుడు 'దేవేంద్ర గంగాధర్ ఫడ్నవీస్'ని తన పేరుగా ఉపయోగించారు. 2014 మరియు 2019 ప్రమాణ స్వీకారోత్సవాల సమయంలో తన తల్లిపేరుని తీసుకురాలేదు. ఫడ్నవీస్ టీన్ ఏజ్‌లో ఉన్న సమయంలోనే ఆయన తండ్రి గంగాధర్ రావు క్యాన్సర్‌తో మరణించారు. ఈయన జన్ సంఘ్, బీజేపీ నాయకుడు. ఫడ్నవీస్ సీఎం కావాలని బీజేపీతో పాటు అంతా కోరుకున్నారని తల్లి సరితా ఫడ్నవీస్ అన్నారు. ఫడ్నవీస్ నరేంద్రమోడీకి అభిమాని అని చెప్పారు. ఫడ్నవీస్ భార్య అమృతా ఫడ్నవీస్ బ్యాంకర్, సామాజిక కార్యకర్త. వీరికి దివిజ అనే కూతురు ఉంది.



## ఫడ్నవీస్ గురించి క్లుప్తంగా..

ఫడ్నవీస్ 22 జూలై 1970 మహారాష్ట్రలో విదర్భ ప్రాంతానికి చెందిన మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో గంగాధర్ ఫడ్నవీస్, సరితా ఫడ్నవీస్‌లకు జన్మించారు .అతని తండ్రి, గంగాధర్ ఫడ్నవిస్, నాగ్పూర్ నుండి మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు . అతని తల్లి, సరితా ఫడ్నవిస్, అమరావతికి చెందిన కలోటి కుటుంబానికి చెందినవారు మరియు గతంలో విదర్భ హౌసింగ్ క్రెడిట్ సొసైటీకి డైరెక్టర్‌గా పనిచేశారు . ఫడ్నవీస్ తన ప్రాథమిక పాఠశాల విద్యను అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పేరు మీదుగా ఇందిరా కాన్వెంట్, సరస్వతీ విద్యాలయంలో చదివారు . ఫడ్నవిస్ తన హయ్యర్ సెకండరీ కోసం ధరంపేత్ జూనియర్ కాలేజీలో చదివారు.ఫడ్నవీస్ నాగ్‌పూర్ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ న్యాయ కళాశాల నుండి న్యాయశాస్త్రంలో గ్రాడ్యుయేట్ డిగ్రీని, బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్-గ్రాడ్యుయేట్ డిగ్రీని ,డీఎస్ఈ జర్మన్ ఫౌండేషన్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్, బెర్లిన్, జర్మనీ నుండి మెథడ్స్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమాను కలిగి ఉన్నారు .





## శివసేన, ఎన్సీపీలను చీల్చి బలహీన పర్చడం ఫడ్నవీస్ వ్యూహం..

గత రెండున్నరేళ్లలో బీజేపీకి ప్రధాన అడ్డంకిగా ఉన్న శివసేన, ఎన్సీపీలను చీల్చి బలహీన పర్చడం ఫడ్నవీస్ వ్యూహంగానే చాలా మంది బీజేపీ నేతలు భావిస్తున్నారు. కానీ, ఆయన మాత్రం సదరు పార్టీల చీలికకు వాటిల్లోని అర్హులైన వారిని వెనక్కి నెట్టి అగ్ర నాయకుల కుమారులు, కుమార్తెలను ముందుకు తీసుకురావడమే కారణమని తనకు తాను ఈ వ్యవహారానికి దూరమనే సంకేతాలిచ్చారు. కానీ, అంతిమంగా ప్రత్యర్థులైన ఉద్ధవ్, సుప్రియాకు మాత్రం షాకిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌నాయకుడు మోహన్ భగవత్‌లు అభిమానించే అతికొద్ది మంది భాజపా నేతల్లో ఒకరిగా ఫడణవీస్‌కు కలిసొచ్చింది. 'దేశానికి నాగ్‌పుర్ ఇచ్చిన బహుమతి ఫడణవీస్' అని మోదీ తరచూ పేర్కొంటుండటం దీనికి నిదర్శనం. ఇక ఆర్ఎస్ఎస్‌తో ఆయనకున్న ఏళ్ల తరబడి అనుబంధం కారణంగానే.. ఆ సంస్థ నుంచి ఈ సారి బలమైన మద్దతు లభించింది. అందుకే పోలింగ్ ముగిసిన వెంటనే ఆ సంస్థ ప్రధాన కార్యాలయానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధిని ఇష్టపడే నేతగా పేరు..

మహారాష్ట్రలో అభివృద్ధి పనులు చేయడానికి ఫడణవీస్ శక్తివంచన లేకుండా కృషి చేయడం ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించింది. నాగ్‌పుర్ నుంచి ముంబయికి సమృద్ధి మహామార్గ్, కోస్టల్ రోడ్, అటల్ సేతు, ముంబయి మెట్రో వంటి భారీ ప్రాజెక్టులు వాస్తవిక రూపం ధరించడలో ఫడణవీస్ పాత్ర చాలా కీలకం.

ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో

## రెండు స్థానాలు కోల్పోయిన జైస్వాల్



**ముంబయి:** ఐసీసీ తాజాగా టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనతో బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో అత్యుత్తమమైన రెండో స్థానానికి చేరిన టీమ్ఇండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ .. తాజాగా రెండు స్థానాలను కోల్పోయాడు. నాలుగో స్థానానికి చేరాడు. దీనికి కారణం ఇంగ్లాండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ ప్రదర్శన. న్యూజిలాండ్‌పై 171 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడిన బ్రూక్ రెండో స్థానానికి ఎగబాకాడు. తొలి స్థానంలో కొనసాగుతున్న జో రూట్‌కు చేరువగా వచ్చాడు. ఇక ఈ విభాగంలో రిషభ్ పంత్ ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా స్టార్ పేసర్ బుమ్రా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. అశ్విన్ నాలుగో స్థానంలో ఉండగా.. రవీంద్ర జడేజా ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని ఆరో ప్లేస్‌కు చేరుకున్నాడు. జట్ల పరంగా టీమ్ఇండియా రెండో ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. ఆస్ట్రేలియా తొలిస్థానంలో ఉంది.ఇక ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో టీమ్ఇండియా పెర్త్ టెస్టులో ఘన విజయం సాధించి ఈ సిరీస్‌లో 10 ఆధిక్యంలో కొనసాగుతోంది.

## కొత్త బాధ్యతల్లో సారా తెందూల్కర్..



**ముంబయి:** క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కుమార్తె సారా తెందూల్కర్ కొత్త బాధ్యతలు స్వీకరించారు. సచిన్ తెందూల్కర్ ఫౌండేషన్ (ఎస్‌టీఎఫ్) డైరెక్టర్‌గా ఆమె నియమితులయ్యారు. ఈవిషయాన్ని స్వయంగా సచిన్ 'ఎక్స్' (ట్విటర్) వేదికగా వెల్లడించారు. ''నా కుమార్తె సారా ఎస్‌టీఎఫ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం మరింత ఆనందంగా ఉంది. ఆమెకు వైద్యరంగంపై ఉన్న విద్యా పరిజ్ఞానం సమాజ సాధికారికతకు మరింత తోడ్పడుతుంది'' అని ఆయన పేర్కొన్నారు. చిన్నారులతో కలిసి సారా దిగిన ఫొటోలను జత చేశారు. కాగా.. మారుమూల పల్లె ప్రాంతాల్లోని పిల్లలకు వైద్య సేవలు అందిస్తూ, పోషకాహార లోపాన్ని అధిగమించేలా ఈ ఫౌండేషన్ సహాయ కార్యక్రమాలు చేపడుతోంది. సారా తెందూల్కర్ లండన్‌లోని యూనివర్సిటీ నుంచి క్లినికల్ అండ్ పబ్లిక్ హెల్త్ న్యూట్రిషన్‌లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ప్రస్తుతం ఆమె ఫౌండేషన్‌లో భాగం కావడంపై క్రికెట్ దిగ్గజం హర్షం వ్యక్తంచేశారు.

# పీసీబీ డిమాండ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన బీసీసీఐ!



**ముంబయి:** పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది నిర్వహించే ఛాంపియన్స్ ట్రోఫీపై పీఠముడి కొనసాగుతోంది. ఈ ట్రోఫీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తే.. భవిష్యత్‌లో భారత్‌లో ఐసీసీ ఈవెంట్లను కూడా అదే మోడల్‌లో నిర్వహించాలని పాక్ మెలిక పెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీసీబీ పెట్టిన ఈ కండిషన్‌కు బీసీసీఐ గట్టి కౌంటర్ ఇచ్చినట్లు సమాచారం.పాకిస్థాన్‌లో భద్రతా కారణాల రీత్యా తాము అక్కడ పర్యటించేది లేదని ఇప్పటికే బీసీసీఐ తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైబ్రిడ్ మోడల్‌పై పీసీబీ షరతు పెట్టిన విషయం తెలిసిందే. దీనిని బీసీసీఐ తిరస్కరించినట్లు ఓ మీడియా కథనంలో పేర్కొంది. భారత్‌లో ఎలాంటి భద్రతాపరమైన సమస్యలు లేవని.. ఇక్కడ నిర్వహించే ఐసీసీ ఈవెంట్లకు హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించే ప్రశ్నే లేదని బీసీసీఐ తేల్చిచెప్పినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐసీసీకి బీసీసీఐ స్పష్టం చేసినట్లు సమాచారం.

భారత్‌లో వచ్చే ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్ జరగనుంది. 2026లో శ్రీలంకతో కలిసి సంయుక్తంగా టీ20 ప్రపంచకప్ నిర్వహించనుంది. 2029 ఛాంపియన్స్ ట్రోఫీ, 2031 వన్డే ప్రపంచ కప్‌లకు భారత్ వేదిక కానుంది. ఈ నేపథ్యంలోనే పాకిస్థాన్ తాజా డిమాండ్ చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీపై పీసీబీ తన మొండి వైఖరిని అలాగే కొనసాగిస్తే.. ఆతిథ్య హక్కులను కోల్పోయే ప్రమాదం ఉంది. పాక్ దారికి రాకుంటే.. ఇతర దేశాలకు ఈ టోర్నీని ఐసీసీ తరలించే అవకాశం ఉంది.

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ..

# కోహ్లీ టాప్ స్కోరర్‌గా నిలుస్తాడు

ఆసీస్ మాజీ కెప్టెన్



**సిడ్నీ:** గత కొన్నాళ్లుగా టెస్టుల్లో పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడిన విరాట్ కోహ్లీ.. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్ తొలి టెస్టులో సెంచరీ చేసి గాడిలో పడ్డాడు. ఇటీవల కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల్లో 93 పరుగులే చేసిన అతడు.. పెర్త్ వేదికగా ఆసీస్‌తో జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 143 బంతుల్లో శతకం పూర్తి చేసుకొని ఫామ్‌లోకి వచ్చాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఇప్పటికే మంచి రికార్డు కలిగిన విరాట్.. ప్రస్తుతం జరుగుతున్న సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలుస్తాడని ఆసీస్ మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు.

పెర్త్ టెస్టులో ఆసీస్ ఓటమి విషయాన్ని పక్కనపెడితే, తొలి మ్యాచ్‌లోనే కోహ్లీ సెంచరీ చేయడం తనను చాలా భయపెడుతోందన్నాడు. అడిలైడ్ వేదికగా జరిగే రెండో టెస్టు (పింక్ బాల్ టెస్టు) గురించి కూడా క్లార్క్ మాట్లాడాడు. 'అడిలైడ్ టెస్టులో మార్నస్ లబుషేన్ సెంచరీ చేస్తాడు. కానీ, ఆసీస్ తరఫున స్టీవ్ స్మిత్ టాప్ స్కోరర్‌గా నిలుస్తాడు. మిచెల్ స్టార్క్ పింక్ బాల్‌ను మరింత స్వింగ్ చేయగలడు. అడిలైడ్‌లో బంతి మరింత స్వింగ్ అవుతుంది. ఆస్ట్రేలియా తరఫున స్టార్క్, టీమ్ఇండియాలో జస్‌ప్రీత్ బుమ్రా ఎక్కువ వికెట్లు పడగొడతారు' అని మైకేల్ క్లార్క్ వివరించాడు.

కోహ్లీ ఫామ్‌ను కొనసాగిస్తూ అడిలైడ్ టెస్టులోనూ సెంచరీ చేస్తే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో 10 శతకాలు చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం కోహ్లీ (9 సెంచరీలు), సచిన్ (9 సెంచరీలు) సమంగా ఉన్నారు. ఆసీస్ తరఫున అత్యధికంగా స్టీవ్ స్మిత్ (8 సెంచరీలు), రికీ పాంటింగ్ (8 సెంచరీలు) బాదారు. అడిలైడ్ స్టేడియంలో విరాట్ కోహ్లీకి అద్భుతమైన రికార్డు ఉంది. టెస్టుల్లో ఇక్కడ 8 ఇన్నింగ్స్‌ల్లో 63.62 సగటుతో 509 రన్స్ చేశాడు. 2014లో జరిగిన మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 115, సెకండ్ ఇన్నింగ్స్‌లో 141 పరుగులు చేశాడు.

అండర్-19 ఆసియా కప్‌లో

## దంచికొట్టిన వైభవ్ సూర్యవంశీ..

సెమీస్‌కు భారత్



**షార్జా:** అండర్19 ఆసియా కప్‌లో యువ భారత్ సెమీస్‌కు చేరింది. బుధవారం యూఏఈతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో టీమ్ఇండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈని 44 ఓవర్లలో 137 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. గత రెండు మ్యాచ్‌ల్లో నిరాశపర్చిన 13 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ (76*; 46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లు) ఈ సారి మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (67*; 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకం బాదాడు. దీంతో 138 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 16.1 ఓవర్లలోనే ఛేదించింది. శుక్రవారం (డిసెంబరు 6) జరిగే సెమీస్‌లో భారత్‌తో శ్రీలంక తలపడనుంది. ఫైనల్ డిసెంబరు 10న దుబాయ్ వేదికగా జరగనుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టులో ఒక్కరూ కూడా అర్ధ శతకం చేయలేకపోయారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ రాయన్ ఖాన్ (35; 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. అక్షత్ రాయ్ (26), ఏతాన్ డిసౌజా (17), ఉద్దీష్ (16) పరుగులు చేశారు. టీమ్ఇండియా బౌలర్లలో యుధజిత్ 3, చేతన్ శర్మ 2, హార్దిక్ రాజ్ 2, కార్తికేయ, ఆయుష్ మాత్రే ఒక్కో వికెట్ పడగొట్టారు.

## బీసీసీఐ కార్యదర్శి రేసులో ఉన్నది వీరే!



**ముంబయి:** మొన్నటివరకు బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న జై షా ఇటీవల ఐసీసీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో అతడి స్థానంలో బీసీసీఐ కార్యదర్శిగా ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తిరేపుతోంది. గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్, ప్రస్తుతం బీసీసీఐ జాయింట్ సెక్రెటరీగా ఉన్న దేవ్‌జిత్ సైకియా రేసులో ఉన్నట్లు సమాచారం. దిల్లీ క్రికెట్ సంఘం అధ్యక్షుడు రోహన్ జైట్లీ కూడా బీసీసీఐ కార్యదర్శిపై ఆసక్తితో ఉన్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, అవన్నీ తప్పుడు కథనాలని ఆయన కొట్టిపారేశారు.'ఏం జరుగుతుందో మాకు తెలియదు. అందరూ (బీసీసీఐ అధికారులు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు) ఈ విషయంపై మౌనంగా ఉన్నారు. ప్రస్తుతానికి జాయింట్ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా తాత్కాలిక కార్యదర్శిగా ఉంటారు. రోజువారీ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన సమస్యలు చాలా ఉన్నాయి. కార్యదర్శిగా ఎన్నికయ్యే వారికి బీసీసీఐ ఎలా నడుస్తుందనే దానిపై కొంచెం అవగాహన ఉండాలి' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. బీసీసీఐ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ఆఫీస్ బేరర్ రాజీనామా చేసినట్లయితే 45 రోజుల్లోపు బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించి అతని స్థానంలో కొత్తవారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎన్నికలు నిర్వహించడం కోసం కనీసం నాలుగు వారాల ముందు ఎన్నికల అధికారిని కూడా నియమించాల్సి ఉంటుంది.

# కంగారులను వణికిస్తున్న జస్ప్రీత్ బుమ్రా..

**మీడియాలోనూ మిస్టరీ బౌలర్ గురించే చర్చ..!**



**ముంబయి:** బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా టీమిండియా ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్నది. ఐదు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే భారత జట్టు 10 ఆధిక్యంలో ఉన్నది. పెర్త్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా నేతృత్వంలోని టీమిండియా ఘన విజయం అందుకున్నది. ఈ మ్యాచ్‌లో బుమ్రా విధ్వంసక బౌలింగ్‌తో ఆస్ట్రేలియా కుప్పకూలింది. ప్రస్తుతం ఆ జట్టు ఈ నెల 6 నుంచి అడిలైడ్ వేదికగా జరిగే పింక్ బాల్ టెస్ట్‌లో అతన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు వేస్తున్నది. అడిలైడ్ టెస్ట్‌కి ముందు ఆస్ట్రేలియా జట్టుతో పాటు మీడియాలోనూ బుమ్రా గురించే చర్చ సాగుతున్నది. పెర్త్ టెస్ట్‌లో 72 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టి భారత్‌కు 295 పరుగుల విజయాన్ని అందించాడు. ఈ క్రమంలో బుమ్రా బౌలింగ్‌ను ఆస్ట్రేలియా వెటరన్స్ తుఫానుతో పోల్చారు. అడిలైడ్ టెస్ట్‌లో బుమ్రాను ఎదుర్కోవాలని ఆ జట్టు మాజీ ప్లేయర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఆసిస్ జట్టుకు సూచించాడు.

**ఆస్ట్రేలియాపై మెరుగ్గా బుమ్రా రికార్డు..**

ఆస్ట్రేలియాపై బుమ్రా రికార్డు మెరుగ్గానే ఉన్నది. ఆసిస్ గడ్డపై ఎనిమిది టెస్టులు ఆడిన బుమ్రా 18.80 సగటుతో మొత్తం 40 వికెట్లు తీశాడు. అడిలైడ్ టెస్ట్‌లో బుమ్రాను పింక్ బాల్‌తో ఎదుర్కోవడం కష్టమేనని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. ఎందుకంటే పింక్ బాల్ చాలాసమయం పాటు మెరుస్తూ ఉంటుంది. ఇది ఫాస్ట్ బౌలర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా పింక్ బాల్ టెస్ట్‌లో బుమ్రాకు మంచి రికార్డే ఉన్నది. ఈ మిస్టరీ బౌలర్ మూడు డేనైట్ టెస్టులో ఆడాడు. ఇందులో 14.50 సగటుతో పది వికెట్లు తీశాడు. 2020 అడిలైడ్ టెస్ట్‌లో కేవలం రెండువికెట్లే తీయగలిగాడు. పెర్త్ టెస్ట్‌లో ఘోర పరాజయం తర్వాత ఆస్ట్రేలియా వికెట్ కీపర్ అలెక్స్ కారీ.. మిస్టరీ బౌలర్‌పై ప్రశంసలు కురిపించాడు. బుమ్రా ఓ గొప్ప ఔలర్ అని.. భారత జట్టు బౌలింగ్ బాధ్యతలను తన భుజాలపై మోస్తున్నాడన్నాడు.

**ఓపిగ్గా ఉండాలన్న గిల్‌క్రిస్ట్..**

తమ బ్యాటర్స్ ప్రపంచస్థాయి ఆటగాళ్లని.. ఎప్పుడూ బౌలర్లను ఎదుర్కొనేందుకు పరిష్కారాలను కనుక్కుంటారన్నాడు. తమ బ్యాటర్లు సెకండ్ స్పెల్‌లో బంతిని బాగా ఎదుర్కొంటారని ఆశిస్తున్నట్లు చెప్పాడు. బంతి పాతబడుతున్న కొద్దీ బ్యాటింగ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పాడు. రెండో ఇన్నింగ్స్‌లో ట్రావిస్ హెడ్ ఎలా ఎదురుదాడి చేసాడో పెర్త్‌లో చూశామని.. ఇదే నమ్మకం ఉందన్నాడు. బుమ్రాతో పాటు ఇతర భారత బౌలర్లను ఖచ్చితంగా ఎదుర్కొంటామన్నారు.

అడిలైడ్ టెస్ట్‌పై గిల్‌క్రిస్ట్ స్పందిస్తూ బుమ్రాను ఆస్ట్రేలియా బ్యాటర్లు ఓపికగా ఉండాలని సూచించాడు. బుమ్రా ఎక్కువ సేపు బౌలింగ్ చేయాలని.. తద్వారా స్టీవ్ స్మిత్ వంటి దిగ్గజాలు తిరిగి ఫామ్‌లోకి రావచ్చన్నాడు. మార్కస్ లాబుష్చాగ్నే మొదట్లో కనీసం 50 బంతులను ఓపికగా ఎదుర్కోవాలని.. ఆ తర్వాత సరైన దిశలో సాగుతారని చెప్పాడు.

**బుమ్రాపై అలిస్టర్ కుక్ ప్రశంసలు..**

ఇక ఇంగ్లండ్ గ్రేట్ బ్యాట్స్‌మెన్ అలిస్టర్ కుక్ సైతం బుమ్రాను మెచ్చుకున్నాడు. పెర్త్ టెస్ట్‌లో మొదట బ్యాటింగ్ చేయడం సాహసోపేతమైన నిర్ణయమని ప్రశంసించాడు. కెప్టెన్ మరొకరయి ఉంటే.. మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకునేవాడని.. కానీ, బుమ్రా అలా చేయలేదన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 150 పరుగులకే కుప్పకూలిన భారత జట్టు సహనం కోల్పోకపోవడం మరింత ఆశ్చర్యం కలిగించిందన్నాడు. బుమ్రా నాయకత్వంలో ఆస్ట్రేలియాను కేవలం 104 పరుగులకే కట్టడి చేయడం ద్వారా టెస్ట్‌లో ఆధిక్యం సాధించిందని.. తొలి టెస్టులో ముందుగా బ్యాటింగ్ చేయడం భారత జట్టు ధైర్యంగానూ, ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించగలదన్న విశ్వాసంతో ఉందని ప్రశంసించాడు. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ని తుది 11 మంది జట్టులోకి తీసుకోకపోవడంపై స్పందించాడు. టెస్టుల్లో 500 వికెట్లు తీసిన బౌలర్ అశ్విన్ అని.. అన్ని రంగంలోకి దించకపోవడంపై ఎంత ధైర్యంగా ఉన్నారో (టీమిండియా) ఆలోచించాలని చెప్పాడు. అశ్విన్ అద్భుతమైన బౌలర్ అని.. అతను ఎప్పుడూ బెస్ట్ ప్రదర్శన చేస్తాడని.. జట్టు మద్దతు తెలుపుతుందన్నాడు.

## అడిలైడ్‌లో టీమిండియాను ఎదుర్కొనేందుకు సిద్ధం

ఆసిస్ స్పిన్నర్ నాథన్ లియాన్



**సిడ్నీ:** ఆస్ట్రేలియాతో ఈ నెల 6 నుంచి అడిలైడ్ వేదికగా టీమిండియా రెండో టెస్ట్‌లో తలపడబోతున్నది. బోర్డర్ గవాస్కర్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా ఇప్పటికే.. టీమిండియా 10 ఆధిక్యంలో నిలిచింది. పెర్త్ టెస్ట్‌లో టీమిండియా 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డే నైట్ టెస్ట్‌కు ముందు సీనియర్ స్పిన్నర్ నాథన్ లియాన్ మాట్లాడాడు. టీమిండియాలో అందరూ స్టార్ ఆటగాళ్లే ఉన్నారన్నారని చెప్పాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు జస్ప్రీత్ బుమ్రా, విరాట్ కోహ్లీపై మాత్రమే కాకుండా భారత ఆటగాళ్లందరినీ ఎదుర్కొనేందుకు జట్టు సిద్ధమవుతుందని తెలిపాడు. భారత జట్టును చూస్తుంటే సూపర్ స్టార్ల సమూహంగా కనిపిస్తుందని.. క్రికెట్ జట్టుగా ఆడాల్సిన క్రీడ అని.. ఇందులో గెలవాలంటే అందరూ రాణించాల్సిందేనని చెప్పాడు. భారత్‌లో బుమ్రాతో పాటు మరికొందరు అసాధారణ ఆటగాళ్లు ఉన్నారన్నాడు. భారత జట్టును ప్రశంసిస్తూ.. భారత్‌లోని మిగతా ఆటగాళ్లు సైతం అద్భుతమైన ప్రతిభావంతులని.. జట్టు గొప్పగా ఉందని పేర్కొన్నాడు.తాము ఏ ఒక్క ఆటగాడిపై దృష్టి పెట్టబోడవడం లేదన్నాడు. మైదానంలోకి దిగబోయే ప్రతి భారతీయ ఆటగాడిపై గౌరవం ఉంటుందని.. దాని అర్థం తాము పోటీ ఇవ్వమని అర్థం కాదని.. కానీ, మా పద్ధతిలో క్రికెట్ ఆడాలని అనుకుంటున్నామని.. గొప్ప జట్టుకు గట్టి పోటీ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పాడు. తొలి టెస్ట్‌లో ఆఫ్ స్పిన్నర్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. అతని స్థానంలో వాషింగ్టన్ సుందర్‌కు తాత్కాలిక కెప్టెన్ బుమ్రా అవకాశం ఇచ్చాడు. ఈ నిర్ణయంపై తనకు షాక్ ఇచ్చిందని ఆస్ట్రేలియా స్పిన్నర్ చెప్పాడు. ఎవరు మైదానంలోకి వచ్చిన అది మంచి సవాల్‌గానే ఉంటుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్‌రెడ్డి గురించి మాట్లాడుతూ.. లియాన్ బౌలింగ్‌ను నితీశ్ రెడ్డి ఎదుర్కొన్నాడు. అయితే, అతని బ్యాటింగ్ చూసి ఆశ్చర్య పోలేదని.. అతను ఫోర్లు బాదేందుకు ప్రయత్నిస్తున్నాడని.. దాంతో తనకు వికెట్లు తీసేందుకు అవకాశం ఉందని చెప్పాడు. భవిష్యత్‌లోనే ఇలాంటి అవకాశాలు మరిన్ని వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు.

## ఒడుదొడుకులు ఎదుర్కొని..

## స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఒడుదొడుకుల అనంతరం స్వల్ప లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నా.. ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలో ఎంపీసీ భేటీ నేడు ప్రారంభమైంది. శుక్రవారం నిర్ణయాలు వెలువడనున్నాయి. వడ్డీ రేట్లు తగ్గించకపోయినా.. సీఆర్ఆర్‌ను తగ్గించొచ్చన్న అంచనాల నేపథ్యంలో ఇవాళ బ్యాంకింగ్ స్టాక్స్ రాణించాయి.సెన్సెక్స్ ఉదయం 81,036.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,845.75) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,630.53 81,245.39 మధ్య కదలాడింది. చివరికి 110.58 పాయింట్ల లాభంతో 80,956.33 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్ల లాభంతో 24,467 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టీసీఎస్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, అదానీపోర్ట్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, మారుతీ సుజుకీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.05 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2663 డాలర్ల వద్ద కొనసాగుతోంది.








అపజయమెరుగకుండా వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, కథల ఎంపికలో వైవిధ్యం చూపిస్తూ, ప్రతి చిత్రంతోనూ ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నారు. బాలకృష్ణ తన తదుపరి చిత్రం 'డాకు మహారాజ్'ను బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. కేవలం ప్రకటనతోనే 'డాకు మహారాజ్' సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక ప్రచార చిత్రాలతో ఈ చిత్రంపై అంచనాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా ఇటీవల విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

నందమూరి అభిమానులతో పాటు, సాధారణ ప్రేక్షకుల్లో 'డాకు మహారాజ్' చూడాలనే ఆసక్తి రోజురోజుకి పెరుగుతోంది. తన చిత్రాలలో కథానాయకులను సరికొత్తగా చూపించడంలో దర్శకుడు బాబీ కొల్లి దిట్ట. బాలకృష్ణ కెరీర్ లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతోన్న 'డాకు మహారాజ్'లోనూ, బాలకృష్ణను మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో దర్శకుడు బాబీ చూపిస్తున్నారు.

టైటిల్ టీజర్‌లో బాలకృష్ణ సరికొత్త లుక్, అద్భుతమైన విజువల్స్ కట్టిపడేశాయి. ప్రతి ఫ్రేమ్ లోనూ భారీతనం కనిపించింది. యాక్షన్ సన్నివేశాలు, సంభాషణలు, నేపథ్య సంగీతం ఇలా ప్రతిదీ ఉన్నత స్థాయిలో ఉన్నాయి. థియేటర్లలో ప్రేక్షకులను సరికొత్త అనుభూతిని అందించే భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ను అందించబోతున్నట్లు, టీజర్ తోనే వాగ్దానం చేశారు దర్శకుడు బాబీ.

తాజాగా 'డాకు మహారాజ్' చిత్రీకరణ పూర్తయిందని నిర్మాతలు ప్రకటించారు. ముందుగా ప్రకటించినట్లుగానే సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'డాకు ఇన్ యాక్షన్' పేరుతో చిత్రీకరణ సమయంలోని ఒక ఫొటోని విడుదల చేశారు. ఆ ఫొటోలో దర్శకుడు బాబీ కీలక సన్నివేశం గురించి వివరిస్తుండగా, బాలకృష్ణ శ్రద్ధగా వింటూ కనిపించారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

సంచలన స్వరకర్త ఎస్.థమన్ సంగీతం అందిస్తుండగా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్ గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు.'డాకు మహారాజ్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

# రైటర్ అవుదామని వచ్చి నిర్మాతగా మారిన సత్య



శ్రీ సత్య ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై కుమార్ బాబు లైన్ ప్రొడ్యూసర్‌గా సత్య, నిర్మాణ సారధ్యంలో లవ్ అండ్ హారర్ మూవీని ప్రొడక్షన్ నెంబర్ వన్‌గా రూపుదిద్దుకుంటుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు శాలివాహన నగర్ సంస్థ కార్యాలయంలో జరిగాయి. ఈ సందర్భంగా చిత్రం శ్రీను, ప్రముఖ హాస్య నటి గీత సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నటుడు చిత్రం శ్రీను మాట్లాడుతూ.. నిర్మాత కుమార్ బాబు, తను మంచి స్నేహితులమని చెప్పారు. సంక్రాంతి నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న మంచి హిట్ కొట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రముఖ హాస్య నటి గీత సింగ్ మాట్లాడుతూ.. లవ్ అండ్ హర్రర్‌గా వస్తున్న ఈ చిత్రంలో తనకు మంచి క్యారెక్టర్ ఇచ్చినందుకు దర్శక నిర్మాతలను అభినందించారు. నిర్మాత సత్య మాట్లాడుతూ.. రైటర్ అవుదామని, నిర్మాతలను కలవడం జరిగిందన్నారు. తనే నిర్మాతగా మారితే బాగుంటుందని ఈ చిత్రానికి నిర్మాతగా మారినట్లు తెలిపారు. సినీ రంగంలో తనకు సీనియర్ నిర్మాత కుమార్ బాబు వెన్నంటి ఉన్నారని ఆమె తెలిపారు. సీనియర్ నిర్మాత కుమార్ బాబు మాట్లాడుతూ కొత్త సంవత్సరం 2025 లో శ్రీ సత్య ఆర్ట్ క్రియేషన్ బ్యానర్ పై సినిమాలు నిర్మించాలని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలుగు, కన్నడ, తమిళ్ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి ఏ. లక్ష్మీ మల్లికార్జున, హర్షపి. కిషోర్ లు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కాగా, పి ఆర్ ఓ గా భాను ప్రకాష్ బడే. తదితర టెక్నికల్ టీం, నటీ, నటులు వివరాలను వెల్లడిస్తామని నిర్మాతలు కుమార్ బాబు, శ్రీ సత్య, తెలిపారు.

### మోక్షజ్ఞతో ఆదిత్య 369 సీక్వెల్

# ఆదిత్య 999 మ్యాక్స్ అనౌన్స్



లెజెండరీ యాక్టర్ నందమూరి బాలకృష్ణ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్, కమాండింగ్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు చిరునామా. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన 1991 సైన్స్ ఫిక్షన్ 'ఆదిత్య 369' NBK ఐకానిక్ చిత్రాలలో ఒకటి. శ్రీ కృష్ణ దేవరాయలుగా బాలకృష్ణ పాత్ర ప్రేక్షకులపై చెరగని ముద్ర వేసింది. ఈ చిత్రం ఎవర్ గ్రీన్ క్లాసిక్.
ఒక ఎక్సయిటింగ్ డెవలప్మెంట్ లో డిసెంబర్ 6, 2024న ప్రసారం కానున్న అన్‌స్టాపబుల్ విత్ NBK (సీజన్ 4) ఆరవ ఎపిసోడ్ సందర్భంగా బాలకృష్ణ ఆదిత్య 369కి సీక్వెల్‌ను అనౌన్స్ చేశారు. ఆదిత్య 999 మ్యాక్స్ పేరుతో ఈ సీక్వెల్ అఫీషియల్‌గా వర్క్ లో వుంది, ఈ మోస్ట్ అవైటెడ్ టైమ్‌ట్రావెల్ సాగాలో నెక్స్ట్ చాప్టర్ కోసం అభిమానుల్లో ఎక్సయిట్మెంట్ ని క్రియేట్ చేసింది.
ఆదిత్య 999 మ్యాక్స్‌లో బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ లీడ్ రోల్‌లో నటించనున్నారు. బాలకృష్ణ స్క్రిప్ట్‌లో నిమగ్నమై ఉన్నారు. సీక్వెల్ మోడరన్ సినిమాటిక్ ఎలిమెంట్స్ ని యాడ్ చేస్తూ లెగసీని ముందుకు తీసుకెళుతోంది.
అన్‌స్టాపబుల్ విత్ NBK అప్ కమింగ్ ఎపిసోడ్‌లో బాలకృష్ణ తన ఆదిత్య 369 అవతార్‌లో కనిపిస్తారు, సీక్వెల్ గురించి మరిన్ని వివరాలను వెల్లడించడంతో పాటు ఆదిత్య 999 మ్యాక్స్ మేకింగ్ సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్ అందిస్తుంది.
డిసెంబర్ 6, 2024న ఎపిసోడ్ ఆహాలో ప్రసారం అవుతోంది, బాలకృష్ణ, అతిథులు నవీన్ పోలిశెట్టి, శ్రీలీలతో కాండిడ్ మూమెంట్స్ ని ప్రామిస్ చేస్తుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదిత్య 999 మ్యాక్స్' లోని అన్ని ఇన్ సైడ్ డీటెయిల్స్ కోసం ఈ ఎక్సయిటింగ్ ఎపిసోడ్‌ని మిస్ అవ్వకండి.

# 'పా.. పా..' ట్రైలర్ విడుదల చేసిన రాజాసాబ్ డైరెక్టర్




తమిళ బ్లాక్ బస్టర్ మూవీ డా..డా చిత్రాన్ని తెలుగులో 'పా.. పా..' టైటిల్‌తో జేకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై, నిర్మాత నీరజ కోట విడుదల చేయబోతున్నారు. డిసెంబర్ 13న ఈ మూవీ ఆంధ్ర, తెలంగాణతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా థియేటర్‌లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఆ సందర్భంగా తాజాగా 'పా.. పా..' మూవీ ట్రైలర్‌ను క్రేజీ డైరెక్టర్ మారుతి విడుదల చేశారు.
ఈ సందర్భంగా డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. తమిళ సెన్సేషనల్ మూవీ 'డా..డా' తెలుగులో 'పా.. పా..' పేరిట విడుదలవ్వడం సంతోషంగా ఉందని, ఈ సినిమా తెలుగులోనూ బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమని నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ సబ్జెక్ట్ తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందన్నారు. 'పా.. పా..' చిత్రయూనిట్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు.
గత ఏడాది తమిళంలో 'డా..డా' మూవీ సెన్సేషనల్ హిట్ సాధించింది. కవిన్, అపర్ణ దాస్ ప్రధాన పాత్రదారులుగా, డైరెక్టర్ గణేష్‌కె బాబు తెరకెక్కించిన 'డా..డా' చిత్రం తమిళ ఆడియన్స్‌ని విపరీతంగా ఆకట్టుకుంది. కోలీవుడ్ ఇండస్ట్రీలో డిస్ట్రిబ్యూటర్‌లకు కాసుల వర్షం కురిపించింది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా సుమారు 30 కోట్లు వసూళ్లు సాధించి బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసుకుంది. హార్ట్ టచ్ అయ్యే పాటలు ఈ సినిమాకు మరో హైలైట్ అని చెప్పుకోవచ్చు. ఒకప్పటి పాపులర్ సాంగ్స్ మాదిరిగానే ఈ సినిమా పాటలు స్థిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాలోని పాటలు చాలా హైలెట్ గా నిలుస్తాయని అన్నారు.
తండ్రి కొడుకుల సెంటిమెంట్‌తో తెరకెక్కి తమిళంలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'డా..డా' చిత్రం 'పా.. పా..' పేరుతో తెలుగు ప్రేక్షకులను కూడా బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత నీరజ కోట తెలిపారు. భావోద్వేగం, ప్రేమ, కామెడీ.. ఇవన్నీ సరైన స్థాయిలో మిక్స్ చేసిన ఈ ఫీల్ గుడ్ ఎమోషనల్ డ్రామా.. తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్టు అవుతుందని, బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంజీఎం సంస్థ నుంచి అచ్చిబాబు విడుదల చేయబోతున్నారని చెప్పారు.




## 17న వీబీ ఎంటర్టైన్మెంట్స్ బుల్లితెర అవార్డ్స

వర్చసా లైఫ్ స్పేసస్ ప్రొడ్డీ ప్రెసెంట్స్ వీబీ ఎంటర్టైన్మెంట్స్ బుల్లితెర అవార్డ్స 2023-24 డిసెంబర్ 17న శిల్పకళా వేదిక, హైటెక్ సిటీలో అతిరధ మహారదులు సమక్షంలో అభిమానతారలకు అవార్డుల ప్రధానోత్సవం జరుగుతుందని నిర్వాహకులు విష్ణు బొప్పన తెలిపారు.



### ప్రేక్షకులకు మరింత

# దగ్గరవుతా..

రెబెల్ స్టార్ ప్రభాస్‌తో రాజా సాబ్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన హరి హర వీరమల్లు వంటి ప్రెస్టీజియస్ చిత్రల్లో నటిస్తోంది బ్యూటిఫుల్ హీరోయిన్ నిధి అగర్వాల్. ఈ నేపథ్యంలో ఆమె ఆస్క్ నిధి పేరుతో ఛాట్ చేసింది. పర్సనల్, కెరీర్ విషయాలపై నెటిజన్స్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. మూవీ లవర్స్, అభిమానులు నిధి అగర్వాల్‌కు ప్రశ్నలు పంపించేందుకు ఆసక్తి చూపించారు. ప్రభాస్‌తో కలిసి నటిస్తున్న రాజా సాబ్ సినిమా సెట్‌లో ఎంతో సరదాగా పనిచేశామని, ఈ మూవీ టీంలో ఎంతో డెడికేషన్ ఉందని నిధి అగర్వాల్ తెలిపింది. పవన్ కల్యాణ్‌తో రీసెంట్‌గా ఓ సెల్ఫీ తీసుకున్నానని, త్వరలోనే ఆ సెల్ఫీ పోస్ట్ చేస్తానని నిధి ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చింది. తనకు తెలుగు బాగా మాట్లాడటం వచ్చు అని, కేవలం అందరికీ నమస్కారం అనే బ్యాచ్ కాదని ఫన్నీగా ఆన్సర్ చెప్పింది. పీఆర్ మెయింటేన్ చేయడం తనకు కష్టమైన పనిగా అనిపిస్తుందని పేర్కొంది. నెక్ట్ ఇయర్ తన రెండు మూవీస్ రాజా సాబ్, హరి హర వీరమల్లు రిలీజ్ అవుతాయని, ఆ రెండు చిత్రాలతో నాయికగా ప్రేక్షకులకు మరింత చేరువవుతానని ఆశాభావం వ్యక్తం చేసింది నిధి అగర్వాల్. ఈ రెండు చిత్రాలతో పాటు మరో సర్ ప్రైజింగ్ మూవీ కూడా ఉందని తెలిపింది.

# 'సంక్రాంతికి వస్తున్నాం' గోదారి గట్టు సాంగ్ విడుదల



విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్లాక్‌బస్టర్ కాంబినేషన్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'తో అలరించబోతున్నారు. ఇది వారి సక్సెస్ ఫుల్ కొలాబరేషన్ లో హ్యాట్రిక్ మూవీ. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం మ్యూజిక్ ప్రమోషన్లు మేకర్స్ ఫస్ట్ సింగిల్ గోదారి గట్టు సాంగ్ విడుదల చేయడంతో ప్రారంభమయ్యాయి. గోదారి గట్టు లీడ్ పెయిర్ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ జంటగా అలరించిన రొమాంటిక్ ట్రాక్. భాస్కరభట్ల రచించిన ఈ పాట భార్యాభర్తల మధ్య చిలిపి సరదాలని అందంగా ప్రజెంట్ చేసింది. వారు షేర్ చేసుకునే ఆప్యాయత, ప్రేమను ప్రదర్శిస్తూనే, ఒక బాండింగ్ లో హ్యూమరస్ ఆర్గ్యుమెంట్స్ ని హైలైట్ చేస్తుంది.
ఈ పాట జానపదం టచ్‌ని కలిగి ఉంది, భీమ్స్ సిసిరోలియో అద్భుతంగా కంపోజ్ చేశారు. రమణ గోగుల యూనిక్ స్టయిల్ మెలోడీకి అదనపు ఆకర్షణ తీసుకొచ్చింది. మధు ప్రియ మెస్మరైజ్ చేసే వాయిస్ పాట ఆకర్షణను మరింత పెంచింది.
వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ భార్యభర్తలుగా బ్యూటీఫుల్ కెమిస్ట్రీ షేర్ చేసుకున్నారు. గోదారి గట్టు సాంగ్ సినిమా మ్యూజికల్ ప్రమోషన్‌లకు బ్లాక్‌బస్టర్ బిగినింగ్ అందిస్తూ ఆల్బమ్‌లోని తర్వాతి పాటలపై అంచనాలు పెంచింది
షూటింగ్ పూర్తి కావస్తున్న ఈ ట్రైయాంగిల్ క్రైమ్ కథలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ కాగా, తమ్మిరాజు ఎడిటర్. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ చిత్రం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

# ఒక్కడు కాంబో.. 20 ఏళ్ల తర్వాత మళ్లీ కలిశారు 'యుఫోరియా' సెకండ్ షెడ్యూల్ ప్రారంభం

వైవిధ్యమైన, హిట్ సినిమాలకు పెట్టింది పేరైన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ గుణశేఖర్ ప్రస్తుతం యూత్‌ఫుల్ సోషల్ డ్రామా 'యుఫోరియా'తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దురాగతాలపై తెరకెక్కుతోన్న సినిమా అని అనౌన్స్ చేసినప్పటి నుంచి అందరిలోనూ సినిమా ఆసక్తి మరింత పెరిగింది. ఇటీవల విడుదలైన మూవీ గ్లింప్స్‌తో సినిమాపై ఉన్న అంచనాలు నెక్ట్స్ రేంజ్‌కు చేరుకున్నాయి.
ప్రస్తుతం సినిమా నిర్మాణ దశలో ఉంది. రీసెంట్‌గా ఫస్ట్ షెడ్యూల్ చిత్రీకణ పూర్తయ్యింది. అదే యుఫోరిక్ ఎనర్జీతో మేకర్స్ ఇప్పుడు సెకండ్ షెడ్యూల్ షూటింగ్‌ను స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో సినిమాకు సంబంధించిన స్పెషల్ అప్‌డేట్ ఇస్తూ సెట్స్ నుంచి ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. ఈ వీడియోలో ఎవర్‌గ్రీన్ బ్యూటీఫుల్ యాక్ట్రెస్ సెట్స్‌లో మనకు కనిపించారు. ఆమె మేకప్ వేసుకోవటం, షూటింగ్‌లో పాల్గొనటం వంటి సన్నివేశాలను మనం ఆ వీడియోలో చూడొచ్చు. ఆమె రాకతో ఆ సెట్స్‌కు మరింత ఉత్సాహం వచ్చింది. ఈ గ్లింప్స్ వీడియోలో వెర్సటైల్ డైరెక్టర్ గుణశేఖర్‌గారిని మనం గమనించవచ్చు. 20 ఏళ్ల క్రితం గుణ శేఖర్, భూమిక సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ ఒక్కడు మూవీలో కలిసి పని చేసిన సంగతి తెలిసిందే. యుఫోరియా కోసం మరోసారి ఈ బ్లాక్ బస్టర కాంబో చేతులు కలిపింది. భూమికను దృష్టిలో ఉంచుకుని గుణశేఖర్ ఓ పవర్‌ఫుల్ రోల్‌ను క్రియేట్ చేశారు. ఇప్పుడు విడుదల చేసిన గ్లింప్స్ చూస్తుంటే పవర్‌ఫుల్ రోల్‌లో భూమిక ఎలా మెప్పించనున్నారోనని ఆసక్తి మరింత పెరిగింది.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com